అనుదినం... జనస్వరం


నవతెలంగాణ

మంగళవారం 13-6-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

www.navatelangana.com

సంపుటి : 9 | సంచిక : 163 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50



కోవిన్ పోర్టల్ డేటా చౌర్యం !

కేటీఆర్ వివరాలు కూడా...

- పలువురు నేతల డేటా సైతం...
- బయటపెట్టిన 'ది న్యూస్ మినిట్'
- దర్యాప్తు చేస్తున్నాం : కేంద్రం



న్యూఢిల్లీ : తెలంగాణ ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు సహా కోవిన్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకున్న లక్షలాది మంది వ్యక్తిగత సమాచారం చౌర్యానికి గురైంది. కరోనా వైరస్ వ్యాక్సిన్ తీసుకోవడానికి దేశ ప్రజలు పెద్ద సంఖ్యలో ఈ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకున్న విషయం తెలిసిందే. అయితే వీరి వ్యక్తిగత సమాచారం ఇప్పుడు టెలిగ్రామ్ గ్రూప్ ద్వారా బహిర్గతం అయింది. పేరు, పుట్టిన తేదీ, ఫోన్ నెంబర్, పాస్‌పోర్ట్ లేదా ఆధార్ నెంబర్ వంటి వ్యక్తిగత వివరాలన్నీ ఇప్పుడు తెలిసిపోయాయి. ఈ విషయాన్ని తొలుత 'ది ఫోర్త్' అనే మళయాళీ న్యూస్ పోర్టల్ బయటపెట్టింది. ఈ పోర్టల్ టెలిగ్రామ్ గ్రూప్ నుంచి కేరళ ఆరోగ్య మంత్రి వీణా జార్జ్, కోవిన్ ప్యానల్ ఛైర్‌పర్సన్ రామ్ సేవక్ శర్మ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, కేంద్ర మంత్రి మీనాక్షి లేఖీల వ్యక్తిగత సమాచారం తెలుసుకుంది. కోవిన్ యాప్‌లో 110 కోట్ల మందికి పైగా ప్రజలు తమ వివరాలు నమోదు చేసుకున్నారు.

మళయాళీ పోర్టల్ తెలిపిన వివరాల ప్రకారం బీజేపీ సీనియర్ నేత లేఖీ న్యూఢిల్లీలోని ఎయిమ్స్ 8వ అంతస్తులోని కౌంటర్‌లో వాక్సిన్ వేయించుకున్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ పంగప్పుర ఆరోగ్య కేంద్రంలో తన ఆధార్ నెంబర్ నమోదు చేసి వాక్సిన్ తీసుకున్నారు. కేరళ ఆరోగ్య మంత్రి తన వ్యక్తిగత సెల్ నెంబర్‌తో నమోదై భర్తకు, కుమార్తెకు వాక్సిన్ వేయించారు. ఇదిలా ఉండగా ఈ సమాచార ...5లో

విచారణ జరపాలి

- సీపీఐ(ఎం) డిమాండ్

న్యూఢిల్లీ : కొవిన్ పోర్టల్ నుంచి పెద్ద ఎత్తున డేటా లీకయిందని వచ్చిన వార్తలపై తక్షణమే విచారణ జరపాలని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది. కోవిడ్ వ్యాక్సిన్ వేయించుకోవడం కోసం తమ వ్యక్తిగత వివరాలు నమోదు చేసుకున్న కొవిన్ పోర్టల్ నుంచి ఆధార్ కార్డు నెంబర్లతో సహా ప్రజల వ్యక్తిగత సమాచారం లీకైనట్టు వార్తలు వచ్చాయి. ఇది ...5లో

మోడీ మౌనం బాధించింది



- క్రీడల మంత్రి మా సమస్యలను వినేందుకు ఆసక్తిగా లేరు
- చర్చించేందుకు వెళ్లినప్పుడు ఫోన్‌లో బిజీగా ఉన్నారు
- 15 రాత్రి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తాం : రెజ్లర్ వినేష్ ఫోగట్

వివరాలు 5లో..

పుట్టకముందే విలువలు బోధిస్తారట!

- ఆర్ఎస్ఎస్ 'గర్భ సంస్కార్' కార్యక్రమానికి హాజరైన తమిళిసై



వివరాలు 6లో..

17న కొడకండ్లకు కేటీఆర్

- మినీ టెక్స్‌టైల్ పార్కుకు శంకుస్థాపన
- ఆగస్టు నుంచి వరంగల్ టెక్స్‌టైల్ పార్కులో ఉద్యోగావకాశాలు : మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

వివరాలు 5లో..



ధరణితో ఎన్నో లాభాలు

రాబంధులు లేరు.. పైరవీకారులు లేరు

- తీసివేస్తామన్న వారికి బుద్ధి చెప్పండి
- పక్క రాష్ట్రాల్లో కరెంట్ కటకట.. ఇక్కడ 24 గంటల విద్యుత్
- ఈ అభివృద్ధి ఇలాగే కొనసాగాలంటే మళ్లీ సహకరించాలి
- జోగులాంబ గద్వాల సభలో ముఖ్యమంత్రి కేసీఆర్

నవతెలంగాణ - జోగులాంబ గద్వాల

"పుట్టినప్పటి నుంచి మరణించే వరకు అన్నివర్గాల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోంది.. మూడు సంవత్సరాలు కష్టపడి రైతులకు ఇబ్బందులు ఉండకూడదని ధరణి పథకాన్ని తీసుకొచ్చాం. దానివల్లే రాబంధులు.. పైరవీకారులు లేకుండా పోయారు.. ఇవాళ కొందరు దళారీలు మోపై, వాళ్ల జమానాలో కింద మీద చేసిన వారు ధరణిని తీసివేసి బంగాళాఖాతంలో వేస్తామంటున్నారు.." అని సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా పర్యటనలో సోమవారం ఆయన బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం, పోలీస్ ప్రధాన కార్యాలయం, సమీకృత కలెక్టరేట్‌ను ప్రారంభించారు. అనంతరం అయిజ రోడ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'ధరణితో డబ్బులు నేను హైదరాబాద్‌లో వేస్తే.. నేరుగా మీ బ్యాంకు ఖాతాల్లో జమవుతున్నాయి. ఇవాళ పది నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ అవుతుంది. ఐదు నిమిషాల్లో పట్టా అయిపోతోంది. ఇంత మంచి సదుపాయాన్ని కాంగ్రెస్ పార్టీ బంగాళాఖాతంలో విసిరి వేస్తామంటుంది. ఇది ధరణిని వేయడమా? ప్రజలను బంగాళాఖాతంలో వేయడమా?' అంటూ సీఎం కేసీఆర్ ప్రశ్నించారు. ధరణి ఉంచాలా? తీసేయాలా? అని సీఎం కేసీఆర్ సభలో పాల్గొన్న ప్రజలను ప్రశ్నించగా.. ఉండాలంటూ చేతులెత్తి నినదించారు. ఆదిలాబాద్, కరీంనగర్, నిర్మల్‌లో ఎక్కడైనా ప్రజలు ధరణి ఉండాలని చెబుతున్నారని, ధరణిని ...6లో



తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో

2కే, 5కే రన్స్

పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, సినీ నటులు

- డీజే టిల్లు సాంగ్‌కు మంత్రి మల్లారెడ్డి స్టెప్పులు

నవతెలంగాణ- విలేకరులు

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా 2కే, 5కే రన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు. హైదరాబాద్ పోలీస్ అధ్వర్యంలో నెక్లెస్ రోడ్డులోని ప్రసాద్ ఐమ్యాక్స్ వద్ద 2కే, 5కే రన్ నిర్వహించారు. కార్యక్రమాన్ని హెూంశాఖ మంత్రి మహమ్మద్, క్రీడల మంత్రి శ్రీనివాస్ గౌడ్, సీఎస్ శాంతికుమారి, డీజీపీ అంజనీకుమార్, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే దానం నాగేందర్, సినీనటి శ్రీలీలతోపాటు జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్, సింగర్ మంగ్లి పాల్గొన్నారు. పెద్దఎత్తున యువత ఈ రన్‌కు తరలి వచ్చింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్‌లో తెలంగాణ రన్‌ను ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర, అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్యలు ప్రారంభించారు. ప్రముఖ సినీ నటులు విశ్వక్ సేన్, అశ్విన్, నటి నందిత శ్వేత ఈ రన్‌లో పాల్గొన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో ...5లో

సుస్థిర వ్యవసాయమే లక్ష్యంగా..

హైదరాబాద్‌లో 15 నుంచి జీ-20 వ్యవసాయ మంత్రుల సమావేశాలు : కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆహార భద్రత, సుస్థిర వ్యవసాయమే లక్ష్యంగా హైదరాబాద్‌లో ఈ నెల 15 నుంచి 17 వరకు జీ-20 దేశాల వ్యవసాయ మంత్రుల సమావేశాలు ప్రారంభం కాబోతున్నాయని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. ఆ సమావేశాలకు జీ-20 దేశాలతో పాటు మరో తొమ్మిది దేశాల మంత్రులు కూడా హాజరు కాబోతున్నారన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్‌లో వ్యవసాయ యూనివర్సిటీలు, పరిశోధన సంస్థలున్న నేపథ్యంలో ఇక్కడ జీ-20 సమావేశాలు నిర్వహిస్తున్నామని ...5లో

భూదాన్ భూములపై మౌనమేల?

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి పీసీసీ చీఫ్ రేవంత్ సూటి ప్రశ్న



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తన స్వగ్రామం తిమ్మాపూర్‌లోని భూదాన్ భూములు అన్యాక్రాంతమవుతుంటే కిషన్‌రెడ్డి ఎందుకు మాట్లాడడం లేదు? అని టీపీసీసీ అధ్యక్షులు ఎ.రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "తిమ్మాపూర్లో భూదాన్ భూములు అన్యాక్రాంతం అయ్యాయని భూదాన్ బోర్డు అక్కడి కలెక్టర్‌కి లెటర్ రాసింది. కిషన్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కూడా భూదాన్ భూములపై అప్పటి కలెక్టర్‌కి లేఖ రాశారు. అయితే ఆ కలెక్టర్లే తప్పు చేస్తే చర్యలు తీసుకోవాలని ఆయన ఎందుకు లేఖ రాయడం లేదు... " అని ప్రశ్నించారు. కిషన్‌రెడ్డి రాసిన లెటర్‌ను ఆయనకే కోట్ చేస్తూ నేను ఆయనకే లెటర్ ...6లో



మోగిన బడిగంట

పాఠశాలలకు విద్యార్థుల పరుగులు

- అందని యూనిఫారాలు
- పారిశుధ్య కార్మికుల్లేక అవస్థ
- తొలిరోజు అంతంత మాత్రమే హాజరు
- ఎండల తీవ్రత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో బడిగంట మోగింది. అన్ని జిల్లాల్లో బడులు సోమవారం పునఃప్రారంభమయ్యాయి. 2023-24 విద్యాసంవత్సరం కూడా ప్రారంభమైంది. ఆదివారంతో వేసవి సెలవులు ముగిశాయి. దీంతో సోమవారం ఉదయం పాఠశాలలకు విద్యార్థులు పరుగులు తీశారు. అయితే మొదటి రోజు కావడంతో విద్యార్థుల హాజరు అంతంత మాత్రంగానే ఉంది. బడులకు తక్కువ మంది వచ్చినట్టు సమాచారం. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడం ఒక కారణంగా ఉన్నది. అయితే రోజురోజుకూ హాజరుశాతం పెరుగుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో 26,065 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వ బడుల్లో తొమ్మిదో తరగతి వరకు తెలుగు మీడియంతోపాటు ...5లో

ఎడ్‌సెట్‌లో అమ్మాయిలదే హవా

98.18 శాతం మంది ఉత్తీర్ణత

- ఫలితాలు విడుదల చేసిన లింబాద్రి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో బీఎడ్ కోర్సులో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎడ్‌సెట్ ఫలితాలను సోమవారం హైదరాబాద్‌లో ఉన్నత విద్యామండలి ఛైర్మెన్ ఆర్ లింబాద్రి విడుదల చేశారు. ఎడ్‌సెట్‌కు 31,725 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. వారిలో 27,495 మంది రాతపరీక్షకు హాజరయ్యారు. 26,994 (98.18 శాతం) మంది అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ ఫలితాల్లో అమ్మాయిలు హవా కొనసాగించారు. ఎక్కువ మంది దరఖాస్తు చేయడంలోనూ, అర్హత సాధించడంలోనూ వారే ముందంజలో ఉన్నారు. ఎడ్‌సెట్‌లో 25,716 మంది అమ్మాయిలు దరఖాస్తు చేయగా, 22,400 మంది పరీక్ష రాశారు. వారిలో 21,935 (97.92 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. 6,009 మంది అబ్బాయిలు దరఖాస్తు చేస్తే, 5,095 మంది పరీక్షకు హాజరయ్యారు. వారిలో 5,059 (99.29 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. బీఎడ్ కోర్సులో 80 శాతానికిపైగా అమ్మాయిలే విద్యనభ్యసిస్తుండడం గమనార్హం. ఉపాధ్యాయ ఖాళీల భర్తీ కోసం నోటిఫికేషన్లు సకాలంలో రాకపోవడంతో అబ్బాయిలు ఎక్కువ మంది ఎడ్‌సెట్ రాసేందుకు విముఖత చూపిస్తున్నారని అధికారులు భావిస్తున్నారు. ర్యాంకు కార్డుల కోసం https://edcet.tsche.ac.in వెబ్‌సైట్‌ను చూడాలని అధికారులు సూచించారు.

గొల్ల వినీష టాపర్

ఎడ్‌సెట్ ఫలితాల్లో వికారాబాద్ జిల్లా తాండూర్‌కు చెందిన గొల్ల వినీష టాపర్‌గా నిలిచారు. హైదరాబాద్ జిల్లా బేగంపేటకు చెందిన నిషాకుమారి రెండో ర్యాంకు, ఎం సుశీ మూడో ర్యాంకును పొందారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన వాసాల చంద్రశేఖర్ నాలుగో ర్యాంకును ...6లో

ఇన్‌కం కోసం ఇక్కట్లు

తహసీల్దారు కార్యాలయాలకు తండోప తండాలుగా..

- 'రూ.లక్ష' లబ్ది కోసం చేతివృత్తిదారుల కష్టాలు
- ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం ఎగబడిన దరఖాస్తుదారులు

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి/ కార్పొరేషన్

చేతి వృత్తిదారులు, కుల వృత్తిదారులు ఇన్ కం సర్టిఫికెట్ల కోసం అష్టకష్టాలు పడుతున్నారు.. తహసీల్దార్ కార్యాలయాలకు పెద్దఎత్తున తరలివస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా కులవృత్తులు, చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వెనుకబడిన తరగతుల వారికి ప్రభుత్వం రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయం పథకానికి శ్రీకారం చుట్టిన విషయం విదితమే. దాని కోసం బీసీలు కుల, ఆదాయ సర్టిఫికేట్ల కోసం బారులు తీరారు. తహసీల్దారు కార్యాలయాలకు తండోపతండాలుగా తరలి వస్తున్నారు. దీనిలో భాగంగా ఖమ్మం జిల్లాలోని పలు తహసీల్దారు కార్యాలయాలు దరఖాస్తుదారులతో కిటకిటలాడుతున్నాయి. ఖమ్మం అర్బన్, ఖమ్మం రూరల్ కార్యాలయాలకు సోమవారం మూడు వేలమంది వరకూ దరఖాస్తుదారులు రావటం పరిస్థితి తీవ్రతకు నిదర్శనం.

దరఖాస్తులతో వృత్తిదారులు..

కుల, ఆదాయ సర్టిఫికెట్ల కోసం వెనుకబడిన తరగతుల వారు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో నాయకుల విజ్ఞప్తి మేరకు ప్రత్యేక ఆన్ లైన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు నగరంలోని కార్పొరేటర్లు తమ డివిజన్ల పరిధిలోని వాట్సప్ గ్రూపులలో మెసేజ్ చేశారు. మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆదేశాల మేరకు ఖమ్మం అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక ఆన్‌లైన్ కేంద్రం ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. బీసీ వృతిదారులు రూ.లక్ష ఆర్థిక సహాయ పథకాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ధ్రువీకరణ పత్రాలను పొందాల్సిందిగా సూచించారు.

దాని కోసం జనం ఒక్కసారిగా తహసీల్దార్ కార్యాలయానికి క్యూ కట్టారు. అరకొర సిబ్బంది ఉన్న కార్యాలయంలో వేలాదిగా జనం తరలిరావడంతో ప్రక్రియ కోసం ఏర్పాటు చేసిన కౌంటర్లు కిటకిటలాడాయి. లబ్ది పొందేందుకు ఈనెల 20వ తేదీ చివరి గడువు కావడంతో దరఖాస్తుదారులు భారీగా తరలివచ్చారు. ఖమ్మం అర్బన్, రూరల్ కార్యాలయాలకు భారీగా వృత్తిదారులు రావడంతో తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ...6లో



అరలక్ష దాటిన దరఖాస్తులు

- కుల వృత్తులకు వైభవం తీసుకొస్తాం
- 'బీసీలకు ఆర్థిక సాయం'పై మంత్రి గంగుల

వివరాలు 2లో..

మరో 5 రోజులు భానుడి భగభగలే: ఐఎండీ వెల్లడి



న్యూఢిల్లీ: దేశంలో ఎండలు మండిపోతున్నాయి. జూన్ నెల సగం గడిచినా పగటి ఉష్ణోగ్రతలు ఏమాత్రం తగ్గలేదు. నైరుతి రుతు పవనాలు ఆలస్యం కావడంతో ఇంకా కొన్ని రాష్ట్రాల్లో భానుడి భగభగలు కొనసాగుతూనే ఉన్నాయి. దేశంలోని పలు రాష్ట్రాల్లో మరో ఐదు రోజులు కూడా ఎండలు మండిపోతాయని భారత వాతావరణ కేంద్రం సోమవారం ప్రకటించింది. ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్, ఒడిశా, కోస్తాంధ్రాల్లో రాబోయే ఐదు రోజులపాటు ఎండలు మండిపోతాయని తెలిపింది. అదేవిధంగా ఉత్తరప్రదేశ్ దక్షిణ భాగంలోని వేర్వేరు ప్రాంతాల్లో, పశ్చిమబెంగాల్‌లోని గంగానది పరిసర ప్రాంతాల్లో, బీహార్, జార?ండ్ రాష్ట్రాల్లో కూడా మరో ఐదు రోజులపాటు ఇప్పటిలాగే ఎండలు కొనసాగుతాయని పేర్కొంది. మధ్యప్రదేశ్‌లో మరో రెండు రోజులు భానుడి ప్రతాపం కొనసాగుతుందని ఐఎండీ చెప్పింది.

ప్రగతిశీల ఆలోచనలకు వెలుగురేఖ కేరళ

అమెరికాలోని ప్రవాసుల సమావేశంలో కేరళ సీఎం విజయన్



న్యూయార్క్ : కేరళ ప్రగతిశీల ఆలోచనల వెలుగుగా ప్రకాశిస్తోందని, ఇక్కడ ప్రతి గొంతుకకు ప్రాముఖ్యత ఉందని, ఐక్యతా స్ఫూర్తి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తోందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అన్నారు. టైమ్స్ స్క్వేర్‌లో జరిగిన బహిరంగ కార్యక్రమంలో ఆదివారం విజయన్ వందలాదిమంది ప్రవాస కేరళ సంఘం సభ్యులను ఉద్దేశించి ప్రసంగించారు. న్యూయార్క్‌లో ప్రవాస కేరళీయుల సదస్సు, లోక కేరళ సభ అమెరికన్ ప్రాంతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. గత ఆరేండ్లలో ప్రతి రంగంలోనూ భారీ ప్రగతి సాధించామని చెప్పారు. కేరళ ప్రగతిశీల విలువలు, సామాజిక సామరస్యం, సమానమైన వృద్ధికి ప్రాధాన్యత నిస్తున్నదని వివరించారు. ప్రభుత్వ పాఠశాలలు, ఆరోగ్య వ్యవస్థ, ఇతర రంగాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి , పెట్టుబడులు, తన పరిపాలన ద్వారా సాధించిన ఆర్థిక వృద్ధి, అభివృద్ధిని వివరించారు. సమ్మిళిత అభివృద్ధికి కేరళ రాష్ట్రం ఒక నమూనా అని, ప్రజల కేంద్రీకృత ప్రగతికి ఉదాహరణగా అవతరించిందన్నారు. "మా విధానాలు అట్టడుగు వర్గాలకు సాధికారత కల్పిస్తాయి . అందరికీ సమాన అవకాశాలను పెంపొందిస్తాయి" అని ముఖ్యమంత్రి అన్నారు. కేరళ ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించిందని, దీని ఫలితంగా జాతీయ ఆహార భద్రత సూచికలో రాష్ట్రం ప్రధాన స్థానాన్ని సాధించిందని చెప్పారు. కేరళ అత్యధిక అక్షరాస్యత కలిగిన రాష్ట్రమని, నిటి ఆయోగ్‌తో సహా అనేక ఏజెన్సీలు దేశంలోనే ప్రభుత్వ పాఠశాలలు , ఆస్పత్రులను అత్యుత్తమమైనవిగా గుర్తించాయని విజయన్ పేర్కొన్నారు.

"మాకు అత్యుత్తమ శాంతి భద్రతలు ఉన్నాయి. మత సామరస్యం , శాంతియుత సహజీవనం ఎల్లప్పుడూ ఉండేలా చేయడం వల్లే ఇదంతా సాధ్యమైంది. గత కొన్నేళ్లుగా కేరళలో ఒక్క మత హింస కూడా జరగలేదని "ప్రేక్షకుల హర్షధ్వానాల మధ్య సీఎం చెప్పారు. "మీ భూమిని మరింత సంపన్నం చేసేందుకు రాబోయే కాలంలో మాతో సహకరిస్తూ ఉండండి" అని ఆయన అమెరికాతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న మలయాళీలకు పిలుపునిచ్చారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

- ఫస్టియర్‌కు 91.22, సెకండియర్‌కు 87.42 శాతం హాజరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం సెకండ్ లాంగ్వేజ్ పేపర్-1కు 93,008 మంది దరఖాస్తు చేయగా, 84,835 (91.22 శాతం) మంది హాజరయ్యారని వివరించారు. 8,173 (8.78 శాతం) మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్‌లో ముగ్గురిపై మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం సెకండ్ లాంగ్వేజ్ పేపర్-2కు 31,298 దరఖాస్తు చేసుకుంటే, 27,359 (87.42 శాతం) మంది పరీక్ష రాశారని వివరించారు. 3,939 (12.58 శాతం) మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని తెలిపారు. సూర్యాపేట, సిద్ధిపేట, మహబూబ్‌నగర్, వికారాబాద్ జిల్లాల్లో పరిశీలకులు సందర్శించి పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారని పేర్కొన్నారు.

ఆగస్టు 8న స్టాఫ్ నర్సు పోస్టులకు పరీక్ష

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి ఆగస్టు 8న కంప్యూటర్ బేస్డ్ పరీక్షను నిర్వహించనున్నట్టు మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్ మెంట్ బోర్డు (ఎంహెచ్ ఎస్ఆర్‌బీ) తెలిపింది. ఈ మేరకు సోమవారం బోర్డు సభ్య కార్యదర్శి ఒక ప్రకటన విడుదల చేశారు. 5,204 స్టాఫ్ నర్సు పోస్టులను భర్తీ చేసేందుకు గతేడాది డిసెంబర్ 30న నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే.

పాక్ గగనతలంలోకి ఇండిగో విమానం

ఇస్లామా బాద్: అమత్‌సర్ నుంచి అహ్మ దాబాద్‌కు బయలుదేరిన ఓ ఇండిగో విమానం ప్రతికూల వాతావరణం కారణంగా పాకిస్థాన్ గగనతలంలోకి ప్రవేశించింది. లాహౌర్ సమీపంలోని గుజ్రాన్‌వాలా వరకూ దూసుకెళ్లింది. 30 నిమిషాల తరువాత సురక్షితంగా మన గగనతలంలోకి వచ్చేసింది. ఈ మేరకు ఆదివారం విమానయాన సంస్థ వెల్లడించింది. విమాన రాడార్ వివరాల ప్రకారం.. భారత విమానం శనివారం రాత్రి 7.30 గంటలకు ఉత్తర లాహౌర్ ప్రాంతంలోకి ప్రవేశించింది. రాత్రి 8 గంటలకు భారత్‌కు తిరిగివచ్చేసింది. ఈ వ్యవహారంపై అమత్‌సర్ ఏటీసీ టెలిఫోన్ ద్వారా పాకిస్థాన్‌తో చక్కటి సమన్వయం సాగించింది.

టీవీవీపీ జేఏసీ చైర్మెన్‌గా

డాక్టర్ వినయ్ కుమార్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) చైర్మెన్‌గా డాక్టర్ వినయ్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం జేఏసీ నాయకులు డాక్టర్ ఎం.శ్రీనివాస్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ ఉద్యోగులకు ట్రెజరీ నుంచి జీతాలు ఇస్తున్నట్టుగానే తెలంగాణలోనూ ట్రెజరీ జీతాలు సాధించడమే తమ లక్ష్యమని తెలిపారు.



నిమ్స్ కొత్త బ్లాక్ భూమిపూజ

ఏర్పాట్లు పరిశీలన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బుధవారం వైద్యారోగ్య దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని నిమ్స్‌లో కొత్త బ్లాకు నిర్మాణానికి సీఎం కేసీఆర్ భూమి పూజ, శంకుస్థాపన చేయనున్నారు. సంబంధిత ఏర్పాట్లను వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు పరిశీలించారు. సోమవారం వైద్యారోగ్య, రోడ్లు, భవనాలశాఖ అధికారులతో కలిసి ఆయన అక్కడ పర్యటించారు. సీఎం భూమిపూజ అనంతరం నిర్వహించే సభ ఏర్పాట్ల గురించి అధికారులకు సూచనలు చేశారు. అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా చూడాలని కోరారు. వచ్చిన వారికి భోజన సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎలాంటి ట్రాఫిక్ సమస్య రాకుండా చూడాలని పోలీసు అధికారులను ఆదేశించారు. నిమ్స్ విస్తరణ పనుల్లో భాగంగా రూ.1,571 కోట్లతో రెండు వేల పడకలతో కొత్త బ్లాక్ ను నిర్మించనున్న సంగతి తెలిసిందే.

సంపాదకీయం

ఏమైందీ.. నగరానికి?

మహానగరం వరుస హత్యలతో ఉలిక్కి పడుతోంది. ఏ క్షణన.. ఏ దారుణ వార్త వినాల్సివస్తుందో అని అనుక్షణం భయపడుతోంది. రాష్ట్ర రాజధాని నడిబొడ్డున రోజుకో హత్యోదంతం వెలుగుచూస్తూ కలవరపెడుతోంది. ఈ నెల రోజుల వ్యవధిలోనే పదుల సంఖ్యలో అత్యంత పాశవిక హత్యలు చోటుచేసుకున్నాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో వేరే చెప్పాల్సిన పనిలేదు. స్నేహం పేరుతో, ప్రేమ పేరుతో ఇతర

> తెలంగాణ దశాబ్ది ఉత్సవాల వేళ నేడు 'మహిళా సంక్షేమ దివాస్'గా ప్రకటించి ప్రభుత్వం ఉత్సవాలు చేస్తుంది. ఈ తరుణంలోనైనా మహిళా చట్టాలు అమలవుతున్న తీరును, మహిళల సంక్షేమాన్ని, వారికి ఇచ్చే సామాజిక, ఆర్థిక, రాజకీయ ప్రాధాన్యతలను గురించి ప్రభుత్వం ఆలోచించాలి... ఆచరణలోకి తీసుకురావాలి. సమాజంపై ఎక్కువ ప్రభావం చూపే సినీరంగం నేరప్రేరేపిత అంశాల విషయంలో జాగ్రత్త పడాల్సిన సందర్భం ఇది. పౌరసమాజం కూడా సమాజం నుంచి ఈ నేర సంస్కృతిని తరిమికొట్టాలి.

అవసరాల పేరిట మాటలు కల్పడం... దగ్గరయ్యాక... తేడాలొస్తే తుదముట్టించడం..! నెల వ్యవధిలో శంషాబాద్ నుంచి సరూర్ నగర్ దాకా, వికారాబాద్ నుంచి బాచుపల్లి దాకా ప్రతి ఠాణా పరిధిలో మహిళల హత్య కేసులే అధికంగా ఉంటున్నాయి. నిందితుల్లో వారి పరిచయస్తులే ఎక్కువ. వివాహేతర సంబంధాలు, మద్యం కేంద్రంగానే ఈ హత్యలు చోటుచేసుకుంటున్నాయి. అత్యంత ఘోరంగా చంపేస్తున్న నిందితులు... మృతదేహాలను గుర్తించకుండా సాక్ష్యాలను మాయం చేస్తూ, నగర శివార్లలో విసిరేస్తున్నారు. లేదంటే అక్కడ హత్య చేసిన ఇతర చోట్ల పడేస్తున్నారు.

సహజ మరణాలకు తలవంచాల్సిందే! వీరోచిత మరణాలకు జోహార్లు తెలపాల్సిందే! కానీ, ఈ హత్యలు చూస్తుంటే దుఃఖంతో పాటు కోపం, ఆందోళన కలుగుతున్నాయి. అసలు ఒకరిని హత్య చేసే హక్కు వేరే వ్యక్తికెక్కడిది? ఒకరి ఇష్టాన్ని నిర్ధారించే హక్కు మరో వ్యక్తికెవరిచ్చారు? ఎదుటి వ్యక్తి తన స్వార్థానికి, సుఖానికి ఆటంకంగా ఉన్నారని, తనను ప్రేమించటం లేదని, ప్రేమించినా పెండ్లి చేసుకొమ్మని ఒత్తిడి తెస్తుందని హత్యలు చేస్తున్నారు. 'తిలాపాపం తలా పిడికెడు' అన్నట్టు ఇందులో సామాన్యుల నుంచి పోలీసు అధికారులు, ఐఏఎస్‌ల వంటి ఉన్నతాధికారుల వరకు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నవారున్నారు.




ఈ ఏడాది ప్రారంభం నుంచి వరుసగా చోటుచేసుకుంటున్న హత్యలు గత నెల నుంచి తీవ్రరూపం దాల్చాయి. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం, క్రైం సినిమాలు, వెబ్ సిరీస్‌లు చూస్తూ నేరస్తులు వింత పోకడలు పోతూ పోలీసులకు సవాల్‌గా మారుతున్నారు. నగరంలో కలకలం సృష్టించిన అప్సర కేసులో నిందితుడైన సాయికృష్ణ ఏకంగా 'గూగుల్ తల్లి'నే ఎలా హత్య చేయాలో అడిగి మరీ దారుణానికి ఒడిగట్టాడు. మృతదేహం దొరక్కుండా డ్రెయినేజీలో పడేశాడు. బెంగళూరులో మరో ప్రబుద్ధుడు తన భార్యను అనుమానిస్తూ హత్యచేసి ముక్కలు ముక్కలుగా చేసి కుక్కర్‌లో ఉడికించి మరి కుక్కలకు వేశాడు. తలను మొండెంను వేరుచేసే వారు కొందరైతే... ముక్కలు ముక్కలుగా చేసి శివారు ప్రాంతాల్లో విసిరేసే వారు మరి కొందరు. స్వయంగా నిందితులే క్రైం సినిమాలు చూసి ఇలా చేశామని నిర్లజ్జగా ఒప్పుకుంటున్నారంటే.. వాటి ప్రభావం సమాజంపై ఏ స్థాయిలో ఉందో అర్థంచేసుకోవచ్చు. నిన్న కాక మొన్న ఇదే తరహాలో జరిగిన వికారాబాద్ శిరీష కేసులో వాస్తవాలు ఇంకా బయటకు రావాల్సివుంది.

సామాజికంగా ఎన్ని మార్పులు చోటు చేసుకుంటున్నా.. హింస మాత్రం తగ్గటం లేదు. అదనపు కట్నం కోసం వేధించేవాళ్లు, తాగుబోతు భర్తలతో తిప్పలు ఒక భాగమైతే, వివాహేతర సంబంధాలు, లైంగికదాడుల ఫలితంగా హత్యలకు గురయ్యే మహిళల సంఖ్య అంతకంతకూ పెరుగుతూనే ఉంది. వీటికి తోడు ఏటా పెరుగుతున్న గృహహింస ఫిర్యాదుల సంఖ్య కూడా తక్కువేం కాదు. 2019లో రాష్ట్రవ్యాప్తంగా 43 ఫిర్యాదుల నమోదైతే.. ఈ ఏడాది తొలి నాలుగు నెలల్లోనే 162 కేసులు నమోదయ్యాయి. తెలంగాణ పోలీస్ శాఖలో ప్రత్యేకించి మహిళా భద్రత కోసం ప్రత్యేక విభాగం, షీటీమ్స్ వంటివి పని చేస్తున్నా ఈ నేరాలను అడ్డుకోలేకపోతున్నాయి.

మద్యం మత్తులోనే ఎక్కువ దారుణాలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో బడి లేని చోటు ఉందేమో కానీ, మద్యం దొరకని చోటు లేదంటే అతిశయోక్తి కాదు. ఉమ్మడి రాష్ట్రంలో మద్యం విక్రయాలపై వచ్చిన ఆదాయం కంటే ఇప్పుడు తెలంగాణలో వస్తున్న ఆదాయం దాదాపు ఆరు రెట్లు అధికం. మద్యం వలన ఆగమవుతున్న మహిళల జీవితాలకు కనీస భరోసా లేదు. గతంలో రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న నేరాలకు వ్యతిరేకంగా ప్రతి ఏడాది ప్రభుత్వమే అన్ని మహిళా సంఘాలతో సమీక్ష నిర్వహించేది. వాటి ఫలితంగానే మహిళల భద్రతకు సంబంధించిన ముఖ్యమైన చట్టాలు వచ్చాయి. కానీ, నేడు అనేక దారుణాలు జరుగుతున్నా... ఒక్క సమీక్షా సమావేశం నిర్వహించలేదు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల వేళ నేడు 'మహిళా సంక్షేమ దివాస్'గా ప్రకటించి ప్రభుత్వం ఉత్సవాలు చేస్తోంది. ఈ తరుణంలోనైనా మహిళా చట్టాలు అమలవుతున్న తీరును, మహిళల సంక్షేమాన్ని, వారికి ఇచ్చే సామాజిక, ఆర్థిక, రాజకీయ ప్రాధాన్యతలను గురించి ప్రభుత్వం ఆలోచించాలి... ఆచరణలోకి తీసుకురావాలి. సమాజంపై ఎక్కువ ప్రభావం చూపే సినీరంగం నేరప్రేరేపిత అంశాల విషయంలో జాగ్రత్త పడాల్సిన సందర్భం ఇది. పౌరసమాజం కూడా సమాజం నుంచి ఈ నేర సంస్కృతిని తరిమికొట్టాలి.

దేశ ఆర్థిక పరిస్థితి... వాస్తవాలు

ఇటీవల, మే 31వ తేదీన 2022-23 ఆర్థిక సంవత్సరపు ఆఖరి త్రైమాసిక ఆర్థిక వృద్ధిరేటు వివరాలు వెల్లడి చేశారు. ఆ మూడు నెలల వృద్ధి రేటు 6.1శాతం ఉంది. 2022-23 ఆర్థిక సంవత్సరం మొత్తానికి కలిపి లెక్కిస్తే వృద్ధిరేటు 7.2శాతం నమోదైంది. రిజర్వు బ్యాంక్, ఐఎంఎఫ్ వేసిన ముందస్తు అంచనాల ప్రకారం 6.8శాతం వృద్ధిరేటు ఉంటుందనుకున్నది వాస్తవంలో 7.2 ఉండేసరికి ప్రభుత్వ భారతదేశం అత్యంత వేగంగా పెరుగుతున్న ఆర్థిక శక్తి అంటూ గొప్పలు చెప్పుకోవడం మొదలుపెట్టేసింది.



ప్రభాత్ పట్నాయక్

ముందస్తుగా అనుకున్న 6.8శాతం కన్నా వాస్తవంగా 7.2శాతం వృద్ధిరేటు నమోదు కావడం బట్టి మన దేశపు ప్రస్తుత ఆర్థిక పరిస్థితి మీద ఉన్న అంచనాలు ఏమాత్రమూ మార్చుకోవలసిన పని లేదు. 2019-20 నుండి 2022-23 మధ్య కాలంలో లాక్‌డౌన్ సంవత్సరం 2020-21ని పక్కన పెట్టి లెక్కిస్తే మన ఆర్థిక వృద్ధిరేటు ఏడాదికి 2.85గా ఉంది. (ముందస్తు అంచనాల ప్రకారం ఈ ఏడాది ఆఖరి త్రైమాసికపు వృద్ధి 6.8 ఉంటుందన్న ప్రాతిపదికన లెక్కిస్తే ఇది 2.7గా ఉంటుంది)

> శ్రామిక ప్రజలు తమ ఆదాయాలను ప్రధానంగా ఆహారంమీద ఖర్చు చేస్తారు. ఆ తర్వాత అసంఘటిత రంగంలో ఉత్పత్తి అయే సరుకులను తమ వినియోగం కోసం కొనడానికి ఖర్చు చేస్తారు. మొత్తం వస్తూత్పత్తి రంగంలోనే వృద్ధి దాదాపు లేదు. అందులో ప్రత్యేకంగా అసంఘటిత రంగంలో పూర్తిగా మాంద్యం నెలకొంది. అంటే శ్రామికవర్గం కొనుగోలుశక్తి ఏమీ పెరగలేదని కనిపిస్తోంది. పైగా ప్రభుత్వ వ్యయం ఈ కాలంలో వాస్తవ విలువలలో ఏమీ పెరగలేదు. స్థూల స్థిరపెట్టుబడిలో పెరుగుదల కనిపిస్తున్న మాటనిజం. కాని వినిమయంలో గాని, ఎగుమతులలో గాని పెరుగుదల లేనప్పుడు పెట్టుబడులు పెట్టడంలో పెరుగుదల కొనసాగుతుందని భావించలేం.

అంతే కాదు, 2022-23లో నమోదైన వృద్ధిరేటును 2023-24లో కొనసాగించడం అసాధ్యం అని దాదాపు ప్రతివారూ భావిస్తున్నారు. స్థూల డిమాండ్‌లో పెరుగుదల ఏమీలేకపోవడమే దీనికి కారణం. మన ఆర్థిక వ్యవస్థ మాంద్యంలో చిక్కుకుని ఉందన్న విషయం నిస్సందేహం.


కాని మన ప్రభుత్వం మాత్రం ఆర్థిక వ్యవహారాలను తాము చాలా సమర్థవంతంగా నిర్వహించిన కారణంగానే ప్రపంచ ప్రధాన ఆర్థిక వ్యవస్థలలోకెల్లా మనమే ఎక్కువ వృద్ధిరేటును నమోదు చేయగలిగామంటూ గొప్పలు పోతున్నది. ఇక్కడ మన ప్రభుత్వం దాచిపెడుతున్న విషయం ఒకటుంది. కరోనా కాలంలో ప్రపంచ ప్రధాన ఆర్థిక వ్యవస్థలలోకెల్లా అతి ఎక్కువ మోతాదులో ఆర్థిక పతనం మన దేశంలోనే సంభవించింది. ఇక ఏ ఇతర దేశంలోనూ అమలు చేయనంత దుర్మార్గమైన రీతిలో ఇక్కడ లాక్‌డౌన్ అమలు జరిగింది. దాని ఫలితంగా 2020-21లో ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థలన్నింటిలోకీ అతి ఎక్కువ స్థాయిలో మన ఆర్థిక వ్యవస్థ దిగజారిపోయింది. ఆ స్థితినుండి మళ్ళీ కరోనాకి మునుపు ఉండిన స్థాయికి చేరుకోవాలన్నా చాలా ఎక్కువ వృద్ధిరేటు నమోదు కావలసివుంది. అందుకే 2020-21 ఆర్థిక సంవత్సరాన్ని పక్కన పెట్టి అంతకుముందు సంవత్సరం 2019-20 నుండి ఇప్పటిదాకా వృద్ధిరేటును లెక్కించాం. అప్పుడు వృద్ధిరేటు 2.85గా నమోదైంది. (2020-21 సంవత్సరాన్ని కూడా కలిపి లెక్కిస్తే ఈ మాత్రం వృద్ధి కూడా కనిపించదు) అప్పుడు కూడా ఇంత తక్కువ వృద్ధిరేటు నమోదవడం అంటే దేశం ఆర్థిక మాంద్యంలో ఉందన్నమాట. అంతే తప్ప చాలా గొప్ప వృద్ధి సాధిస్తోందని భావించడం సరైనది కాదు.

తాజా జీడీపీ గణాంకాలు మరో ఆందోళనకర ధోరణిని వెల్లడిస్తున్నాయి. 2018-19 కన్నా 2022-23లో వాస్తవ జీడీపీ వృద్ధి 13.37శాతం ఎక్కువ ఉంది. అయితే 2018-19లో 6.3శాతంగా ఉన్న నిరుద్యోగం రేటు 2023 మార్చి నాటికి 7.9శాతానికి ఎగబాకింది. (సిఎంఐఇ వెల్లడించిన గణాంకాలు) జీడీపీ వృద్ధిరేటు పెరుగుతున్నప్పుడు, అందునా, జనాభా పెరుగుతున్న వేగం కన్నా జీడీపీ వేగంగా పెరుగుతున్నప్పుడు నిరుద్యోగం రేటు తగ్గాలే తప్ప పెరగకూడదు కదా! మరి ఎందుకు నిరుద్యోగం వేగంగా పెరుగుతోంది?

ఆర్థిక వ్యవస్థ పెరిగే వేగం కన్నా జనాభా, అందులోనూ నిరుద్యోగ జనాభా వేగంగా పెరిగిపోతే అప్పుడు నిరుద్యోగం రేటు పెరగడాన్ని మనం అర్థం చేసుకోవచ్చు. కాని ఇక్కడ దానికి భిన్నంగా నిరుద్యోగ జనాభా పెరుగుదల వేగం కన్నా ఆర్థిక వృద్ధి పెరిగిన వేగం ఎక్కువ. అంటే నిరుద్యోగం పెరిగిపోడానికి లేబర్ సప్లై పెరగడం కాదు కారణం. దానికి భిన్నంగా లేబర్ డిమాండ్ తగ్గిపోవడం వల్ల నిరుద్యోగం పెరిగింది. సిఎంఐఇ వెల్లడించిన మరో అంశం దీనిని ధృవపరుస్తోంది. 2019-20లో 40కోట్ల 89లక్షల మంది ఉద్యోగాలలో ఉంటే మార్చి 2023 నాటికి 40కోట్ల 76లక్షల మంది మాత్రమే ఉద్యోగాలలోఉన్నారు.

అంటే నికరంగా ఉద్యోగాలు తగ్గిపోయాయన్నమాట. దీనిని బట్టి మూడు విషయాలను గ్రహించవచ్చు. మొదటిది: 2020-21లో కనిష్ట స్థాయికి పడిపోయిన తర్వాత కోలుకున్న క్రమంలో నమోదైన వృద్ధి అదనపు ఉద్యోగాలను కల్పించే కార్యకలాపాలవలన సాధించినది కాదు. అంటే సంఘటిత రంగంలో సాధించినదాని కన్నా హీనమైన వేతనాలు ఉండే అసంఘటిత రంగంలోనే ఏపాటి ఉద్యోగాల కల్పన అయినా నమోదైందన్నమాట. (ఈ అసంఘటిత రంగం లాక్‌డౌన్ కారణంగా అతి ఎక్కువగా దెబ్బతింది. అంతకు ముందు పెద్ద నోట్ల రద్దు వలన కాని, జీఎస్‌టీ అమలు వలన కాని అతి ఎక్కువగా దెబ్బతిన్నది ఈ అసంఘటిత రంగమే). రెండవది: మనుషుల ద్వారా నిర్వహించబడే కార్యకలాపాలలో ఎక్కువ భాగం డిజిటైజేషన్ అవుతున్నాయి. అందువలన తక్కువమంది ఉద్యోగులతోనే ఎక్కువ పనులు జరుగుతున్నాయి. ఇది శ్రామిక ఉత్పాదకతను బాగా పెంచుతోంది. అంటే ఉత్పత్తి అవుతున్న సంపద పెరుగుతున్నా, దానిని ఉత్పత్తి చేయడానికి అవసరమైన మానవ వనరులు మాత్రం తగ్గుతున్నాయి. ఇక మూడవది: చాలా రంగాలలో పొదుపు చర్యల పేరుతో గాని, ఉద్యోగులను తగ్గించే పేరుతో గాని లే-ఆఫ్‌లు అమలు కావడం పెరిగింది. దీని ఫలితంగా ఒక్కసారిగా ఉద్యోగాల సంఖ్య తగ్గిపోతున్నది. ఫిబ్రవరి 2023లో 40కోట్ల 90లక్షల ఉద్యోగాలు ఉంటే, మార్చి 2023లో 40కోట్ల 76లక్షలకు అవి పడిపోయాయి. (ఒక్క నెలలోనే 24లక్షల ఉద్యోగాలు పోయాయి)

జీడీపీని ప్రాథమికంగా లెక్కించే కొత్త పద్ధతిలో సంఘటిత రంగంలో వృద్ధిరేటు ఏ మేరకు ఉందో వ్యవసాయేతర అసంఘటిత రంగంలో కూడా అదే మోతాదులో ఉంటుంది అన్న ప్రాతిపదికను అనుసరిస్తారు. అసంఘటిత రంగానికి సంబంధించిన గణాంకాలు సేకరించడానికి ఎక్కువ సమయం పడుతుంది గనుక సంఘటితరంగం వృద్ధిరేటుతో సమంగా అసంఘటిత



రంగం కూడా వృద్ధి చెందుతుంది అని పరిగణిస్తారు. కాని అసంఘటిత రంగం సంఘటితరంగం కన్నా బాగా ఎక్కువగా దెబ్బతింది. ముఖ్యంగా కరోనా కాలంలో తగిలిన దెబ్బ నుండి ఆ రంగం ఇంకా కోలుకోనేలేదు. అటువంటప్పుడు సంఘటిత రంగంలో ఉండే వృద్ధిరేటుతో సమంగా అసంఘటిత రంగంలో కూడా వృద్ధి ఉంటుందనుకోవడం వలన వాస్తవ వృద్ధి కన్నా గణాంకాలలో చూపేది చాలా ఎక్కువగా ఉంటుంది.

ఈ సంఘటిత రంగంలో కూడా ప్రయివేటు కార్పొరేట్ రంగంలో ఉన్న కొన్ని లిస్టెడ్ కంపెనీల పనితీరును మాత్రమే లెక్కలోకి తీసుకుని తక్కిన కంపెనీలన్నీ అదే తీరుగా పనిచేసివుంటాయని భావించి వృద్ధిరేటు లెక్కిస్తారు. దీని వలన కూడా వాస్తవ వృద్ధి కన్నా ఎక్కువ వృద్ధి ఉన్నట్టు లెక్కల్లో కనిపిస్తుంది. ఈ అతి అంచనాలనే మోడీ ప్రభుత్వం

> జీడీపీని ప్రాథమికంగా లెక్కించే కొత్త పద్ధతిలో సంఘటిత రంగంలో వృద్ధిరేటు ఏ మేరకు ఉందో వ్యవసాయేతర అసంఘటిత రంగంలో కూడా అదే మోతాదులో ఉంటుంది అన్న ప్రాతిపదికను అనుసరిస్తారు. అసంఘటిత రంగానికి సంబంధించిన గణాంకాలు సేకరించడానికి ఎక్కువ సమయం పడుతుంది గనుక సంఘటితరంగం వృద్ధిరేటుతో సమంగా అసంఘటిత రంగం కూడా వృద్ధి చెందుతుంది అని పరిగణిస్తారు. కాని అసంఘటిత రంగం సంఘటితరంగం కన్నా బాగా ఎక్కువగా దెబ్బతింది. ముఖ్యంగా కరోనా కాలంలో తగిలిన దెబ్బ నుండి ఆ రంగం ఇంకా కోలుకోనేలేదు.

చూపించి ప్రచారం చేసుకుంటోంది.

ఒకవేళ ఈ అంచనాలన్నీ వాస్తవ పరిస్థితినే సూచిస్తున్నాయని కాసేపు అనుకుందాం. అప్పుడు కూడా వస్తూత్పత్తి రంగంలో వృద్ధి కేవలం 1.3శాతం మాత్రమే ఉంది. వ్యవసాయరంగంలో 4శాతం వృద్ధి నమోదైంది. రుతుపవనాలు, వర్షాభావం, వరదలు వగైరా పలు కారణాల వలన వ్యవసాయోత్పత్తిలో వృద్ధి ప్రతీ ఏడు నిలకడగా కొనసాగుతుందని చెప్పలేం. ఇక సేవారంగంలో (ఇందులో వాణిజ్యం, హోటళ్ళు, రవాణా, సమాచార రంగం, ప్రసారసేవలు వంటివి ఉంటాయి) 14శాతం వృద్ధి నమోదైంది. ఈ రంగంలో వేగంగా వృద్ధి జరిగినందున మొత్తం మీద జీడీపీ వృద్ధిరేటు పెరుగుదల కనిపిస్తోంది.

ఈ అంశం కీలకం. వస్తూత్పత్తి రంగంలో, వ్యవసాయ రంగంలో ఉత్పత్తి జరిగే సంపదలోనుంచి వచ్చే అదనపు విలువ మీద సేవారంగం కార్యకలాపాలు ఆధారపడి ఉంటాయి. సేవారంగంలో ఉద్యోగుల నుండి అదనపు విలువ ఏమీ ఉత్పత్తి కాదని ఆడం స్మిత్ స్పష్టం చేశాడు. సోషలిస్టు దేశాలలో (సోవియట్ యూనియన్, తూర్పుయూరప్ దేశాలలో సోషలిస్టు వ్యవస్థ ఉండినకాలంలో) సేవారంగాన్ని మినహాయించి జీడీపీ లెక్కించేవారు. ఇప్పటికే ఉత్పత్తి అయిన సంపదను పంపిణీ చేయడమో, ఆ వస్తువుల వినియోగం జరిగే క్రమంలో వాటికి సంబంధించిన సేవలను అందించడమో తప్ప సేవారంగం అదనపు సంపదను దేశానికి జోడించదు. అటువంటి సేవారంగంలో కనపడిన వృద్ధి మొత్తం జీడీపీలో ప్రధానభాగం అయినప్పుడు అందులో సంబరపడవలసినది ఏమీ లేదు.

శ్రామిక ప్రజలు తమ ఆదాయాలను ప్రధానంగా ఆహారంమీద ఖర్చు చేస్తారు. ఆ తర్వాత అసంఘటిత రంగంలో ఉత్పత్తి అయే సరుకులను తమ వినియోగం కోసం కొనడానికి ఖర్చు చేస్తారు. మొత్తం వస్తూత్పత్తి రంగంలోనే వృద్ధి దాదాపు లేదు. అందులో ప్రత్యేకంగా అసంఘటిత రంగంలో పూర్తిగా మాంద్యం నెలకొంది. అంటే శ్రామికవర్గం కొనుగోలుశక్తి ఏమీ పెరగలేదని కనిపిస్తోంది. పైగా ప్రభుత్వ వ్యయం ఈ కాలంలో వాస్తవ విలువలలో ఏమీ పెరగలేదు. స్థూల స్థిరపెట్టుబడిలో పెరుగుదల కనిపిస్తున్న మాటనిజం. కాని వినిమయంలో గాని, ఎగుమతులలో గాని పెరుగుదల లేనప్పుడు పెట్టుబడులు పెట్టడంలో పెరుగుదల కొనసాగుతుందని భావించలేం. జీడీపీ గణాంకాలలో అన్నింటికన్నా ఆందోళన కలిగించే విషయం శ్రామిక ప్రజల వినిమయంలో పెరుగుదల ఏమీ లేకపోవడం. "ప్రపంచంలోకెల్లా మనదే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ" అని ఎంత గొంతు చించుకున్నా, ఈ చేదు నిజాన్ని పాలకులు కప్పిపుచ్చలేరు.

(స్వేచ్ఛానుసరణ)



రక్తదానం...మహాదానం

రక్తానికి ప్రత్యామ్నాయం లేదు. ఏ ప్రయోగశాలలోనూ తయారు చేయలేం. ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వేళ, పలు తీవ్ర అనారోగ్య సమయాల్లో, ప్రసవ సమయాల్లో, సంక్లిష్ట శస్త్రచికిత్స చేసే క్షణాల్లో, ప్రాణాపాయంతో కొట్టుమిట్టాడే వ్యక్తులకు సురక్షిత రక్తం లేదా రక్తఉత్పత్తులు అందించుట అత్యవసరంగా జరిగితేనే ప్రాణాలు నిలుస్తాయి. రక్తదాతలు మాత్రమే ఇలాంటి అమూల్య ప్రాణాలు పోయగలరు. ఉదాహరణకు ఇటీవల ఒడిషాలో జరిగిన రైలు ప్రమాదం అందరికీ తెలిసిందే. చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. ఎక్కువ మంది క్షతగాత్రు లయ్యారు. వెంటనే స్పందించిన ప్రజలు చాలామందికి రక్తం ఇచ్చి వారి ప్రాణాలను కాపాడి మానవత్వం చాటుకున్నారు. ఇలాంటి అనుకోని ఘటనలు జరిగినప్పుడే కాదు, రక్తం అవసరమైన వారు మనచుట్టూ ఎక్కడో ఒక దగ్గర తారసపడుతూనే ఉంటారు. వారి విలువైన ప్రాణాలు కాపాడేందుకు రక్తదానం చేయడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి. రక్తదాన యజ్ఞం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడం, దాతలను సముచితంగా గుర్తించి ప్రోత్సహించడం, రక్తదానం పట్ల అపోహలను తొలగించడం కోసం "ఐరాస - రెడ్‌క్రాస్ సొసైటీ"లు సంయుక్తంగా ప్రతి యేటా14 జూన్ రోజున 'ప్రపంచ రక్తదాతల దినం (వరల్డ్ బ్లడ్ డోనార్ డే)'గా పిలుస్తున్నది. రక్తం ఏ, బి, ఏబి, ఓ అనబడే నాలుగు రకాలుగా ఉంటుందని కనుగొన్న ప్రఖ్యాత శాస్త్రవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత 'కార్ల్ లాండ్ స్టేనర్' జన్మదినం (14 జూన్ 1868) సందర్భంగా ఈ "ప్రపంచ రక్తదాతల దినం" నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. 2005లో ప్రారంభమైన ప్రపంచ రక్తదాతల దినం వేదికగా 192 దేశాలు పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రచారం ప్రారంభించాయి. సకాలంలో రక్తం అందక ప్రాణాలు కోల్పోయే అభాగ్యుల పట్ల సహానుభూతిని ప్రదర్శిస్తూ, ప్రతి యేటా కనీసం 2-3సార్లు అయినా రక్తదానం చేసే అలవాటును ప్రతి ఒక్కరు, ముఖ్యంగా యువత ముందుకు చేసుకోవాలని అన్ని స్వచ్ఛంద సంస్థలు విన్నవిస్తున్నాయి. ప్రభుత్వాలు, వైద్యరంగం, స్వచ్ఛంద సంస్థలు రక్తదాన శిబిరాల ఏర్పాటు చేసేందుకు చొరవ చూపాలి. రక్తం నిలువ చేయడం, రక్త పరీక్షల నిర్వహణ, రక్తనిధి కేంద్రాల స్థాపన, రక్త సేకరణ, అందరికీ అందుబాటులో ఉంచడం లాంటి అంశాలకు అధిక ప్రాధాన్యతలు ఇవ్వాలి. రక్తదాతలు సేవా గుణంతో మిలియన్ల ప్రాణాలు నిలపడం, సరైన జీవనాన్ని గడిపేలా సహకరించడం జరుగుతున్నది. ప్రపంచ దేశాలన్నింటిలో రక్తదానం అత్యవసరం అయ్యింది. విశ్వమంతటా రక్త కొరత ఉన్నది వాస్తవం. అధిక జనాభా గల అభివృద్ధి చెందుతున్న భారత్ లాంటి దేశాల్లో రక్త కొరత తీవ్రంగా ఉంది.

ప్రపంచ రక్తదాతల దినం-2023 నినాదంగా 'గివ్ బ్లడ్, గివ్ ప్లాస్మా, షేర్ లైఫ్, షేర్ ఆఫెన్' అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేస్తున్నారు. స్వచ్ఛంధ రక్తదాతలకు కృతజ్ఞతలు తెలుపడం, కొత్త దాతలను ఆహ్వానించడం, డబ్బు కోసం రక్తదానం చేసే వారిని నిరోధించడం, రక్తదాన ప్రాముఖ్యతను వివరించడం, యువత రక్తదాతలుగా ప్రజారోగ్య పరిరక్షణలో మానవీయతను చాటడం లాంటి పలు ప్రచారాలు ప్రస్తుతం ఎక్కువ అవసరం. రక్తంతో పాటు రక్త ఉత్పత్తులైన ప్లేట్లెట్లు, ప్లాస్మా క్రయో, తెల్ల, ఎర్ర (ఎరిత్రోసైట్స్, ల్యూకోసైట్స్) రక్తకణాలు-గ్రాన్యులోసైట్స్ లాంటివి కూడా రోగులకు అత్యవసరంగా అందించడం జరుగుతుంది. భారతదేశంలో 5కోట్ల యూనిట్ల రక్తం అవసరం ఉండగా 3కోట్ల యూనిట్ల మాత్రమే రక్తదాతల ద్వారా లభిస్తున్నది. ప్రతి రోజు 38,000 రక్తదానాలు జరగాల్సి ఉంది. సంపూర్ణ ఆరోగ్యం, 50కిలోలు మించి బరువు, 18-65 ఏండ్ల వయస్సు, డెసిలీటర్ రక్తంలో 12.5గ్రామ్‌ల హిమోగ్లోబిన్ లాంటి అర్హతలు కలిగిన ప్రతి ఒక్కరు ప్రతి 3మాసాలకు ఒకసారి రక్తదానం చేయ వచ్చు. హెచ్‌ఐవి, గుండె జబ్బులు, హెపటైటిస్ బి, రాబిస్, గర్భిణులు, నిత్యం ఆల్కహాల్ సేవించే వారు, రొమ్ముపాలు ఇచ్చే తల్లులు, తీవ్ర అనారోగ్యం నుంచి కోలుకున్నవారు, ఫిట్స్, టిబి, ఎలర్జీ, అస్తమా లాంటి లక్షణాలు ఉన్నవారు రక్తదానం చేయకూడదు. రక్తదానంతో ప్రాణాలనే కానుకగా ఇవ్వవచ్చు. మరే ప్రత్యామ్నాయంలేని అత్యంత విలువైన రక్తాన్ని దానం చేయడానికి 10-15నిమిషాల సమయం మాత్రమే పడుతుంది. స్వచ్ఛందంగా కనీసం ఏడాదికి మూడుసార్లు అయినా రక్తదానం చేస్తూ, అవసరార్థుల ప్రాణాలను కాపాడుదాం. రక్తదానమే మహాదానమని నినదిద్దాం. (14 జూన్ 'ప్రపంచ రక్తదాతల దినోత్సవం')

దా: బుర్ర మధుసూదన్ రెడ్డి, 9949700037



గాయాల మల్ల యుద్ధం!

ఏ పరీక్ష నాళికా పసిగట్టలేదు
వాడి రక్తంలో పడగవిప్పే పాముఖిషం!
మామూలు కంటికి కనిపించదు
మనిషి చర్మం కింద సంచరించే మృగం

రాబందువు జన బాంధవుడి వేషంలో
ఓటడిగినప్పుడే గుర్తు పట్టాల్సింది!
ప్రమాదం నెత్తినెక్కి తొక్కేదాకా
బహుశా మనం కళ్ళు మూసుకుంటాం!
పక్షి గుడ్లను సంరక్షించే పదవిలో
పామునే కూర్చోబెడుతాం!

కుర్చీ మదం మందమెక్కినంక
వాడిలో కుబుసం విప్పుకున్న కామం
బుసలు కొడుతున్నదని
కాటునుంచి తప్పించుకున్న
వాళ్ళే కదా గుర్తించగలరు!

పిడిగుద్దుల యుద్ధం చేసే వాళ్ళు
పశువు కొమ్ములకు లొంగిపోరు
వాళ్ళ గొంతులు పిరికిపాలు తాగలేదు!

పంటను కాపాడే రైతు
చీడను గుర్తించినట్లు
దేహాల మీద దాడి చేయాలనుకునే
గొంగళి పురుగును
వాళ్ళు సులభంగానే గుర్తించగలరు!

ప్రత్యర్థితో యుద్ధం
వాళ్ళకు కొత్తేమికాదు గానీ
నిర్లజ్జగా నీతిని వదిలేసిన
మృగంతో యుద్ధమిది!

గాయాలు వాళ్ళకు కొత్తేమీగాదు
క్రీడా ప్రపంచంలో
మన జెండా ఎగరేసే బరిలో
నెత్తురు చిందినప్పటి గాయాలకన్నా

జుగుప్సాకరమైన వాడి చేతులు చేసిన
గాయానికి సాక్ష్యం చూపమన్నప్పుడే
వాళ్ళింకా గాయపడుంటారు!

గాయాలకు నోళ్ళుంటాయి
గొంతెత్తి నిలదీస్తాయి
గాయాలకు పిడికిళ్ళుంటాయి
న్యాయం కోసం పోరాడుతాయి!

చీడ పురుగు పట్టి చూపెట్టాం
మీరూ చీదరించండని
లేత చిగుళ్ళు మించి దులిపేయండని
ఇప్పుడు గాయాలు గొంతెత్తేది
కళ్ళు మూసుకున్న నిర్లక్ష్యం మీద

దేశం కోసం దేహాపు కణం కణం
ఓ రణరంగం చేసిన
వాళ్ల ఆత్మ గౌరవాన్ని కాపాడడమే
ఇప్పుడు దేశ గౌరవమని

చెవులు మూసుకున్న
మౌనం నోరిప్పేదాకా
గొంతెత్తిన గాయాల మల్ల యుద్ధం ఆగదు!
ఊడ్చిపారేయాలని చూసేకొద్దీ
యుద్ధం వేల వేల పిడికిళ్ళుగా విస్తరిస్తుంది!

- రహీమొద్దీన్, 9010851085

కమిటీ సరే! ఫీజుల నియంత్రణేది?

జూన్ నెల రాగానే విద్యా సంవత్సరం ఆరంభం. పిల్లలు ఆటా, పాటలకు స్వస్తి చెప్పి ఇక బడికి పయనం. ప్రయివేటు స్కూళ్ల విద్యార్థులకు పుస్తకాల మోత. తల్లిదండ్రులకు ఫీజుల వాత. ప్రభుత్వ పాఠశాలలో టీచర్ల కొరత. ప్రభుత్వ పెద్దల, అధికారుల హడావుడి నటన. షరా మామూలుగానే మౌలిక సమస్యలు, ఫీజుల వడ్డింపులు. ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం ఏమైనా చర్యలు తీసుకుంటున్నదా అంటే లేదనేచెప్పాలి. పైగా ఏప్రిల్, మే, జూన్ వచ్చిందంటే చాలు ప్రయివేటు విద్యాసంస్థల ప్రకటనల జోరు. పట్టణాల్లో ఎటు వైపు తలెత్తి చూసినా విద్యా సంస్థల హోర్డింగులే. 'మాది స్టేట్ ర్యాంక్ అంటే మాది స్టేట్ ర్యాంక్' అని, మాకు ఇన్ని ర్యాంక్‌లు అన్ని ర్యాంక్‌లని ప్రచార హోరు తప్ప ఏఒక్క విద్యా సంస్థ తమ సంస్థలోని మొత్తం విద్యార్థుల సంఖ్య ఎంత? ర్యాంకుల స్థాయి ఎంతనేది ఎవరికీ తెలియదు. దీన్ని కూడా విద్యాశాఖ నియంత్రించడం లేదంటే ఏమనుకోవాలి? వైద్య విద్య, ఇంజినీరింగ్, డిగ్రీ విద్యా తదితర కోర్సులకు ప్రభుత్వం నిర్దిష్టమైన ఫీజు స్ట్రక్చర్ నిర్ణయించింది. కానీ పాఠశాల విద్యకు, ఇంటర్ విద్యకు నిర్దిష్టమైన ఫీజు విధానం లేదు. విద్యారంగ నిపుణులు, విద్యార్థి సంఘాలు, పేరెంట్స్ అసోసియేషన్స్ ఒత్తిడితో ప్రయివేటు స్కూళ్లలో ఫీజుల నియంత్రణ విధివిధానాలపై వేసిన తిరుమలరావు కమిటీ సిఫారసులను రాష్ట్ర ప్రభుత్వం బయట పెట్టలేదు. ఏటా గరిష్టంగా ఫీజులు 10శాతం పెంచుకోవచ్చు అని చెప్పినట్లు మాత్రం వెల్లడైంది. ఆయా విద్యా సంస్థలు ఇప్పటికే వసూలు చేస్తున్న ఫీజులు ఏ స్థాయిలో ఉన్నాయి. వాటికి ఉన్న ప్రమాణాలు ఏమిటి? ఇప్పటికే అసాధారణంగా ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలలో ఫీజు తగ్గింపు చర్యలు తీసుకుంటారా లేదా అనే అంశాలు వెల్లడి కాలేదు. ఆ తర్వాత మంత్రివర్గ ఉప సంఘం వేశారు. 10మందితో కూడిన స్కూల్ లెవెల్ కమిటీ ఫీజులు నిర్ణయించాలని మంత్రివర్గ సబ్ కమిటీ జీఓ నెంబర్ ఒకటిని దృష్టిలో పెట్టుకొని చెప్పినట్లు ఉన్నది. కానీ, ఆచరణలో పెట్టలేదు. పాఠశాల విద్యలో ప్రయివేటు విద్యా సంస్థలు ఫీజు స్ట్రక్చర్ ఎలా ఉండాలో ఉన్నంతలో శాస్త్రీయం గా విద్యాశాఖ జీఓ నెంబర్‌లో స్పష్టంగా పేర్కొంది. ఈ జీఓను అమలు చేయకుండా తెలంగాణ సర్కార్ కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నది.



గీట్ల ముకుందరెడ్డి
9490098857

విద్యాశాఖ జీఓ ఎంఎస్ నెంబర్1 ప్రకారం విద్యా సంస్థ ప్రతి బ్రాంచ్‌కు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు నిర్దేశిత ఫారంలో సంబంధిత విద్యాధికారికి ఇవ్వాలి. సెప్టెంబర్ 30 చివరి గడువుగా ప్రతీ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అకౌంట్స్ స్టేట్‌మెంట్ చార్టర్డ్ అకౌటేంట్ చేత ఆడిట్ చేసిన రిపోర్ట్‌ను విద్యాధికారికి ఇవ్వాలి. విద్యా సంస్థలోని ప్రతీ బ్రాంచ్‌లో పాలకవర్గం ఏర్పడాలి. పాలకవర్గంలో విద్యా సంస్థ అధ్యక్షులు, విద్యాసంస్థ సెక్రెటరీ, కరస్పాండెంట్, మేనేజర్, ప్రిన్సిపాల్, హెడ్మాస్టర్ బోధన సిబ్బంది నుండి ఒకరు, విద్యార్థుల తల్లిదండ్రులలో నుండి జిల్లా విద్యాధికారిచే నియమించబడిన చదువుకున్న తల్లి ఒకరు ఉండాలి. ఇవన్నీ ఎక్కడైనా జరుగు తున్నాయా? పాలకవర్గం సంవత్సరంలో కనీసం మూడు సార్లు సమావేశం కావాలి. పాలకవర్గమే ఫీజులు నిర్ణయించాలి. ఫీజులు నిర్ణయించేటప్పుడు బోధన, బోధనేతర సిబ్బంది వేతనాలు, సౌకర్యాలు, స్కూలు నిర్వహణ ఖర్చులు, స్కూలు అభివృద్ధి ఖర్చులను పరిగణంలో ఉంచుకొని ఫీజుల స్ట్రక్చర్ తయారు చేయాలని ఉన్నప్పటికీ దీనిపై నిర్దిష్టమైన కార్యచరణ రూపుదాల్చింది లేదు. జిల్లా కలెక్టర్ లేదా తాను సిఫార్సు చేసిన అధికారి, జిల్లా విద్యాధికారి, జిల్లా ఆడిట్ అధికారులతో కూడిన డీఎఫ్‌ఆర్‌సీ స్కూల్ గవర్నింగ్‌బాడి ప్రతిపాదించిన ఫీజు స్ట్రక్చర్‌ను, తల్లిదండ్రులు విన్నపాన్ని పరిగణలోకి తీసుకోని ఫీజులను నిర్ణయించాలి. డీఎఫ్‌ఆర్‌సీ నిర్ణయించిన ఫీజులనే ప్రతి ప్రయివేటు స్కూల్ యాజమాన్యం వసూలు చేయాలి. ఇది ఏ ఒక్క విద్యాసంస్థలోనూ అమలవ్వడం లేదనేది విద్యార్థి సంఘాల ఆరోపణ. బోధనా, బోధనేతర సిబ్బందిని "స్టాఫ్ సెలక్షన్ కమిటీ" ద్వారా నియమించాలి. పోస్టుల వివరాలు సర్క్యులేషన్ అధికంగా ఉన్న కనీసం రెండు తెలుగు దినపత్రికలలో ప్రకటనలివ్వాలి. పోస్టుల భర్తీకి సంబంధిత విద్యాధికారి అనుమతి తీసు కోవాలి. ఇవేవీ ఆచరణలో అమలు కావడం లేదు. ఫీజుల వసూలు, మౌలిక వసతుల కల్పనా తదితర అంశాలపై జీఓలో పేర్కొన్న విధంగా అమలు చేయాలనీ, అందుకు జిల్లా విద్యాధికారి వెంటనే



చర్యలు తీసుకోవాలని తెలంగాణ విద్యా శాఖ 2015 జూన్ 12న ప్రొసిడింగ్స్ ఇచ్చినప్పటికీ అధికారులు మొద్దు నిద్రలో ఉన్నారు. ప్రభుత్వం మాత్రం చర్యలు తీసుకోవడం లేదు.

విద్యార్థుల నుండి వసూలు చేసే ఫీజులలో 50శాతం టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌నకు వేతనాలు చెల్లించాలి. 15శాతం ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యుటీ, గ్రూప్ ఇన్సూరెన్స్ తదితరాలకు వినియోగించాలి. బిల్డింగ్ రెంట్, కరెంటు, వాటర్ బిల్లులు, లైబ్రరీ బుక్స్, ల్యాబ్, కెమికల్స్, ఆడిట్, ఆఫీసు తదితర నిర్వహణ ఖర్చులకు 15శాతం మాత్రమే వినియోగించాలి. మరొక 15శాతం స్కూల్ అభివృద్ధికి అదనపు రూమ్‌ల నిర్మాణం, ల్యాండ్ కొనుగోలు, కొత్త కోర్సులు, సెక్షన్స్ కోసం వినియోగించుకునే అవకాశం ఉంది. స్కూల్ యజమాన్యం 5శాతం మాత్రమే లాభాలు తీసుకోవాలి. ఉదాహరణకు ఒక స్కూల్‌లో 1 నుండి 10వ తరగతి వరకు మొత్తం విద్యార్థులు 600మంది ట్యూషన్ ఫీజు సంవత్సరానికి సగటున రూ.50 వేలు ఉన్నది అనుకుంటే స్కూల్ సంవత్సర ఆదాయం మొత్తం రూ.3కోట్లు వస్తుంది. ఫీజులో 50శాతం అంటే రూ.1 కోటి 50లక్షలు టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌కు వేతన చెల్లింపులు చేయాలి. రూ.45లక్షలు పీఎఫ్, బోనస్, ఈఎస్‌ఐ, గ్రాట్యుటీ వంటి చట్టబద్ధ సౌకర్యాలకు చెల్లించాలి. కానీ ఒక అంచనా ప్రకారం 30 నుండి 35శాతం మాత్రమే వేతనాలు, సౌకర్యాల కోసం చెల్లిస్తున్నారు. సంవత్సరంలో 12నెలలకు వేతనాలు చెల్లించ వలసి ఉండగా, చాలా యాజమాన్యాలు పది లేదా పదిన్నర నెలలకు మాత్రమే వేతనాలు ఇస్తున్నాయి. ఫీజులలో స్కూల్ యజమాన్యం 5శాతం మాత్రమే లాభాలు పొందాలి. కానీ కొన్ని స్కూల్ యాజమాన్యాలు ప్రతీ సంవత్సరం 30 నుండి 40శాతం లాభాలు పొందుతున్నాయి. 600మంది విద్యార్థులకే ఈ విధంగా ఉంటే... వెయ్యి, రెండువేలు, ఐదువేల మంది విద్యార్థులు కలిగి ఉండి, ట్యూషన్ ఫీజు సంవత్సరానికి లక్ష, ఆపైన వసూలు చేస్తున్న విద్యా సంస్థల లాభాలు ఎంత ఉండాలి? అందరూ ఆలోచించాల్సిన అంశమిది. రిజిస్ట్రేషన్ ఫీజు, అడ్మిషన్ ఫీజు, డెవలప్‌మెంట్ ఫీజు, వ్యాన్ ఫీజు, యూనిఫాం, షూస్, పుస్తకాల ఖర్చులు తడిసి మోపెడవు తున్నాయి. కొన్ని స్కూల్స్ ట్యూషన్ ఫీజు సంవత్సరానికి రూ.2 లక్షలు, హాస్టల్ ఫీజు లక్ష వసూలు చేస్తున్నా ప్రభుత్వం చర్యలు తీసుకోదా? ఎంత ఎక్కువ డబ్బులు స్కూల్ ఫీజులకు చెల్లిస్తే అంత గొప్ప చదువును తమ పిల్లలకు చదివిస్తున్నట్లు భావిస్తున్న మధ్య తరగత మనస్తత్వాన్ని విద్యాసంస్థలు బాగా సొమ్ము చేసుకుంటున్నాయి. విద్యను మంచి లాభసాటి వ్యాపారంగా భావిస్తున్న పలు సంస్థలు క్వాలిఫైడ్ టీచర్స్, లెక్చరర్స్‌ను నియమించడం లేదు. మరి కొన్ని సంస్థలు తమ ఫ్యాకల్టీకి లక్షల్లో వేతనం ఇస్తున్నామని ప్రచారం చేసుకుంటున్నాయి. విద్యారంగ నిపుణులు, ప్రభుత్వ శాఖలు నిర్దేశించిన కాలిఫైడ్ ఫ్యాకల్టీ కావాలి కానీ, లక్షల్లో వేతనం ఇస్తే మాత్రం విద్యార్థులకు అదనంగా బోధించేదే ముంటుంది? బోధన పద్ధతితోపాటు విద్యార్థుల గ్రహణశక్తి చాలా ముఖ్యమైనదని నిపుణులు చెబుతున్నారు. గ్రహణశక్తి పెంపొంద డానికి ఆహారం, ఆరోగ్యం, గాలి, వెలుతురు, శబ్దం, పరిసరాల తోపాటు సామాజిక ప్రభావం కూడా ఉంటుంది. ఇవేమీ మార్చకుండా భవి భారత పౌరులను యంత్రాలు గా మార్చడం వలన ప్రయోజనం శూన్యం. హైదరాబాద్ పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత కొన్ని సంవత్సరాలుగా ఆందోళనలు పోరాటాలు చేస్తున్నారు. కొన్ని ముఖ్యమైన విద్యా సంస్థలలో ఫీజులను పెంచకుండా నిరోధించే ప్రయత్నం కూడా చేశారు. అందరూ ఆదిశగా ఆలోచించి అడుగేస్తే విద్యాసంస్థల్లో ఫీజులు నియంత్రణపై ప్రభుత్వంపై ఒత్తిగి పెరిగే అవకాశం ఉంటుంది. •

> కొన్ని స్కూల్స్ ట్యూషన్ ఫీజు సంవత్సరానికి రూ.2 లక్షలు, హాస్టల్ ఫీజు లక్ష వసూలు చేస్తున్నా ప్రభుత్వం చర్యలు తీసుకోదా? ఎంత ఎక్కువ డబ్బులు స్కూల్ ఫీజులకు చెల్లిస్తే అంత గొప్ప చదువును తమ పిల్లలకు చదివిస్తున్నట్లు భావిస్తున్న మధ్య తరగత మనస్తత్వాన్ని విద్యాసంస్థలు బాగా సొమ్ము చేసుకుంటున్నాయి. విద్యను మంచి లాభసాటి వ్యాపారంగా భావిస్తున్న పలు సంస్థలు క్వాలిఫైడ్ టీచర్స్, లెక్చరర్స్‌ను నియమించడం లేదు. మరి కొన్ని సంస్థలు తమ ఫ్యాకల్టీకి లక్షల్లో వేతనం ఇస్తున్నామని ప్రచారం చేసుకుంటున్నాయి.

దశాబ్ది పాలనలో మహిళా సంక్షేమం..?

దశాబ్ది ఉత్సవాలు ఘనంగా జరుపుకుంటున్నాము. అందరూ ఏకమై సాధించుకున్న రాష్ట్రం మనది. అందులో మహిళల పాత్ర గణనీయమైనది. ఎన్నో పోరాటాల ఫలితంగా స్వరాష్ట్రం ఏర్పడింది. తమకు న్యాయం జరుగుతుందని, పాలనలో ప్రాధాన్యం పెరుగుతుందని కోటి ఆశలతో మహిళలు ఎదురు చూశారు. మరి ఈ తొమ్మిదేండ్ల కాలంలో ఆ ఆశలు నెరవేరాయా..? దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈరోజు తెలంగాణ మహిళా సంక్షేమ దినోత్సవం జరుపు కుంటున్నాము. ఈ సందర్భంగా కొందరు మహిళా నేతలు ఏం కోరుకుంటున్నారో చూద్దాం...



పాలనలో భాగస్వామ్యం చేయాలి



తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తొమ్మిదేండ్లు పూర్తి చేసుకుని పదవ ఏడాదిలోకి అడుగు పెడుతున్నది. అయినా మహిళల పురోగతి ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడం శోచనీయం. మహిళలు అనేక ఆకాంక్షలతో తెలంగాణ పోరాటంలో వీరోచితంగా పాల్గొన్నారు. అరెస్టులై జైలుకు వెళ్ళారు. లాఠీ దెబ్బలు సైతం భరించారు. తెలంగాణ వస్తే మహిళలపై జరిగే దాడులు ఆగిపోతాయని, పాలనలో, అభివృద్ధిలో భాగస్వాములను చేస్తారని ఎన్నో కలలు కన్నారు. కానీ అవన్నీ కేవలం కలలుగానే మిగిలిపోయాయి. పసిపిల్లలు, వృద్ధులు అనే తేడా లేకుండా లైంగిక దాడులు, వేధింపులు నిత్య కృత్యమయ్యాయి. సంఘటనలు జరిగినప్పుడు మహిళా సంఘాలు ఉద్యమాలు చేస్తే తప్ప పాలకుల్లో చలనం రావడం లేదు. రక్షణ వ్యవస్థ కూడా కదలలేని పరిస్థితుల్లో కూరుకుపోయింది. గర్భిణీ స్త్రీలకు కేసీఆర్ కిట్టు, ఒంటరి మహిళలకు పెన్షన్, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లాంటి కొన్ని పథకాలు వచ్చినప్పటికీ మహిళల జీవనస్థితిగతులల్లో, స్వయం పోషకంలో మాత్రం ఎలాంటి మార్పు లేదు. ముఖ్యంగా కేజీ నుండి పీజీ వరకు ఉచిత విద్య అన్నారు. ఇది ఆచరణలోకి రాలేదు. ఇది అమ్మాయిలు విద్యావంతులు కావడానికి ఎంతో ఉపయోగం. అలాగే విద్య పూర్తయిన తర్వాత మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలి. కళాశాలల్లో మహిళా సెల్లు ఏర్పాటు చేయాలి. బస్సులలో మహిళలకు ఉచిత రవాణా సౌకర్యం అందించాలి. అన్ని రకాల స్కీము వర్కర్లకు గౌరవ వేతనం స్థానంలో కనీస వేతనాలు ఇవ్వాలి. మహిళా స్వయం శక్తి పథకం రావాలి. ఒంటరి మహిళ, వితంతు మహిళలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలి. మొత్తంగా మహిళా స్వయం శక్తివంతురాలు కావడానికి అవసరమై నిర్ణయాలు తీసుకోవాలి. మహిళల ఆకాంక్షలు, అవసరాల్ని గుర్తించాలి. జనాభాలో 50 శాతంగా ఉన్న మహిళలు రాష్ట్ర శాసనసభలో రెండు శాతం కూడా లేకపోవడం విచారకరం. పాలిచ్చి లాలిచ్చి పెంచి పెద్ద చేసి, విద్యాబుద్ధులు నేర్పించే తల్లి పాలనలో కూడా రాణించగలదు. 50 శాతం రిజర్వేషన్ కల్పించి మహిళా శక్తిని అభివృద్ధిలో భాగస్వామ్యం చేసినప్పుడే రాష్ట్ర సమగ్ర అభివృద్ధి సాధ్యం. అందుకు పాలకులు చిత్తశుద్ధితో మహిళలకు స్థానం కల్పించాలి. 'ఏది తనంతట తానై నీ దరికి రాదు. శోధించి సాధించాలి' అన్న శ్రీశ్రీ అక్షరాలను అందుకొని మహిళాలోకం ప్రజాస్వామిక ప్రతిఘటన పోరాటాలలో భాగస్వాములు కావాలి.

- ఎన్.జ్యోతి, ఎన్.ఎఫ్.ఐ.డబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి

విద్యా, ఉద్యోగ అవకాశాలు కల్పించాలి



కళ్యాణలక్ష్మి, షాది ముబారక్ వంటివి పెట్టారు. అయితే విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలి. మా ఊరు - మా బడి అన్నారు. అది ఆచరణలో సరిగా లేదు. అలాగే ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం పని చేయడం లేదు. దాంతో మహిళలు పని లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాలలో కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసి మహిళలకు జీవనోపాధి కల్పించాలి. మహిళలు తమ కాళ్ళపై తాము నిలబడేలా చేయాలి. గృహలక్ష్మి అని పెట్టి ఇండ్లు కట్టుకోవడానికి మూడు లక్షలు ఇస్తున్నారు. అది ఐదు లక్షలకు పెంచాలి. అలాగే మహిళా పోలీస్ స్టేషన్‌లు ఆర్‌డీఓ స్థాయిలో ఏర్పాటు చేయాలి. పెట్రోలింగ్ పెంచాలి. మహిళా పోలీసుల సంఖ్య పెంచాలి. అలాగే రేషన్ షాపుల ద్వారా కేరళలో మాదిరిగా 14 రకాల నిత్యావసర సరుకులు అందించాలి. ముఖ్యంగా మహిళలపై సామాజిక వివక్ష, అణచివేత పెరిగిపోతున్నాయి. అందుకే సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రంగాలలో మహిళలకు సముచిత స్థానం కల్పించాలి. పాఠ్య పుస్తకాల్లో స్ఫూర్తిదాయకమైన మహిళల జీవితాలు ప్రవేశ పెట్టాలి. అప్పుడే మహిళల పట్ల గౌరవం పిల్లలకు చిన్నతనం నుండే వచ్చే అవకాశం ఉంటుంది.

- మల్లు లక్ష్మి, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి

సామాజిక భద్రత కల్పించాలి



తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత మద్యం అమ్మకాలు విపరీతంగా పెరిగాయి. దాని ద్వారా వచ్చే ఆదాయ లెక్కలు చూస్తే ఎవరికైనా అర్థమవుతుంది. ఉమ్మడి రాష్ట్రంలో 6వేల కోట్లు వచ్చేది. పదమూడు జిల్లాలు వెళ్ళిపోయిన తర్వాత కూడా 30వేల కోట్లకు చేరుకుందంటే మద్యం అమ్మకాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలిసిపోతుంది. అందరికీ మద్యం అలవాటు చేసి ఎన్ని సంక్షేమ పథకాలు తెచ్చినా ఉపయోగం ఏముంది. తాగి తాగి భర్తలు చనిపోతే ఒంటరి మహిళలకు పెన్షన్ ఇస్తామంటున్నారు. అలాగే ఉమ్మడి రాష్ట్రంలో ప్రతి ఏడాది మహిళలపై జరుగుతున్న హింస, దానిపై తీసుకోవల్సిన చర్యలపై సమీక్షా సమావేశం పెట్టేవాళ్ళు. వాటికి మహిళా సంఘాలను పిలిచి అభిప్రాయాలు తీసుకునేవాళ్ళు. కానీ ఈ పదేండ్లల్లో ఒక్కసారి కూడా ఇలాంటి సమీక్షా సమావేశం లేదు. పైగా రాష్ట్రం ఏర్పడిన ఆరేండ్లకు మహిళా కమిషన్ ఏర్పాటు చేశారు. ఇప్పటికి ఆరు సార్లు కలిసి సమీక్షా సమావేశాలు ఏర్పాటు చేయమని అడిగాం. అయినా ఎలాంటి స్పందనా లేదు. అంటే వీరి ఎజెండాలో మహిళా రక్షణ, సంక్షేమం అనేది లేదు. మహిళలపై జరుగుతున్న హింస తగ్గాలంటే సమీక్షలు చేయాలి. అధ్యయనం చేసి అవసరమైన చర్యలు చేపట్టాలి. వాటిని ఆచరణలో పెట్టాలి. అప్పుడే మహిళలకు రక్షణ. అలాగే ఉపాధి, వైద్యం, విద్య, రక్షణ కోసం మహిళలకు ప్రత్యేక పథకాలు కల్పించాలి. సామాజిక భద్రత కల్పించేందుకు అవసరమన చర్యలు తీసుకోవాలి.

- సంధ్య, పీఓడబ్ల్యూ

చిత్తశుద్ధితో కృషి చేయాలి



నేడు మహిళలకు మరీ ముఖ్యంగా ఆడపిల్లలకు, యువతులకు రక్షణ కరువైంది. ఇటీవల కొంతమంది యువతుల్ని కర్కశంగా హత్య చేసి ముక్కలుగా నరకటం, బ్యాగ్‌లో పెట్టి తీసుకెళ్లి డ్రైనేజ్‌లో పడేయటం లాటి సంఘటనలు ఒళ్ళు గగుర్పొడుస్తున్నాయి. ఈ కిరాతక హత్యలను చేసిన వారిని అరెస్టు చేస్తున్నారు. కానీ మనుషులు ఇంత దుర్మార్గంగా ఎందుకు తయారయ్యారు? వీరి ఆలోచనలకు పునాది ఏంటి అని ఎవ్వరూ మనసు పెట్టి ఆలోచించట్లేదు. అదేవిధంగా ఎంతో మంది దళిత, ఆదివాసీ బాలికలు ప్రేమ పేరుతో మోసానికి గురవుతున్న సంఘటనలు మా సంస్థ 'దళిత స్త్రీ శక్తి' ద్వారా చూశాం. ఇటీవల జరిగిన హత్యల్లో, బాలికల్ని మోసం చేస్తున్న సంఘటనల్లో మొబైల్ ఛాటింగ్, ఇన్‌స్టాగ్రామ్ ఛాటింగ్ లాంటి ఆధునిక వ్యసనాల పాత్ర బాగా వుంది. గతంతో పోలిస్తే స్త్రీలు అన్ని రంగాలలోను చైతన్యవంతమై ఆర్థికంగా కూడా ఎదుగుతున్నారు. కానీ దాంతో పాటు ఆధునికత తెచ్చిన కొత్త టెక్నాలజీ దుర్వినియోగం కూడా పెరిగింది. దీనితో నేటి తరంలో సామాజిక స్పృహ పూర్తిగా కొరవడింది. జాతీయ అంతర్జాతీయ స్థాయిల్లో మహిళా హక్కులకై ఉద్యమించి బీజింగ్ కాన్ఫరెన్స్ నుంచి రకరకాల హక్కులను సాధించిన మహిళా చైతన్యం నేడు కొరవడింది. దీనితో పురుషాధిక్య ఛాందస వాదం ప్రపంచ వ్యాప్తంగా మళ్ళీ పడగ విప్పింది. ఇలా అధ్వాన్నమయిన వ్యవస్థను సరిదిద్దాలంటే ఏ ఒక్కరి వల్ల సాధ్యం కాదు. ప్రభుత్వ పథకాలు, చట్టాలు అమలు తీరు నామ మాత్రంగా కాకుండా నిజాయితీగా అమలవ్వాలంటే అందరూ చిత్తశుద్ధితో కృషి చేయాలి.

- ఝాన్సీ గెడ్డం, జాతీయ కన్వీనర్, దళిత స్త్రీ శక్తి

తక్షణ శక్తి కోసం...

పనిలో మునిగిపోయి సమయానికి అల్పాహారం, భోజనం వంటివి తీసుకోవడంలో ఆలస్యం చేయకూడదు. ఒకవేళ పని ఒత్తిడిలో కొన్నిసార్లు తినడం కుదరకున్నా ఖాళీ కడుపుతో ఉండకూడదు. ఇలా ఉండటం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తవచ్చు. అల్పాహారం, భోజనం చేయడం కుదరని పక్షంలో కనీసం కొన్ని రకాల పండ్లనైనా తీసుకోవాలి. ఇవి తీసుకోవడం వల్ల పొట్ట ఖాళీగా ఉండకుండా ఉంటుంది, తక్షణ శక్తి అందుతుంది. అవేంటో చూద్దాం...

అరటి : శక్తిని వెంటనే అందించే సామర్థ్యం దీని సొంతం. పొటాషియం, విటమిన్ సి, బి కాంప్లెక్స్ ఇందులో ఉన్నాయి. మలబద్ధకం ఉన్నవాళ్ళు రోజూ రాత్రి రెండు అరటిపళ్ళు తింటే విరేచనం సాఫీగా అవుతుంది. పిల్లలకు బాగా మెత్తగా పండిన పండు మేలు చేస్తుంది. త్వరగా అనారోగ్యం నుండి కోలుకుంటారు.

ఆపిల్ : రోజుకో ఆపిల్ పండు తింటే డాక్టరుకు దూరంగా ఉండొచ్చు అని అంటుంటారు. దీనిలో కార్బోహైడ్రేట్లు, పీచుపదార్థాలు ఎక్కువే. చక్కెర శాతం తక్కువ. దీన్ని మధుమేహులు కూడా తినవచ్చు. దీనిలో శక్తినిచ్చే పదార్థమే కాకుండా పోషక విలువలు కూడా చాలా ఉన్నాయి.

ఆరెంజ్ : వీటిలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇది శరీర సౌందర్యానికి కూడా చాలా మంచిది. పొటాషియం ఎక్కువగా ఉండడం వల్ల అలసిపోయిన కండరాలకు, గుండెకు మేలు చేస్తుంది. దీన్ని మధుమేహ వ్యాధిగ్రస్తులు కూడా తినొచ్చు. ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల జీర్ణప్రక్రియకు, మలబద్ధకం నివారించేందుకు చాలా ఉపయోగపడుతుంది.

బొప్పాయి : బొప్పాయిలో ఐరన్, పొటాషియం, కాల్షియం, విటమిన్ ఎ, సి, బి కాంప్లెక్స్ చాలా ఎక్కువగా ఉన్నాయి. మధుమేహులు కూడా తీసుకోవచ్చు. రోగ నిరోధకశక్తిని పెంపొందిస్తుంది. జీర్ణ ప్రక్రియ సాఫీగా సాగుతుంది.

పైనాపిల్ : ఎనర్జీని అందించడంలో మరో అద్భుతమైన పండు. అంతేకాదు శరీరానికి కావల్సిన న్యూట్రీషియన్స్‌ను పుష్కలంగా అందిస్తుంది. ఇందులో సి విటమిన్ పుష్కలంగా ఉండటం వల్ల ఇది ఎనర్జీ లెవల్స్‌ను పెంచుతుంది.

మామిడి : విటమిన్ ఎ, బీటాకెరోటిన్, బి కాంప్లెక్స్, విటమిన్ సి, ఐరన్, కాల్షియం, పొటాషియం, రోగనిరోధక శక్తి ఎక్కువ చేసే యాంటి ఆక్సిడెంట్‌లు ఉన్నాయి. శక్తిని వెంటనే అందజేస్తుంది. దీనిలో పీచు (ఫైబర్) ఉండడం వల్ల, రక్త ప్రసరణకు, సాఫీగా విరేచనం కావడానికి తోడ్పడుతుంది.

పుచ్చకాయ : దీనిలోని పీచు పదార్థం జీర్ణప్రక్రియను సరిగ్గా ఉంచుతుంది. విటమిన్ సి, ఎ, ఐరన్, పొటాషియం, ఒక రకమైన తీపి పదార్థం ఉండడం వల్ల శక్తినిస్తుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది.



కోవిన్ పోర్టల్ డేటా చౌర్యం !

(మొదటిపేజి తరువాయి)

చౌర్యాన్ని 'ది న్యూస్ మినిట్' అనే స్వతంత్ర డిజిటల్ వేదిక ధృవీకరించింది. దక్షిణ భారతదేశంలోని ఐదు రాష్ట్రాలకు చెందిన తాజా వార్తలను ఈ వేదిక అందిస్తూ ఉంటుంది. లోక్‌సభ సభ్యురాలు కనిమొళి, తెలంగాణ ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, కేంద్ర మాజీ మంత్రి హర్షవర్ధన్, బీజేపీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై, కాంగ్రెస్ ఎంపీ కార్తి చిదంబరం తదితర నేతల సమాచారాన్ని టెలిగ్రామ్ గ్రూప్ ద్వారా ది న్యూస్ మినిట్ సేకరించింది. కోవిన్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న వారి వివరాలు పొందాలంటే పెద్దగా కష్టపడాల్సిన అవసరం లేదు. ఆ యాప్‌లో పేరు నమోదు చేసుకున్న వ్యక్తి ఫోన్ నెంబర్ లేదా ఆధార్ నెంబర్ ఇస్తే చాలు...మిగిలిన వివరాలన్నీ తెలిసిపో తాయి. ది న్యూస్ మినిట్ సోమవారం ఉదయం 9 గంటలకు టెలిగ్రామ్ గ్రూప్ నుంచి నేతల వ్యక్తిగత వివరాలు సేకరించింది. సమాచార చౌర్యంపై కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ స్పందించింది. ఈ వ్యవహారంపై పరిశీలన జరిపి, నివేదిక అందించాలని ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌ను ఆదేశించింది. కోవిన్ పోర్టల్ పూర్తి సురక్షితమైనదని, ప్రజల వ్యక్తిగత సమాచారం గోప్యంగా ఉంటుందని కేంద్ర ప్రభుత్వం చెబుతూ వస్తోంది. పాస్‌వర్డ్‌ను నమోదు చేస్తేనే ఈ పోర్టల్‌లో ప్రవేశించే అవకాశం ఉంటుందని గుర్తు చేసింది. కోవిన్ పోర్టల్ సమాచారం నేరుగా చౌర్యానికి గురైనట్టు అనిపించడం లేదని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ చెప్పారు. అయితే ప్రజల వ్యక్తిగత సమాచారం చౌర్యానికి గురికావడం ఇది మొదటిసారి కాదు. పోర్టల్‌లో నమోదైన 15 కోట్ల మంది భారతీయుల సమాచారం తన వద్ద ఉన్నదని డార్క్ లీక్ మార్కెట్ అనే హ్యాకర్ గ్రూప్ 2021 జూన్‌లో ప్రకటించింది.

దర్యాప్తు చేస్తున్నాం : కేంద్రం

డేటా లీక్ వార్తలను దర్యాప్తు చేస్తున్నామని కేంద్రప్రభుత్వం తెలిపింది. ఈ వ్యవహారాన్ని పరిశీలించి నివేదిక సమర్పించాలని కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (సిఇఆర్‌టి)ని కేంద్రం కోరింది. డేటా లీక్ వార్తలను కేంద్ర ఆరోగ్యమంత్రిత్వశాఖ ఖండించింది. 'ఇవన్నీ నిరాధార వార్తలు. కోవిన్ పోర్టల్‌ను అన్ని భద్రతా ప్రమాణాలతో రూపొందించాం. ఒటిపి అథెంటికేషన్‌తో మాత్రమే ఇందులోని డేటాను చూడగలం' అని పేర్కొంది. ఒటిపి లేకుండా కొవిన్ పోర్టల్‌లోని సమాచారాన్ని ఏ బాట్‌లోనూ షేర్ చేయలేమని తెలిపింది.

మోడీ మౌనం బాధించింది

న్యూఢిల్లీ : రెజ్లింగ్ ఫెడరేషన్ మాజీ చీఫ్, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ అంశంపై ప్రధాని మోడీ మౌనంగా ఉండటం తనను తీవ్రంగా బాధించిందని రెజ్లర్ వినేష్ ఫోగట్ అన్నారు. బ్రిజ్ భూషణ్‌ను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. అందుకే అరెస్టు చేయలేకపోతున్నారని విమర్శించారు.

క్రీడా మంత్రి మొబైల్‌లో బిజీగా ఉన్నారు

ఆందోళన చేస్తున్న రెజ్లర్లను ఈ నెల 7న చర్చలకు ఆహ్వానించిన క్రీడా మంత్రి దృష్టి ఆ సమావేశంలో తమ వైపు లేదని వినేష్ చెప్పారు. తమ బాధలు వినకుండా మొబైల్‌తో బిజీ అయిపోయారనీ, ఆయన తమ ఫిర్యాదులను వినడానికి ఆసక్తి చూపలేదని తెలిపారు. ఈ నెల 15న కేసు ఛార్జిషీటును అందజేస్తామనీ, 30లోగా డబ్ల్యూఎఫ్ఐ ఎన్నికలు ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్వహిస్తామని అందులో హామీ ఇచ్చారని అన్నారు.

15 తర్వాత కీలక నిర్ణయం

క్రీడల మంత్రి ప్రకటన ప్రకారం ఇప్పుడు ఛార్జ్‌షీట్ కోసం ఎదురుచూస్తున్నామని వినేష్ ఫోగట్ తెలిపారు. ఆ తరువాత కూడా బ్రిజ్ భూషణ్‌పై చర్యలు తీసుకోకపోతే ఆ రోజు రాత్రి (జూన్ 15) సమావేశం నిర్వహించి ఉద్యమాన్ని ప్రకటిస్తామన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేసేందుకు ప్రభుత్వం అనుమతించకపోతే.. రాంలీలా మైదాన్‌లో, మరేదైనా ప్రాంతంలో ఆందోళన చేపడతామన్నారు. శిక్షణ శిబిరాలు, టోర్నమెంట్‌ల్లో బ్రిజ్ భూషణ్ యువ మహిళా రెజ్లర్లను ఒంటరిగా ఉన్నప్పుడు తాకడానికి సాధ్యమైన అన్ని మార్గాలను ఉపయోగించాడని వినేష్ ఫోగట్ ఆరోపించారు. ఇది మళ్లీ మళ్లీ జరిగేదని, కానీ భయంతో అందరూ మౌనంగా ఉండేవారని అన్నారు. మాజీ చీఫ్ సింగ్‌పై లైంగికంగా వేధింపుల కేసులో అంతర్జాతీయ రిఫరీ జగ్బీర్, ఫిజియోథెరపిస్ట్ నుంచి వాంగ్మూలం తీసుకున్న తరువాత ఇప్పుడు ఢిల్లీ పోలీసులు కజకిస్తాన్, మంగోలియా, ఇండోనేషియా నుంచి సహాయం కోరారు. సింగ్‌పై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఆరోపించిన ప్రదేశాలకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీలు, ఫోటోలను అందించాలని రెజ్లింగ్ సంఘాలకు నోటీసులు పంపారు.

మోగిన బడిగంట

(మొదటిపేజి తరువాయి)

ఇంగ్లీష్ మీడియంలో బోధన సమాంతరంగా ప్రారంభం కానుంది. ఈనెల మూడో తేదీ నుంచి జయశంకర్ బడిబాట ప్రారంభమైన విషయం తెలిసిందే. 49 రోజుల తర్వాత ప్రభుత్వ పాఠశాలలు తెరుచుకున్నాయి. దీంతో పాఠశాలల ఆవరణ, తరగతి గదులు అపరిశుభ్రంగానే కనిపించాయి. బడుల్లో పారిశుధ్యం బాధ్యతను గ్రామపంచాయతీలు, మున్సిపాల్టీలకు ప్రభుత్వం అప్పగించింది. అక్కడి కార్మికులు పాఠశాలల ఆవరణ, పరిసరాల పరిశుభ్రం చేయడానికే పరిమితమయ్యారు. దీంతో తరగతి గదులు దుమ్ము ధూళితో ఉన్నాయి. పాఠశాలల్లో పారిశుధ్య కార్మికుల కొరత తీవ్రంగా ఉన్నది. స్వచ్ఛ కార్మికులను నియమించాలని ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. రూ.వంద కోట్లు కేటాయిస్తే ఏడాది మొత్తం ప్రతి బడికీ స్వచ్ఛ కార్మికులను నియమించొచ్చని సూచిస్తున్నాయి. అయినా ప్రభుత్వం పెడచెవిన పెడుతున్నది. రాష్ట్రంలో కొన్ని చోట్ల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులే సొంతంగా డబ్బులు ఇచ్చి పారిశుధ్య కార్మికులను నియమించుకున్న సంఘటనలున్నాయి. ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించి రాష్ట్రంలో ఎక్కువ చోట్ల విద్యార్థులకు యూనిఫారాలు ఇవ్వలేదు. దీంతో సాధారణ బట్టలు, పాత యూనిఫారాలతోనే విద్యార్థులు బడులకు హాజరయ్యారు. పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు పాఠశాలలకు వచ్చినా అన్ని చోట్ల విద్యార్థులకు పంపిణీ చేయలేదు. ఇంకోవైపు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తున్నది. దాదాపు 22 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్టు సమాచారం. విద్యాసంవత్సరం ప్రారంభమైనా ఉపాధ్యాయుల నియామకానికి నోటిఫికేషన్ జారీ ప్రక్రియ ఊసేలేదు. ఇంకోవైపు విద్యావాలంటీర్ల నియామకంపైనా స్పష్టత లేదు. రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు-మనబడి, మనబస్తీ-మనబడి కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది. రూ.7,289 కోట్లతో 26,065 సర్కారు బడుల్లో 12 రకాల మౌలిక వసతులను కల్పిస్తున్నట్టు ప్రకటించింది. మొదటి విడతలో రూ.3,497 కోట్లతో 9,123 బడుల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించింది. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 20న విద్యాదినోత్సవం సందర్భంగా 1,600 స్కూళ్లలో నిర్మించిన 4,800 డిజిటల్ తరగతి గదులు, 10 వేల గ్రంథాలయాలను ప్రారంభించనుంది. అయితే మన ఊరు-మనబడి కింద మౌలిక వసతులు కల్పించినా ఏ విధంగా నిర్వహణ చేయాలంటూ ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాయి.

1.46 లక్షల మంది చేరిక

బడిబాట కార్యక్రమంలో సోమవారం 8,381 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన ఒక ప్రకటనలో ప్రకటించారు. ఇందులో అంగన్‌వాడీ కేంద్రాల నుంచి 2,607 మంది, ప్రయివేటు స్కూళ్ల నుంచి 391 మంది, నేరుగా చేరిన వారు 1,397 మంది కలిపి మొత్తం 4,386 మంది ప్రవేశం పొందారని తెలిపారు. ఇప్పటి వరకు సర్కారు బడుల్లో 1,46,824 మంది విద్యార్థులు ప్రవేశం పొందారని తెలిపారు.

విద్యార్థులను పంపేందుకు ఆసక్తి చూపని తల్లిదండ్రులు

ఖమ్మం ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ప్రయివేట్ విద్యార్థులు సోమవారం ప్రారంభమయ్యాయి. విద్యార్థులు మాత్రం నామమాత్రంగా హాజరయ్యారు. ఖమ్మం జిల్లాలో 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో పాఠశాలలకు విద్యార్థులను పంపించడానికి తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలంలో పలు ప్రభుత్వ పాఠశాలలకు పదుల సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. ముదిగొండ మండలం ఖానాపురం ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు గ్రామ సర్పంచ్ చేతుల మీదుగా ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. కల్లూరులో పలు పాఠశాలల విద్యార్థులకు డీఈవో సోమశేఖర శర్మ పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. మధిర మండలం మహాదేవపురం గ్రామంలో ఎస్ఎంసీ ఛైర్మెన్ కలక కృష్ణయ్య చేతుల మీదుగా పుస్తకాలు పంపిణీ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలో మొత్తం 92 పాఠశాలలకు గాను 3276 మంది విద్యార్థులకు మొదటి రోజు అయిన సోమవారం 594 మంది మాత్రమే హాజరయ్యారు. హాజరు శాతం 18.13 గా నమోదు అయింది. అశ్వారావుపేట సీపీఎస్ పాఠశాలలో 60 మంది విద్యార్థులకు గాను ఇద్దరు మాత్రమే వచ్చారు.

రంగారెడ్డిలో 20 శాతం హాజరు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పాఠశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు అంతగా ఆసక్తి చూపలేదు. రంగారెడ్డి జిల్లాలో లక్ష 40 వేల మంది విద్యార్థులకుగాను మొదటి రోజు 28 వేల మంది మాత్రమే పాఠశాలలకు హాజరయ్యారు. కేవలం 20 శాతం మంది పాఠశాలలకు హాజరయ్యారు. ఎండలు ఎక్కువగా ఉండడమే ఇందుకు కారణంగా జిల్లా అధికారులు భావిస్తున్నారు. అలాగే వేసవి సెలవుల్లో ఊర్లకి వెళ్లిన వారు తిరిగి రాకపోవడం కూడా కారణంగా అధికారులు తెలిపారు. వికారాబాద్ జిల్లాలోని దోమ, కుల్కచర్ల మండలాలతోపాటు మరికొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు.

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో 2కే, 5కే రన్స్

(మొదటిపేజి తరువాయి)

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 2కే రన్‌ను శాసనమండలి ఛైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, ఎస్పీ అపూర్వరావుతో కలిసి బెలూన్ వదిలి జెండా ఊపి ప్రారంభించారు. యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలోని భువనగిరి ఖిల్లాపై జాతీయ జెండాను ఎమ్మెల్యే పైళ్లశేఖర్‌రెడ్డి కలెక్టర్ పమేలా సత్పతి, డీసీపీ రాజేశ్‌చంద్రతో కలిసి ఎగురవేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో మంత్రి జగదీశ్‌రెడ్డి 2కే రన్‌ను ప్రారంభించారు.

ఖమ్మం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన 2కే రన్‌ను ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్, నగర మేయర్ పునుకొల్లు నీరజలతో కలిసి సర్దార్ పటేల్ స్టేడియం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్, పోలీస్ కమిషనర్‌లు అధికారులతో ట్యాంక్ బండ్ వద్ద ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ వద్ద సెల్ఫీలు దిగారు.

రంగారెడ్డి జిల్లా బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రాచకొండ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ 5 కే రన్‌ను విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. త్రివర్ణ రంగుల బెలూన్‌లను వదిలి, రన్‌లో పాల్గొంటున్న వారిని అభినందించారు.

నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి 2కే రన్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో మంత్రి పాల్గొన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో 2కే రన్‌ను పోలీస్, యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. దీన్ని కలెక్టర్ రాహుల్ రాజ్ పీస్, ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఆసిఫాబాద్ జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో 2కే, 5కే రన్ నిర్వహించారు. కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవ్‌రావు అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్ బాజ్‌పాయితో కలిసి జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. అనంతరం పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

డీజే టిల్లు సాంగ్‌కు మంత్రి మల్లారెడ్డి స్టెప్పులు

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పీర్జాదిగూడలోని ఏవీ ఇన్ఫోసైడ్ గ్రౌండ్‌లో తెలంగాణ 2కే రన్ వేదికపై మంత్రి మల్లారెడ్డి డీజే టిల్లు పాటకు స్టెప్పులేసి అందరిలో జోష్ నింపారు. మంత్రితో కలిసి ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, కలెక్టర్ అమోయ్ కుమార్, రాచకొండ సీపీ కమిషనర్ చౌహాన్, మేయర్ జక్క వెంకట్ రెడ్డి తదితరులు జోష్‌గా జుంబా డ్యాన్సు చేశారు.

17న కొడకండ్లకు కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం కొడకండ్ల మండల కేంద్రంలో మినీ టెక్స్‌టైల్ పార్కుకు ఈనెల 17న ఐటీ, పరిశ్రమలు, చేనేత, పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు శంకుస్థాపన చేస్తారని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రకటించారు. సోమవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఆయా శాఖల ఉన్నతాధికారులతో మంత్రి ఎర్రబెల్లి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేనేత కార్మికులు అధికంగా ఉన్న కొడకండ్ల, చుట్టుపక్కల ప్రాంతాల వారికి ఉపాధి కల్పించే ఉద్దేశంతోనే సిరిసిల్ల తరహాలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేయాలని గతంలోనే నిర్ణయించామన్నారు. ఇది ఆ ప్రాంత అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎర్రబెల్లి ట్రస్టు ఆధ్వర్యంలో కుట్టుశిక్షణ పూర్తి చేసుకున్న పాలకుర్తి నియోజకవర్గానికి చెందిన మహిళలకు ఆగస్టు నుంచి వరంగల్ టెక్స్‌టైల్ పార్కులో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్టు తెలిపారు. ఇప్పటికే వరంగల్ మెగా టెక్స్‌టైల్ పార్కుకు చెందిన పలువురు ప్రతినిధులతో ఈ అంశంపై చర్చించామన్నారు.



పైలట్ ప్రాజెక్టుగా రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా పాలకుర్తి నియోజకవర్గంలో మూడు వేల మంది మహిళలకు దుస్తులు కుట్టడంలో శిక్షణ ఇవ్వడమే కాకుండా వారికి ఉచితంగా కుట్టు మిషన్లను కూడా పంపిణీ చేశామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, టెక్స్‌టైల్ కమిషనర్ బుద్ధ ప్రకాష్, డైరెక్టర్ మెహర్, యంగ్ ఇండియా, కిటెక్స్, తదితర కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సుస్థిర వ్యవసాయమే లక్ష్యంగా..

(మొదటిపేజి తరువాయి)

తెలిపారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో అటు రష్యాకు కొన్ని, ఇటు ఉక్రెయిన్‌కు కొన్ని దేశాలు మద్దతిస్తూ చీలిపోయిన నేపథ్యంలో మన దేశం తటస్థంగా ఉండి కీలక పాత్ర పోషిస్తోందన్నారు. జీ-20 దేశాలకు ఎంతో ప్రాధాన్యం ఉందనీ, జీడీపీలో 85 శాతం ఈ దేశాల నుంచే వస్తున్నదని వివరించారు. 46 సెక్టార్లకు సంబంధించి 56 నగరాల్లో జీ-20 సమావేశాలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటి వరకూ 140 సమావేశాలు పూర్తయ్యాయని తెలిపారు. ఇప్పటికే హైదరాబాద్‌లో స్టార్టప్ ఎంగేజ్‌మెంట్, డిజిటల్ ఎకనామీ వర్కింగ్ గ్రూపుల సమావేశాలను నిర్వహించామని వివరించారు. వ్యవసాయానికి సంబంధించిన సమావేశాల్లో ఆహార భద్రత, పోషకాహార కోసం సుస్థిర వ్యవసాయం, మహిళల నేతృత్వంలో వ్యవసాయాభివృద్ధి, జీవ వైవిధ్య వాతావరణ మార్పులను తట్టుకునేలా వ్యవసాయ రంగంలో రావాల్సిన మార్పులు, తదితర అంశాలపై విస్తృతంగా చర్చించనున్నట్టు తెలిపారు. పర్యాటక శాఖకు సంబంధించిన తుది సమావేశాలు గోవాలో ఈ నెల 19 నుంచి 22వరకు జరుగుతాయనీ, గోవా రోడ్ మ్యాప్ పేరుతో టూరిజంపై ఒక డిక్లరేషన్ ప్రకటిస్తామని చెప్పారు. జీ-20 చివరి సమావేశాలు సెప్టెంబర్ 9,10 తేదీల్లో ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో జరుగుతాయనీ, దానికి జీ-20 దేశాల అధ్యక్షులు, ప్రధానులు హాజరవుతారని తెలిపారు.

విచారణ జరపాలి

(మొదటిపేజి తరువాయి)

తీవ్ర ఆందోళన కలిగిస్తున్నదనీ, పైగా భారతీయుల ప్రాథమిక హక్కుగా సుప్రీంకోర్టు ప్రకటించిన గోప్యతా హక్కును ఉల్లంఘిస్తోందని పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఇటువంటి ఆరోపణలనే 2021 జూన్‌లో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తిరస్కరించింది. అయినప్పటికీ కొవిన్ వ్యవస్థ నుంచి లీకేజీ జరిగిందన్న ఆరోపణలపై సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని కంప్యూటర్ హ్యాకింగ్ గ్రూపైన కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌తో దర్యాప్తుకు ఆదేశించింది. ఈ దర్యాప్తు వివరాలు ఇంకా పబ్లిక్ డొమైన్‌లో పెట్టలేదు. వెంటనే ఈ మొత్తం వ్యవహారంపై కూలంకషంగా దర్యాప్తు జరగాలని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది. భారతీయుల వ్యక్తిగత సమాచార భద్రతలో జరిగిన ఇంత తీవ్ర ఉల్లంఘనకు బాధ్యులైన వారిని గుర్తించి, కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరింది.

ఆడబిడ్డలకు అండగా...

మహిళల సంక్షేమమే లక్ష్యంగా సర్కారు

- ఆరోగ్యలక్ష్మితో 36,26,603 మంది మహిళలకు లబ్ది
- దశాబ్ది ఉత్సవాల్లో నేడు మహిళా సంక్షేమ దినోత్సవం
- ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి



నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

అరవై ఏళ్ల సుదీర్ఘ పోరాటంతో స్వరాష్ట్రం ఏర్పాటు కలను సాకారం చేసుకున్న తెలంగాణ తొమ్మిదేళ్ల కాలంలో జనాభాలో సగభాగంగా ఉన్న ఆడబిడ్డలకు అండగా నిలుస్తున్నది. ఈ కాలంలో దేశం యావత్తూ అబ్బురపడే పథకాలను అమలు చేస్తూ... దేశానికీ, అంతర్జాతీయంగా ఇతర దేశాలకు ఆదర్శంగా నిలుస్తున్నది. ఎన్నో కష్టాలు, బలిదానాలు, త్యాగాలతో సాధించుకున్న రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం పలు పథకాలు, కార్యక్రమాలను అమలు చేస్తున్నది. మాతా శిశు సంరక్షణ కార్యక్రమాల అమల్లో భాగంగా చేపట్టిన వివిధ పథకాలకు దేశ వ్యాప్తంగా ప్రశంసలొచ్చాయి.

గర్భిణీలకు, బాలింతలకు పోషకాహారం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం 'ఆరోగ్య లక్ష్మి' కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టింది. ఈ పథకం ద్వారా అంగన్ వాడీ కేంద్రాలలో వేడి వేడిగా వండిన భోజనాన్ని అందిస్తోంది. ఈ కార్యక్రమాన్ని సీఎం చేతుల మీదుగా 2015 లో ప్రారంభించారు. ఆరోగ్య లక్ష్మీ పథకంతో తొమ్మిదేండ్లలో సుమారు 36,26,603 మంది మహిళలు లబ్ది పొందారు. దీంతో పాటు చిన్నారుల్లో తీవ్ర పౌష్టికాహార లోపాలను అరికట్టడానికి ప్రభుత్వం " బాలామృతం ప్లస్" అనే పథకాన్ని కూడా ప్రవేశ పెట్టింది. అదనపు కార్బోహైడ్రేట్స్ తో పాటు ప్రొటీన్లు, సూక్ష్మ పోషకాలు పిల్లలకు అందేలా దీన్ని రూపొందించారు. అంగన్ వాడి కేంద్రాల్లో నమోదైన చిన్నారులకు బాలామృతం ప్లస్‌ను అందించడంతో పాటు వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు. ఈ పథకాన్ని ఆసిఫాబాద్- కొమరంభీం, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన తర్వాత అన్నీ జిల్లాలకు విస్తరించారు. పాఠశాల బయట ఉన్న కౌమార దశ, (11-14 వయస్సు మధ్యలో) ఉన్న ఆడ పిల్లలకు, ఇతర అవసరాలున్నవారికి పోషకాహార కిట్లను ప్రభుత్వం అందచేస్తుంది. దానిలో గోధుమలు, నెయ్యి, ఖర్జూరాలు, ప్రొటీన్ బిస్కెట్లు, ఐరన్, జింక్ సిరప్, మల్టీ విటమిన్ల మాత్రలు ఉంటాయి.

గిరిజన సంక్షేమ శాఖ, మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ సంయుక్తంగా ఇక్రిశాట్ శాస్త్రీయ సహకారంతో ఈ పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్నది. తక్కువ బరువు, పెరుగుదల లో లోపం, రక్త హీనత, కలిగిన గిరిజన పిల్లలు, కౌమార దశ బాలికలు, గర్భిణీలు, బాలింతలకు ఈ గిరిపోషణ కార్యక్రమాన్నివర్తింప చేశారు. ఉట్నూర్, భద్రాచలం, మన్నూరులలో సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) పరిధిలోని ప్రాంతాల్లో శిశువులు, గర్భిణీలు, కౌమార దశ ఉన్న ఆడ పిల్లలకు హైడ్రేట్ పోషకాహారాన్ని అందిస్తున్నది. మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ చేపట్టే కార్యక్రమాలలో ప్రీ- ప్రైమరీ విద్యాబోధన కీలక భూమిక పోషిస్తోంది. పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం 2019 లో పాఠ్య ప్రణాళికలో మార్పులు చేసింది. అంగన్ వాడీ టీచర్లకు నెలనెలా పుస్తకాలను అందిస్తు న్నది. తంగేడు పూల పేరిట నాలుగు పుస్తకాలు, పాలపిట్ట పేరిట ఐదు పుస్తకాలను ఎల్‌కేజీ, యూకేజీలో చేరిన విద్యార్థులకు విధిగా ప్రభుత్వం అందిస్తోంది. పూర్వ ప్రాథమిక విద్యా పాఠ్య ప్రణాళికలో వీడియోలు, ఆడియో కార్యక్రమాలు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. సమగ్ర పిల్లల రక్షణ పథకం (ఐసీపీఎస్) రాష్ట్రంలోని 33 జిల్లాల్లో బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి వీలుగా బాలరక్షక్ వాహనాలను ఏర్పాటు చేసి, రెస్క్యూ ఆపరేషన్స్‌లో వాడుతున్నది. దేశంలోనే మొట్టమొదటి సారిగా వివిధ కార్పొరేట్ సంస్థలు, ఎన్‌జీవోల సహకారంతో అందిన నిధులతో వాహనాలను కొనుగోలు చేసి, రెస్క్యూ ఆపరేషన్ల లో వినియోగిస్తున్నారు. రక్షక భవనాలను ఏర్పాటు చేయడం ద్వారా ఒకే గొడుగు కింద బాలల రక్షణ చర్యలను చేపట్టింది.

గృహహింస, వేధింపులు, దాడులు, ప్రమాదాలకు గురైన మహిళకు తక్షణ వైద్యం, న్యాయం, ఆర్థిక సాయం అందించే లక్ష్యంతో వన్ స్టాప్ సెంటర్ " సఖి"ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 2017లో ప్రారంభమైన ఈ కేంద్రాల ను అన్ని జిల్లాలకు విస్తరింపజేసింది. వీటితో మహిళలకు బహుముఖ సేవలు అందజేస్తుంది. ఈ కేంద్రంలో మహిళకు ఐదు రోజుల పాటు అత్యవసర ఆశ్రయం కల్పిస్తుంది. సఖి కేంద్రాలు 24/7 పాటు పని చేస్తాయి.

ప్రత్యేకంగా మహిళా ప్రయాణీకుల రక్షణ/రవాణా కోసం ప్రభుత్వం 16 షీ టాక్సీలను ప్రవేశపెట్టింది. 16 మంది మహిళా డ్రైవర్లు ఈ టాక్సీలను నడుపుతూ మహిళా ప్రయాణీకులకు రక్షణగా ఉంటున్నారు. షీ టాక్సీలను 35 శాతం సబ్సిడీతో ప్రభుత్వం అందిస్తోంది. మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ తన వాటాగా 35 శాతం సబ్సిడీ, 10 శాతం మార్జిన్ మనీతో మహిళా క్యాబ్ డ్రైవర్లను క్యాబ్‌లు కొనుగోలు చేసేందుకు ప్రోత్సహిస్తుంది. దేశంలోనే మొట్ట మొదటిసారిగా ప్రభుత్వం మహిళల కోసం మోటార్ డ్రైవింగ్ స్కూల్‌ను రూ.49 లక్షలు వెచ్చించి స్థాపించింది.

మహిళలు సర్వతోముఖాభివృద్ధిగా చెందినపుడే సమాజం అభివృద్ధి చెందుతుంది. అనే నమ్మకంతో స్వయం సహాయక సంఘ మహిళలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. స్వయం సహాయక బృంద మహిళల ఆర్థిక స్వావలంభన కోసం బ్యాంక్ లింకేజీ ద్వారా వారికి రుణాలను విరివిగా ఇచ్చేలా చర్యలు చేపట్టింది. రాష్ట్రం ఏర్పడిన తరువాత బ్యాంకులు స్వయం సహాయక బృందాలకు ఇచ్చే ద్రవ్య సహాయం మూడింతలు పెరిగింది. 2014-15 సంవత్సరం లో బ్యాంకులు స్వయం సహాయక బృందాలకు రూ.3,738.67 కోట్ల రుణాలు ఇవ్వగా, 2022-23 నాటికి అది రూ. 12,722.14 కోట్లకు చేరుకుంది. స్వయం సహాయక బృందాల సభ్యులు, బృందాల గ్రామ స్థాయి సంస్థల ఆర్థిక లావాదేవీలను నమోదు చేసేందుకు మొబైల్ అకౌంటింగ్ యాప్‌ను కూడా రూపొందించినట్టు సమాచార పౌరసంబంధాల కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి..

దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మహిళా దినోత్సవ కార్యక్రమాల ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంగళవారం హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభం కానున్నాయి.ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్,విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, హోంశాఖ మంత్రి మహముద్‌అలీ, పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, మహిళా కమిషన్ చైర్మెన్ సునితా లక్ష్మారెడ్డి, మేయర్ గద్వాల విజయ లక్ష్మి, మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్మెన్ ఆకుల శ్రీలత పాల్గొంటారు. కార్యక్రమంలో కిషోరామృతం, ఆరోగ్య లక్ష్మి తదితర కార్యక్రమాలు ప్రారంబిస్తారు.

అర లక్ష దాటిన దరఖాస్తులు

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

వెనుకబడిన వర్గాల కులవృత్తులకు లక్ష రూపాయల ఆర్థిక సాయం కోసం ఇప్పటివరకూ 53 వేల దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదయ్యాయని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రావెంకటేశం ఇతర ఉన్నతాధికారులతో కలిసి సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి ఇదే అంశంపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. కులవృత్తులకు మంచి వైభవం తీసుకొచ్చి వారి జీవితాలను మెరుగుపరుచుటమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కులవృత్తికి ఉపయోగపడే ముడిసరుకు, పనిముట్ల కొనుగోలుకు బ్యాంకు లింకేజీ లేకుండా, తిరిగి చెల్లించే అవసరం లేకుండా రూ. లక్షను ప్రభుత్వం అందజేస్తుందని వివరించారు. ఈనెల 20 వరకు ఆన్ లైన్ ద్వారా https://tsobmms.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు, ఆదాయ పత్రాలు 2021 ఎప్రిల్ నుంచి జారీ చేసినవి చెల్లుబాటవుతాయని తెలిపారు. జిల్లా కలెక్టర్లు సైతం అవసరార్థుల ఆదాయ సర్టిఫికెట్ల జారీపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. చాలా సరళంగా ఉన్న దరఖాస్తు ఫారాన్ని స్మార్ట్ ఫోన్ల నుంచి కూడా సమర్పించవచ్చని సూచించారు.

బీసీ హాస్టళ్ల అడ్మిషన్లకు వెబ్‌సైట్ ప్రారంభం

రాష్ట్రంలోని 703 బీసీ ప్రీమెట్రిక్, పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలోని సీట్లను ఇకనుంచి ఆన్‌లైన్ ద్వారానే భర్తీ చేస్తామని మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వెబ్‌సైట్ https:// bchostels. cgg.gov.inµను సచివాలయంలో సోమవారం ఆయన అధికారికంగా ప్రారంభించారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే ఈ విధానాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఫారాన్ని సమర్పించగానే ఎవరి ప్రమేయం లేకుండా వివరాలు వెరిఫికేషన్ చేసుకుని ప్రవేశానికి అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. ఈ సమీక్షలో టాడీ టాపర్స్ కార్పొరేషన్ ఛైర్మెన్ పల్లె రవి, బీసీ సంక్షేమ శాఖ డీడీ సంధ్య ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఇన్‌కం కోసం ఇక్కట్లు

(మొదటిపేజీ తరువాయి)

బాక్సుల్లో దరఖాస్తు వేయాల్సిందిగా తహసీల్దారు సూచించారు.

వారాలు గడుస్తున్నా అందని ధ్రువీకరణ పత్రాలు

రోజులు, వారాలు గడుస్తున్నా తహసీల్దార్ కార్యాలయంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం లేదని బాధితులు వాపోతున్నారు. నెలరోజుల కిందట మీ సేవల్లో దరఖాస్తు చేసుకున్న వారు సైతం సోమవారం నాటి స్పెషల్ డ్రైవ్‌కు రావడం గమనార్హం. మీ సేవలో దరఖాస్తుకు రూ.45 తీసుకుంటే, ఇక్కడ రూ.50 తీసుకున్నా సకాలంలో పని కావడం లేదని వాపోతున్నారు. ఇదేమంటే సిబ్బంది కొరతను సాకుగా చూపుతున్నట్టు చెబుతున్నారు. గట్టిగా ప్రశ్నిస్తే మరి కొన్ని రోజులు కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నట్టు ఆవేదన వ్యక్తం చేశారు.

అర్హులు ఎవరు?

బి.సి. కార్పొరేషన్ నుంచి రుణాలు పొందేందుకు ప్రస్తుతం కొన్ని కులాల వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు. నాయీ బ్రాహ్మణులు, రజకులు, సగర ఉప్పర, కుమ్మరి/శాలివాహన, అసుల, కంసాలి, కమ్మరి, కంచరి, వడ్రంగి, క్రిష్ణ బలి పూసల, మేదర, ఆరెకటిక, మేర, యం.బి.సి, అత్యంత వెనుకబడిన కులాలకు చెందిన సంచార జాతులు ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 16 ప్రకారం అర్హులుగా నిర్దేశించారు. బాలసంతు, బహురూపి, బుడబుక్కల, దాసరి, దొమ్మర, గంగిరెడ్లవారు, జంగం, జోగి, కాటిపాపల, మొండివారు, మొండిబండ, బండ, వంశరాజ్, పిచ్చిగుంట్ల, పాముల, పార్థి (నిర్శికారి), పంబల, పెద్దమ్మవాండ్లు, దేవర వాండ్లు, ఎల్లమ్మ వాండ్లు, ముత్యాలమ్మవాండ్లు, దమ్మలి, వీరముష్టి (నేట్టికోతల), వీరభద్రియ, గుడాల, కన్జర-భట్ట, కేప్మర / రెడ్డి, మున్డేపట్ట, నొక్కార్, పరికి ముగ్గుల, యాట, చోపెమారి, కైకడి, జోసినందివాలాస్, మందుల, కునపులి, పత్ర, పల-ఎకరి, ఎకిల, వ్యాకుల, ఎకిరి, నాయని వారు, పాలేగారు, తొలగరి, కావలి, రాజన్నల, బుక్క అయ్యవారు, గోత్రాల, కసికపడి / పసికపుడి, సిద్దుల, సిక్లిగర్ సైక్లగర్ ఇలా 35 కులాలను అర్హులుగా సూచించారు. తమని దీనిలో చేర్చకపోవడంపై పద్మశాలీలు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

బాక్స్‌లో వేయండి..మేము చూసుకుంటాం..

గంటల తరబడి వేచిచూశాక ఖమ్మం అర్బన్ తహసీల్దారు శైలజ బయటకు వచ్చి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బాక్సుల్లో దరఖాస్తులు వేసి వెళ్లాలని సూచించారు. దాంతో జనం దరఖాస్తులు పెట్టెల్లో వేసి వెళ్లారు. రెండు మూడు వారాల కిందట డబ్బాలో వేసి వెళ్లిన దరఖాస్తులకే ఇప్పటివరకు అతీగతి లేదని, ఇక వీటి పరిస్థితి ఏంటో అంటూ బాధితులు వెనుదిరిగారు. దరఖాస్తుల తర్వాత నగరపాలక సంస్థలో అన్ని ఆధారాలను పొందుపరిచి జిరాక్స్ సెట్ ఇవ్వాల్సి ఉంటుంది. ఆ తర్వాత క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి అర్హులని ఎంపిక చేస్తారు.

భూదాన్ భూములపై మౌనమేల?

(మొదటిపేజీ తరువాయి)

రాస్తాను.... అని రేవంత్ స్పష్టం చేశారు.

కేసీఆర్ పెద్ద దళారీ

ధరణి విషయంలో కేసీఆర్ పెద్ద దళారీ అని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఆయన కుటుంబానికి చర్లపల్లి జైలులో డబుల్ బెడ్రూం ఇల్లు కట్టించే బాధ్యత కాంగ్రెస్ పార్టీదేనని ఎద్దేవా చేశారు. ధరణిలో ఉన్నంత దోపిడీ మరెక్కడా లేదనీ, 30 శాతం కమిషన్ తీసుకునే ప్రభుత్వం దిగిపోవాలని డిమాండ్ చేశారు. "నక్సలైట్ల నుంచి కాంగ్రెస్ వరకు పేదలకు భూపంపిణీ జరిగింది. యాజమాన్యపు హక్కులు లేని వారికి లక్షల ఎకరాలను మా పార్టీ పంచింది. కాంగ్రెస్ పాలనలో పారదర్శకంగా భూ రికార్డులు ఉండేవి. 2004 లో కాగితపు రికార్డులను భూభారతి పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం డిజిటలైజ్ చేసింది. నల్గొండ, రంగారెడ్డి జిల్లల్లో 23వేల ఎకరాల భూదాన్ భూములున్నాయి. ధరణి రాకముందు నిషేధిత భూములుగా ఉన్న వాటిపై ధరణి వచ్చాక నిషేధం ఎత్తేశారు. ధరణి వచ్చాక ఆయా భూములు కేటీఆర్ అనుచరుల పేర్లతో వచ్చాయి. రూ.వెయ్యి కోట్ల విలువైన భూములను కేటీఆర్ అనుచరులు కొట్టేస్తున్నారు. రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి కలెక్టరేట్ల ముందు వేలాది మంది రైతులు పడిగాపులు కాస్తున్నారు. ధరణి సమస్యలు క్లియర్ కావాలంటే 30 శాతం కమిషన్ ఇవ్వాల్సిందే అని బలవంతం చేస్తున్నారు... "అని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ధరణి రద్దు చేసి ప్రజలకు ఇబ్బందులు లేని పాలసీ తెస్తామంటే కేసీఆర్‌కి ఏడుపెందుకు? అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. రాహుల్‌గాంధీ చేసిన భారత్ జోడో యాత్రలో కూడా ధరణి బాధితులు తమ ఆవేదన వ్యక్తం చేశారని గుర్తుచేశారు. కాంగ్రెస్ వస్తే ధరణి రద్దు చేస్తామని, అది రద్దయితే రైతు బంధు, రైతు బీమా రావంటూ కేసీఆర్ ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర భూముల వివరాలు తెలంగాణ ప్రభుత్వం దగ్గర లేవని తెలిపారు. ధరణి రద్దు చేస్తే తమ కుట్ర బయట పడుతుందనే కారణంతో ప్రభుత్వం భయపడుతున్నదని చెప్పారు. ధరణి ఫిర్యాదు దారుల నుంచి వసూలు చేసే రూ. వెయ్యి రుసుము డబ్బు ఎక్కడికి పోతోంది? అని ప్రశ్నించారు. ప్రజలు చెల్లించిన డబ్బులు వారికి వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కలెక్టర్లనూ ఊచలు లెక్కపెట్టిస్తాం

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ కలెక్టర్లను ఊచలు లెక్కపెట్టిస్తామనీ, ఆయా జిల్లాల్లో భూములపై విచారణ జరిపిస్తామని రేవంత్ రెడ్డి హెచ్చరించారు. భూ కుంభకోణంలో బీఆర్ఎస్ నేతలు, పార్టీ ఫిరాయించిన నాయకులున్నారని ఆరోపించారు. రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ నేతలతో కలిసి కేటీఆర్ తిమ్మాపూర్ భూములను దోచుకుంటున్నారని విమర్శించారు. అక్కడి భూదాన్ భూములపై ప్రభుత్వం విచారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధరణిని రద్దుచేసి ప్రజలకు ఉపయోగపడే విధంగా నూతన విధానం తెస్తామని మరోసారి ప్రకటించారు.

ధరణితో ఎన్నో లాభాలు

(మొదటిపేజీ తరువాయి)

తీసేస్తామన్న వారికి ప్రజలే బుద్ధి చెప్పాలని కోరారు. ఈ అభివృద్ధి ఇలాగే కొనసాగించాలన్నారు.

లావుగా, పొడుగ్గా ఉన్న నేతలు సాగునీటి ప్రాజెక్టులను కడతామని చెప్పి.. వాటిని గీకి మధ్యలోనే వదిలేశారని, ప్రజలు తాగు, సాగునీటికి ఇబ్బందులు పడ్డారని చెప్పారు. తెలంగాణ వచ్చాకే ప్రాజెక్టులను పూర్తి చేసుకున్నామన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 15 లక్షల నుంచి 20 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించుకోగలుతున్నా మన్నారు. ఉద్యమ సమయంలో తాను జోగులాంబ గద్వాల జిల్లాలో పర్యటించానని.. ఇక్కడి పరిస్థితులను చూసి కన్నీళ్లు పెట్టుకున్నానని గుర్తు చేసుకున్నారు. రాష్ట్రం వచ్చాక గతంలో ఒకసారి గద్వాల పర్యటనకు వచ్చినప్పుడు పాలమూరు ప్రాంతాన్ని చూసి సంతోషపడ్డానని, ఎక్కడ చూసినా ధాన్యపు రాసులు కనిపించాయని చెప్పారు. ఇదే గద్వాలలో ఉన్న పెద్దపెద్ద నాయకులు అడ్డం పొడుగు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఈ ప్రాంతాన్ని పట్టించుకోలేదని, మహబూబ్‌నగర్‌లో 14 రోజులకో సారి మంచినీళ్ల వచ్చేవని చెప్పారు. కానీ తెలంగాణ రాష్ట్రంలో మిషన్ భగీరథ ద్వారా నల్లాల పథకం తెచ్చుకున్నామని చెప్పారు. ఇలాంటి పథకం దేశంలో ఎక్కడా లేదన్నారు. తెలంగాణ సాధనలో మంత్రులు శ్రీనివాస్ గౌడ్, నిరంజన్ రెడ్డి కృషి అభినందనీయని కొనియాడారు.

తేడాను గమనించండి

'కరెంటు రాదు, తెలంగాణ చీకటిమయం అవుతుందని కొందరు గతంలో మాట్లాడారు. ఇక్కడకు ఆంధ్ర కేవలం 25 కిలోమీటర్ల దూరమే. ఇప్పుడు రాష్ట్రంలో 24 గంటల విద్యుత్ ఉంటే.. పక్కన ఉన్న కర్నాటక, ఆంధ్ర రాష్ట్రాల్లో కరెంటుకు కటకట ఉంది' అని కేసీఆర్ అన్నారు. తేడాను గమనించాలని సూచించారు. గట్టు ఎత్తిపోతల పథకంతోపాటు జిల్లాలో మిగిలిపోయిన పనులు అన్నింటినీ పూర్తి చేసుకుని సాగునీటిని అందిస్తామన్నారు. ఆర్డీఎస్‌కు తుమ్మిళ ద్వారా మళ్లీ పునరుజ్జీవం కల్పించామని, గట్టు ఎత్తిపోతల పూర్తయితే గద్వాల వజ్రపుతునకవుతుందని చెప్పారు. ఒకప్పుడు పంజాబ్ రాష్ట్రం ధాన్యం పండించడంలో దేశంలో ప్రథమ స్థానంలో ఉండేదని, ఇప్పుడు తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలోకి వచ్చిందని తెలిపారు. గద్వాల, నారాయణపేట జిల్లాలో మెడికల్ కళాశాలలు వస్తాయని ఎవరూ ఊహించలేదని, ఇది ఈ ప్రాంత ప్రజలకు వరం లాంటిదన్నారు.

ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర హోం శాఖ మంత్రి మహమూద్ అలీ, సీఎస్ శాంతికుమారి, రాష్ట్ర డీజీపీ అంజనీ కుమార్, రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి, గద్వాల జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, అలంపూర్ డాక్టర్ అబ్రహం, డాక్టర్ సి.లక్ష్మారెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, చిట్టెం రాంమోహన్ రెడ్డి, ఎమ్మెల్సీలు కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, కసిరెడ్డి నారాయణ రెడ్డి, కలెక్టర్ వల్లూరు క్రాంతి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నిధులు కేటాయింపు

'గద్వాలలో 255 గ్రామపంచాయతీలు ఉన్నాయి.. 12 మండలాలు ఉన్నాయి.. నాలుగు మున్సిపాలిటీలున్నాయి.. ప్రతి గ్రామపంచాయతీకీ రూ.10 లక్షల గ్రాంట్ ఇస్తున్నాం.. ప్రతి మండలానికి 15 లక్షల గ్రాంట్ ఇస్తున్నాం' అని సీఎం చెప్పారు. గద్వాల మున్సిపాలిటీకి రూ.50 కోట్లు మంజూరు చేస్తామని, మిగతా మూడు మున్సిపాలిటీలకు రూ.25 కోట్ల చొప్పున అభివృద్ధికి కేటాయిస్తామని ప్రకటించారు.

ఎడ్‌సెట్‌లో అమ్మాయిలదే హవా

ఎడ్‌సెట్ ఫలితాల వివరాలు

	అబ్బాయిలు	అమ్మాయిలు	మొత్తం
దరఖాస్తు	6,009	25,716	31,725
పరీక్షకు హాజరు	5,095	22,400	27,495
ఉత్తీర్ణులు	5,059	21,935	26,994
శాతం	99.29	97.92	98.18

ఎడ్‌సెట్ టాపర్ల వివరాలు

ర్యాంకు	పేరు	జిల్లా
1	గొల్ల వినీష	వికారాబాద్
2	నిషా కుమారి	హైదరాబాద్
3	ఎం సుశీ	హైదరాబాద్
4	వాసాల చంద్రశేఖర్	జగిత్యాల
5	ఆకోజు తరుణ్ చంద్	పెద్దపల్లి
6	తొంపుల ప్రశాంత్	ఆదిలాబాద్
7	మహమ్మద్ షరీఫ్ సీ	రంగారెడ్డి
8	కుసుమ వినయ్‌కుమార్	కోనసీమ (ఏపీ)
9	మోటపోతుల అరుణ్‌కుమార్	ములుగు
10	ఎ లక్ష్మిగాయత్రి	హైదరాబాద్

(మొదటిపేజీ తరువాయి)

సాధించారు. పెద్దపల్లి జిల్లా శ్రీరాంపూర్‌కు చెందిన ఆకోజు తరుణ్ చంద్ ఐదో స్థానం పొందారు.

బీఎడ్‌లో మిగులుతున్న సీట్లు

ఏటా బీఎడ్ కోర్సులో సీట్లు మిగులుతున్నాయి. గత విద్యాసంవత్సరంలో 211 బీఎడ్ కాలేజీల్లో కన్వీనర్, యాజమాన్య కోటా కలిపి మొత్తం 18,350 సీట్లున్నాయని ఉన్నత విద్యామండలి చైర్మెన్ లింబాద్రి వివరించారు. వాటిలో 13,756 సీట్లు భర్తీ అయ్యాయని చెప్పారు. 4,594 సీట్లు మిగిలిపోయాయని అన్నారు. కాలేజీలకు అనుబంధ గుర్తింపు వచ్చిన తర్వాత ఎడ్‌సెట్ ప్రవేశాల కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంజీయూ వీసీ సిహెచ్ గోపాల్‌రెడ్డి, ఎడ్‌సెట్ కన్వీనర్ ఎ రామకృష్ణ, కోకన్వీనర్ పి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అడిగినవన్నీ మంజూరు చేసిన సీఎం

కేసీఆర్ ఆశయం నెరవేరేలా కృషి చేయాలి :మంత్రి హరీశ్ రావు

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

వైద్యారోగ్యశాఖకు అడిగినవన్నీ సీఎం కేసీఆర్ మంజూరు చేశారని ఆ శాఖ మంత్రి హరీశ్ రావు తెలిపారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి ఆశయం నెరవేరేందుకు కృషి చేయాలని వారికి సూచించారు. బోధనాస్పత్రుల పనితీరుపై సోమవారం ఆయన నెలవారీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పెద్ద మొత్తంలో బడ్జెట్ కేటాయింపులతో పాటు కొత్త మెడికల్ కాలేజీలు, వైద్యుల నియామకం, వైద్యపరికరాలను ఇచ్చారని గుర్తుచేశారు. ఆ రంగంలో తెలంగాణ దేశంలోనే మూడో స్థానంలో నిలిచిందని తెలిపారు. ముున్ముందు నెంబర్‌వన్‌గా నిలవాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో అతి తక్కువ సమయంలో 21 మెడికల్ కాలేజీల ఏర్పాటుతో రికార్డు సృష్టించామని గుర్తుచేశారు. 1.061 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం తర్వాత బోధనాస్పత్రులు బలోపేతమయ్యాయని తెలిపారు. 2014లో మాతృ మరణాల రేటు 92గా ఉంటే దాన్ని 43కు తగ్గించగలిగామని చెప్పారు. మెడికల్ కాలేజీల్లో ర్యాగింగ్‌ను ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని స్పష్టం చేశారు. శిక్షణా భృతి, వేతనాలు వేతనాలు ఆలస్యం కాకుండా సూపరింటెండెంట్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

15 నుంచి సివిల్స్ ఆప్షనల్ ఎంపికపై ఉచిత అవగాహన సదస్సు

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించే సివిల్స్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఆప్షనల్ ఎంపికపై ఈనెల 15 నుంచి 18వ తేదీ వరకు హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో ఉచిత అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు అమిగోస్ 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమి ప్రకటించింది. ఈ మేరకు అకాడమి నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వివిధ సబ్జెక్టులపై సీనియర్ అధ్యాపకులతో ఈ అవగాహన తరగతులుంటాయని తెలిపారు. విద్యావేత్త ఆకెళ్ల రాఘవేంద్ర పర్యవేక్షణలో నిర్వహించే ఈ సదస్సులో సిలబస, నోట్స్ మేకింగ్, మెంటర్‌సిప్ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 040- 35052121, 9000230735 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

రేపటి నుంచి టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

- 71,681 మంది విద్యార్థుల హాజరు
- 259 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 22వ తేదీ వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఈ పరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. అబ్బాయిలు 41,526 మంది, అమ్మాయిలు 30,155 మంది కలిపి 71,681 మంది విద్యార్థులు హాజరవుతారని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 259 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడం కోసం 259 మంది చీఫ్ సూపరింటెండెంట్లను, 259 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులను, 2,800 మంది ఇన్విజిలేటర్లను నియమించామని తెలిపారు. మాల్‌ప్రాక్టీస్ జరగకుండా ఉండేందుకు 50 మంది ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను నియమించామని పేర్కొన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలోని చీఫ్ సూపరింటెండెంట్ గదిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని వివరించారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకు రావొద్దని విద్యార్థులను కోరారు. ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుల కార్యాలయంలో కంట్రోల్ రూం (040-23230942)ను ఏర్పాటు చేశామని తెలిపారు. హాల్‌టికెట్లను ఇప్పటికే పాఠశాలలకు పంపించామని పేర్కొన్నారు. సంబంధిత పాఠశాలల హెడ్మాస్టర్ల ద్వారా వాటిని తీసుకోవాలని సూచించారు. www. bse.telangana.gov.in వెబ్‌సైట్ లోనూ హాల్‌టికెట్లను పొందుపరిచామని, విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. ఈ పరీక్షల నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లనూ పూర్తి చేశామని తెలిపారు.

పుట్టకముందే విలువలు బోధిస్తారట !

న్యూఢిల్లీ : పిల్లలు పుట్టకముందే వారికి సాంస్కృతిక, దేశభక్తి విలువలు ప్రబోధిస్తానని ఆర్ఎస్ఎస్ చెబుతోంది. అది ఎలా అంటారా? దేశ రాజధాని ఢిల్లీలో ఆర్ఎస్ఎస్ అనుబంధ రాష్ట్ర సేవిక సమితి ఆదివారం గర్భిణుల కోసం 'గర్భ సంస్కార్' పేరిట మార్గదర్శక కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో తల్లులకు, వారి ద్వారా గర్భస్థ శిశువులకు విలువలు బోధిస్తారట!. ఈ కార్యక్రమానికి తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ హాజరయ్యారు. మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండే శిశువులు జన్మించాలంటే గర్భిణులు సుందరకాండను పారాయణం చేయాలని, భగవద్గీత, రామాయణం, మహాభారతం చదవాలని ఆమె ఉద్బోధించారు. గర్భ సంస్కార్ కార్యక్రమంలో వైద్యులు కూడా భాగస్వాములవుతారట. వారు గర్భిణులకు అటు సైన్స్ పరంగా, ఇటు సంప్రదాయ పరంగా ప్రిస్క్రిప్షన్లు ఇస్తారు. ఇలాంటి వైఖరి సానుకూల ఫలితాలు ఇస్తుందని తమిళిసై చెప్పారు.

నేడు ఈసెట్ ఫలితాలు

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రంలో బీటెక్, బీఈ, బీ ఫార్మసీ, బీఎస్సీ మ్యాథమెటిక్స్ కోర్సుల్లో ద్వితీయ సంవత్సరంలో లాటరల్ ఎంట్రీ ద్వారా 2023-24 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన ఈసెట్ ఫలితాలు మంగళవారం విడుదల కానున్నాయి. ఈ ఫలితాలను హైదరాబాద్‌లో ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటలకు విడుదల చేస్తారని ఈసెట్ కన్వీనర్ శ్రీరాం వెంకటేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్ వి వెంకటరమణ, కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు, ఓయూ వీసీ దండెబోయిన రవీందర్ పాల్గొంటారని పేర్కొన్నారు. గతనెల 20న నిర్వహించిన ఈసెట్‌కు 22,454 మంది అభ్యర్థులు హాజరయ్యారు.

అధికారుల నిర్లక్ష్యం వల్లే సెలవులు పొడిగించలేదు : టీఎస్‌పీటీఏ

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రంలో విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే వేసవి సెలవులను పొడిగించలేదని తెలంగాణ రాష్ట్ర ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం (టీఎస్‌పీటీఏ) అధ్యక్షులు సయ్యద్ షౌకత్‌అలీ, ప్రధాన కార్యదర్శి పిట్ల రాజయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తీవ్రమైన ఎండల తీవ్రత వల్ల పాఠశాలలకు పది శాతం మంది పిల్లలు కూడా హాజరు కాలేదని పేర్కొన్నారు. ఈ వేడిలో ఎందుకు బడులను తెరిచారంటూ ఉపాధ్యాయులను ప్రశ్నిస్తున్నారని తెలిపారు. విద్యాశాఖ కార్యదర్శి, సంచాలకులు ఏదైనా పాఠశాలలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉండి వారి అభిప్రాయాలను చెప్తే బాగుంటుందని సూచించారు. విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా వెంటనే పాఠశాలలకు సెలవులను పొడిగించాలని డిమాండ్ చేశారు.

బిజినెస్

భారత్‌లో పన్ను చెల్లింపు శిక్షలాంటిదే

- ప్రయోజనం లేదు: భారత్ పే మాజీ బాస్ అష్నీర్ గ్రోవర్



న్యూఢిల్లీ:భారత్‌లో పన్ను చెల్లించడం శిక్షలాంటి దని భారత్‌పే మాజీ సహ వ్యవస్థాపకుడు అష్నీర్ గ్రోవర్ విమర్శించారు. దేశంలో అమలవుతోన్న పన్ను విధానంలో అనేక లోపాలు ఉన్నాయన్నారు. విదేశాల్లో ఉపయోగిస్తున్న క్రెడిట్ కార్డులపై గత నెలలో కేంద్ర ప్రభుత్వం విధించిన 20 శాతం పన్ను విధానాన్ని ఆయన తప్పుబట్టారు.

మరోవైపు రాజకీయ పార్టీలకు ఇచ్చే డొనేషన్లపై మాత్రం ఎలాంటి పన్ను లేదన్నారు. పన్ను చెల్లింపుదారులు తమ ఆదాయా ల్లో ప్రభుత్వానికి 30-40 శాతం పన్ను చెల్లిస్తున్నారని అన్నారు. పన్ను చెల్లింపుదారులు ఇతరులకు ఉపయోగపడుతున్నారు తప్పా ప్రతిగా వారి కంటూ ఎలాంటి ప్రయోజనడం ఉండడం లేదన్నారు. రూ.10 సంపాదిస్తే అందులో రూ.4 ప్రభుత్వానికి పన్నుగా చెల్లిస్తున్నారు. అంటే.. ఏడాదికి 3-5 నెలలు పాటు ప్రభుత్వం కోసం పనిచేస్తున్నారు. అయినా ఎంతకాలం ఇలా ప్రభుత్వానికి ఊడిగం చేయాలని ప్రశ్నించారు. వ్యాపారు లకు పన్ను నుంచి ఎలా తప్పించుకోవాలో బాగా తెలుసని అన్నారు. కానీ ఉద్యోగుల పరిస్థితి అలా కాదు. వారి ఆదాయంలో ముందే టిడిఎస్ కోత పడుతుంది. అదే విధంగా వారు కొనే వస్తువుల పైనా 18 శాతం జిఎస్‌టి పడుతోంద న్నారు. ఈ నేపథ్యంలో దేశంలో పన్ను చెల్లించడమంటే ఓ శిక్షనేనని విమ ర్శలు గుప్పించారు. ప్రతి ఒక్కరూ 10-15 శాతం పన్ను చెల్లించేలా చూడా లన్నారు. దాంతో ప్రభుత్వానికి ఇంకా ఎక్కువ ఆదాయం వస్తుందన్నారు.


ఆరో బ్రాండ్ నుంచి ఎస్ఎస్23 కలెక్షన్లు

హైదరాబాద్ : ఐకానిక్ ప్రీమియం మెన్స్ వేర్ బ్రాండ్ అయిన ఆరో తాజాగా తన నూతన కలెక్షన్‌ను విడుదల చేసినట్టు తెలిపింది. ఈ సమ్మర్ స్ప్రింగ్ కలెక్షన్‌లో అన్ని సందర్భాలకు సరిపోయేలా పురుషుల దుస్తులు ఉంటాయని పేర్కొంది. ఆటోప్రెస్ షర్టులు, ఆటోఫ్లెక్స్ ప్యాంట్లు, ఐకానిక్ వైట్ షర్టులతో సహా ఫార్మల్ వేర్లు ఈ కొత్త కలెక్షన్‌లో ఉన్నాయని తెలిపింది. ఆరో కొత్త ఎస్ఎస్ 23 కలెక్షన్లు లేటెస్ట్ ట్రెండ్లకు అనుగుణంగా ఉంటాయని ఆరో సిఇఒ సుమన్ సాహా పేర్కొన్నారు.

కొడిగడుతున్న కార్పొరేషన్లు..

నిధుల్లేక వెలవెల

- సబ్సిడీ లోన్లకోసం యువత నిరీక్షణ
- పెండింగ్‌లో లక్షల దరఖాస్తులు
- స్వయం ఉపాధికి రుణాలు ఉత్తమాటేనా?
- కేటాయింపుల తగ్గింపుపై పలు అనుమానాలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో యువత స్వయం ఉపాధికి ఆసరాగా ఉండాల్సిన బలహీన వర్గాల, వెనుకబడిన తరగతుల కార్పొరేషన్లు కొడిగట్టుకు పోతున్నాయి. నిధుల్లేక వెలవెల బోతున్నాయి. సంక్షేమ కార్పొరేషన్లకు దరఖాస్తు చేసుకుని ఏండ్లు గడుస్తున్నా.. మోక్షం లభించటం లేదు. రాయితీ రుణాలు మంజూరు కోసం లక్షల మంది దరఖాస్తుదారులు నిరీక్షిస్తున్నారు. స్వయం ఉపాధి పొందాలనుకున్న నిరుద్యోగుల ఆశలు నెరవేరకపోవడంతో వారు ఆవేదనకు గురవుతున్నారు.

ఎన్నికల ఏడాది కావడంతో ఈ సంవత్సరమైనా సబ్సిడీ రుణాలు అందక పోతాయా అని ఎదురు చూసే యువత ఆశలు నెరవేరుతాయా? అంటే..కష్టమేనని కార్పొరేషన్లలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు పెదవి విరుస్తున్నారు. గత నాలుగేండ్ల నుంచి యువతకు లోన్లు రావడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కార్పొరేషన్ల పరిధిలో సుమారు 9 లక్షల వివిధ కేటగిరీల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ముందు ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల నుంచి హడావుడిగా దరఖాస్తులు స్వీకరించిన సర్కారు.. తర్వాత వాటిని పక్కనపడేసింది.

నిధులు లేమితో వెలవెల..

నిరుద్యోగ యువతను స్వయం ఉపాధి వైపు మళ్లించి ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఎంబీసీ సహకార ఆర్థిక సంస్థలు (కోఆపరేటీవ్ కార్పొరేషన్లు) నిధులు లేక బలహీనపడుతున్నాయి. ఏటేటా వీటికి బడ్జెట్ కేటాయింపులను తగ్గిస్తున్న ప్రభుత్వం.. కనీసం కేటాయించిన మేరకు కూడా నిధులు విడుదల చేయడం లేదు. దీంతో ఆయా కార్పొరేషన్ల లక్ష్యం గాడి తప్పుతోంది. నిధుల లేమితో రుణాల కార్యాచరణ సిద్ధం చేయటం లేదని అధికారులు చేతులెత్తేస్తున్నారు.దీంతో కుట్టు మిషన్లు, జిరాక్స్ మిషన్లు, కిరాణ దుకాణం, ఆటో రిక్షా వంటి వాటితో స్వయం ఉపాధి పొందాలనుకున్న నిరుద్యోగుల ఆశలు నెరవేరడం లేదు.

చివరకు తోపుడు బండి వ్యాపారానికి రూ.50వేల కోసం దరఖాస్తు చేసుకున్న వారు వేలల్లో ఉన్నారంటే..అతిశయోక్తికాదు.బీసీ, ఎంబీసీ కార్పొరేషన్ల పరిధిలో నాలుగేండ్ల కింద చేసుకున్న దరఖాస్తులు మనుగడలో ఉన్నాయో లేవో తెలియని పరిస్థితి ఉందని బీసీ, ఎంబీసీ సంఘాల నేతలు వాపోతున్నారు.

సంక్షేమ శాఖల వారిగా ఇదీ..పరిస్థితి..

దళిత బంధు పథకం, బీసీ కుల వృత్తులకు ఆర్థిక చేయూత అందిస్తున్నామన్న సాకుతో ఆయా తరగతులకు చెందిన కార్పొరేషన్లను నిర్వీర్యం చేస్తే ఎలా? అన్న ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. దళిత బంధు పథకం వచ్చాక..ఎస్సీ కార్పొరేషన్ రుణాల మంజూరులో కదిలిక లేదు. వీటి కోసం ఏటా రెండు లక్షల మందికి పైగా దరఖాస్తు చేసుకుంటున్నారని అధికారులు అనధికారికంగా చెబుతున్నారు. 2017-18లో ఎంపికైన దరఖాస్తు దారులకు మంజూరైన రుణాలు రూ.80కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలుస్తున్నది. 2018-20 వరకు తిరిగి కార్యాచరణ అమలు చేయలేదు. 2020-21లో1.73లక్షల మంది దరఖాస్తు చేసుకుంటే..18,285 మందికి మాత్రమే రుణాలివ్వాలని ఎస్సీ కార్పొరేషన్ నిర్ణయించింది. వాటికి కూడా లబ్దిదారుల ఎంపిక నిలిచిపోవటం గమనార్హం. 2018 ఎన్నికల తర్వాత కార్పొరేషన్ లోన్లు మొత్తానికే రావడం లేదు.

ఎస్టీలదీ అదే పరిస్థితి..

గిరిజన సహకార సంస్థ(ట్రైకార్) పరిధిలో 2017-18 ఏడాదికి సంబంధించిన పెండింగ్ రుణాలు ఇటీవలనే కొన్ని విడుదల చేశారు. ఆ తర్వాత వరసగా రెండేండ్లకు ప్రణాళిక రూపొందించలేదు. 2020-21,2021-22లో స్వయం ఉపాధికోసం రెండు లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 27వేల మందికి మాత్రమే ఉపాధి పథకాలు మంజూరయ్యాయి.

వీటికి రూ.280కోట్లు అవసరమని గిరిజన కార్పొరేషన్ అంచనా వేసినా..నిధులు విడుదల కాలేదు. కాగా 2018-2019 ఆర్థిక సంవత్సరం అప్లికేషన్లు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఆ తర్వాత ఇప్పటి దాకా ఒక్కరికీ కూడా లోను ఇవ్వలేదు.

దరఖాస్తులన్నీ పెండింగ్‌లోనే..

బీసీ, ఎంబీసీలకు చెందిన లక్షల దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి. బీసీల స్వయం ఉపాధికి సంబంధించి బీసీ కార్పొరేషన్‌తో పాటు 11 ఫెడరేషన్లు ఉన్నాయి. ఇవి సహకార సమాఖ్యల పరిధిలో ఉన్నాయి. 2017-18కి సంబంధించి 5.70లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. తెలంగాణ వచ్చినప్పటి నుంచి బీసీలకు రెండు సార్లు మాత్రమే లోన్లు వచ్చాయి. 2015లో ఒకసారి, 2018లో ఎన్నికలకు ముందు మరోసారి ఇచ్చారు. 2018లో దరఖాస్తు చేసుకున్నవారిలో లక్ష లోపు లోన్లు అవసరం ఉన్న 50 వేల మంది వరకు రుణాలు ఇచ్చారు. ఆ తర్వాత ఎలక్షన్లు అయిపోగానే దరఖాస్తులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉండిపోయాయి. ప్రస్తుతం 5.20 లక్షల దరఖాస్తులన్నీ పెండింగ్‌లోనే మూలుగుతున్నాయి. మైనార్టీ కార్పొరేషన్ పరిధిలో 2018-19లో 23,829 దరఖాస్తులు తీసుకున్నారు. వాటిని పరిష్కారం చేయలేదు. కొత్త దరఖాస్తులు స్వీకరించటం లేదు.

రామనర్సయ్యకు అండగా ఉంటాం...

- మంత్రి హరీశ్ రావు పరామర్శ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జానపద గాయకుడు గిద్దె రామ నరసయ్యను సోమవారం మంత్రి హరీష్ రావు పరామర్శించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఉద్యమ సమయంలో రామనర్సయ్య పాట ద్వారా చేసిన సేవలు మరిచిపోలేమని తెలిపారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆయన త్వరగా పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

పారదర్శకంగా ఈవీఎం యంత్రాల ఎఫ్ఎల్‌సీ నిర్వహణ

- పెద్దపల్లి కలెక్టర్ సంగీత సత్యనారాయణ



నవతెలంగాణ-పెద్దపల్లి

పెద్దపల్లి జిల్లాలో పారదర్శకంగా ఈవీఎం ఎఫ్ఎల్సి(ఫస్ట్ లెవల్ చెకింగ్)ను ఈసీఐఎల్ ఇంజినీర్ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ డాక్టర్ ఎస్. సంగీత సత్యనారాయణ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉంచిన ఈవీఎం మిషన్ల ఫస్ట్ లెవెల్ చెకింగ్ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. భారత ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈవీఎం యంత్రాల ఫస్ట్ లెవెల్ చెకింగ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ ప్రక్రియ 15 మంది ఈసీఐఎల్ ఇంజినీర్ల ఆధ్వర్యంలో జరుగుతుందని, జిల్లాకు వచ్చిన ప్రతి ఈవీఎం యంత్రంలోని బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్ల పని తీరు పరిశీలిస్తారని చెప్పారు. ఈవీఎం ఎఫ్.ఎల్.సిపై 3 రోజుల కిందట అన్ని రాజకీయ పక్షాలకు సమాచారం అందించామని, సీజ్ చేసిన ఈవీఎం గోదాంను వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో తెరిచామని తెలిపారు. 1509 బ్యాలెట్ యూనిట్‌లను, 1179 కంట్రోల్ యూనిట్‌లను, 1270 వివి ప్యాట్‌లను ఫస్ట్ లెవెల్ చెకింగ్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి వెంకట మాధవరావు, ఈడిఎం కవిత, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ప్రవీన్, సంబంధిత అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కోర్టుల్లోని అర్హులైన కాంట్రాక్ట్ ఉద్యోగుల్ని రెగ్యులరైజ్ చేయండి : హైకోర్టు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కోర్టుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల్లో అర్హత ఉన్న వాళ్ల సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని హైకోర్టు సోమవారం తీర్పు చెప్పింది. పదేండ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీస్‌లను క్రమబద్దీకరణకు చర్యలు తీసుకోవాలని హైకోర్టు రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. అర్హతలున్న వాళ్లను ఖాళీగా ఉన్న గుమాస్తా, టైపిస్టు, సబార్డినేట్ పోస్టుల్లో నియమించాలంది. ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల్లో పనిచేసే కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగించడాన్ని సవాల్ చేస్తూ పెద్ద సంఖ్యలో ఉద్యోగులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. న్యాయమూర్తులు జస్టిస్ నవీన్‌రావు, జస్టిస్ బి.నగేష్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం పైవిధంగా తీర్పు చెప్పిందని పిటిషనర్ లాయర్ చిక్కుడు ప్రభాకర్ తెలిపారు.

సింగరేణిని కాపాడింది చంద్రబాబే

- ఆ ఎన్నికల్లో గెలుపునకు సమిష్టి కృషి :టీడీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు



నవతెలంగాణ- హైదరాబాద్

సింగరేణి ఎన్నికల్లో టీఎన్టీయూసీ అనుబంధ సంఘమైన ఎస్.సి.ఎల్.యూ గెలుపు కోసం కషి చేయాలని ఆ సంఘం నాయకులకు తెలుగుదేశం పార్టీ జాతీయ క్రమశిక్షణ కమిటీ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం రాష్ట్ర పార్టీ కార్యాలయం ఎన్టీఆర్ ట్రస్టు భవన్‌లో టీఎన్టీయూసీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ అప్పుల్లో కూరుకుపోయిన సింగరేణి, టీడీపీ హయాంలో లాభాల బాట పట్టిందన్నారు. సింగరేణి బొగ్గు గని కార్మికులను కాపాడుకోవడానికి నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విశేష కషి చేశారని గుర్తు చేశారు. కేంద్రం ప్రభుత్వం సింగరేణిని ప్రయివేటు పరం చేసేందుకు సిద్ధమైనపుడు 42 వేల మంది కార్మికుల భద్రతకు బరోసా ఇస్తూ.. కేంద్రం నుంచి రూ. 663 కోట్ల వడ్డీ లేని రుణాలు మాఫీ చేయించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు.

నేడు సింగరేణిపై అధికారం చెలాయిస్తున్న అధికార టీఆర్ఎస్ అనుబంధ కార్మిక సంఘమైన టీ.జీ.బి.జీ.కే.ఎస్ కుటుంబ పాలనకు చరమగీతం పలికేందుకు టీఎన్టీయూసీ శ్రేణులు సమష్టిగా పోరాడాలన్నారు. ఎన్నో ఏండ్లుగా కాపాడుకుంటూ వస్తున్న సింగరేణి బొగ్గు గని కార్మికులను టీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. తెలంగాణలో తెలుగుదేశం గెలుపునకు రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ త్వరలో నిర్వహించే బస్సు యాత్ర విజయవంతానికి టీఎన్టీయూసీ కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈ సమావేశంలో టీఎన్టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్కే బోస్, పెద్దపల్లి పార్లమెంటు టీడీపీ అబ్జర్వర్ బి.సంజయ్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల ఏడు కొండలు, రామగుండం అసెంబ్లీ నియోజకవర్గం కో-ఆర్డినేటర్ పెద్దపల్లి సత్యనారాయణ, టీటీడీపీ మీడియా కో-ఆర్డినేటర్ బియ్యని సురేశ్, టీఎన్టీయూసీ రాష్ట్ర నాయకులు మోహన్ రావు, రత్నాకర్ రావు, ప్రసాద్ బాబు, మణి రామ్ సింగ్, గడల నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కన్నీటి వీడ్కోలు

- ముగిసిన జెడ్పీ చైర్మెన్ కుసుమ జగదీష్ అంత్యక్రియలు
- మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, చైర్మెన్ల ఘన నివాళి



నవతెలంగాణ-ములుగు

బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మెన్ కుసుమ జగదీశ్వర్(47) మృతదేహానికి సోమవారం ఆయన స్వగ్రామం ములుగు జిల్లా మల్లంపల్లిలో అంత్యక్రియలు ముగిశాయి. జగదీష్ మృతదేహాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ సందర్శించి గులాబీ జెండాకప్పి నివాళి అర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఉద్యమకాలంలో తనవెంట నడిచిన సహచరులు ఇక మీదట లేరని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, జగదీశ్‌రెడ్డి, పువ్వాడ అజయ్, ఎంపీలు జోగినపల్లి సంతోష్ కుమార్, రంజిత్ రెడ్డి, మాలోత్ కవిత, ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సీతక్క, పెద్ది సుదర్శన్ రెడ్డి, అరూరి రమేశ్, గండ్ర వెంకటరమణారెడ్డి, శంకర్ నాయక్, రేగ కాంతారావు, గాదరి కిశోర్ కుమార్, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎల్ రమణ, కడియం శ్రీహరి, బీఆర్ఎస్ నేత కర్నె ప్రభాకర్, పలువురు జడ్పీ చైర్మెన్లు, కార్పొరేషన్ చైర్మెన్లు, ప్రజాప్రతినిధులు తరలివచ్చి నివాళులర్పించారు. కుసుమ మృతదేహం వద్ద కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, బీజేపీ జిల్లా అధ్యక్షులు చింతలపూడి భాస్కర్ రెడ్డి, ములుగు సబ్ రిజిస్ట్రార్ తస్లీమా నివాళి అర్పించారు. మంత్రులు సత్యవతి రాథోడ్, పల్లా రాజేశ్వర్ రెడ్డి, కర్నె ప్రభాకర్, ఏరువా సతీష్ రెడ్డి తదితరులు జగదీశ్వర్ అంతిమయాత్రలో పాడే మోశారు. అనంతరం మంత్రి కేటీఆర్ మాట్లాడారు. నాడు ఉద్యమంలో కేసీఆర్ ఏ పిలుపునిచ్చినా ఉద్యమకారుడిగా ప్రాణాలకు సైతం తెగించి పోరాడిన నాయకుడు కుసుమ జగదీష్ అని కొనియాడారు. నాలుగైదు రోజుల కిందట ప్రభుత్వ అధికారిక కార్యక్రమంలో జెడ్పీ చైర్మెన్‌గా, జిల్లా పార్టీ అధ్యక్షుడిగా పాల్గొన్నారని చెప్పారు. రెండు దశాబ్దాల నుంచి కేసీఆర్‌కు తమ్ముడిలా.. సుశిక్షితుడైన సైనికుడిలా పనిచేసిన ఆత్మీయ మిత్రుడు, కుసుమ జగదీశ్ అకాల మరణం అందరినీ తీవ్ర ఆవేదనకు గురిచేసిందన్నారు. వార్త తెలియగానే ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారని తెలిపారు.

ఆయన ఉద్యమంలో పేరు సంపాదించుకున్నాడు.. రాజకీయాల్లో పేరు సంపాదించుకున్నారని.. కానీ, ఆస్తిపాస్తులు కూడబెట్టుకోలేదని అన్నారు. జగదీష్ కుటుంబానికి చివరి దాకా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

అసెంబ్లీ ఎన్నికల్లోగా జగన్‌పై సీబీఐ కోర్టు తీర్పు చెప్పేలా ఉత్తర్వులివ్వండి

- తెలంగాణ హైకోర్టులో ఏపీ మాజీ మంత్రి హరిరామజోగయ్య

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నమోదైన కేసులపై తీర్పులను 2024 అసెంబ్లీకి ఎన్నికలకు లోపే సీబీఐ కోర్టు తీర్పులు చెప్పేలా ఉత్తర్వులు జారీ చేయాలని ఏపీ మాజీ మంత్రి చేగొండి హరిరామజోగయ్య తెలంగాణ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఆ పిల్‌కు నెంబర్ కేటాయించేందుకు హైకోర్టు రిజిస్ట్రీ నిరాకరించింది. విచారణను జులై ఆరో తేదీకి వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్ నేతృత్వంలోని డివిజన్ బెంచ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో ప్రజాప్రయోజనం ఏముందని ప్రశ్నించింది. సుప్రీంకోర్టు, రాష్ట్రపతిలకు వినతిపత్రాలతో కూడిన లేఖలు పంపామని పిటిషనర్ లాయర్ చెప్పారు. అలాంటి లేఖలు అన్ని కోర్టులకూ వస్తూనే ఉంటాయనీ, వాటిని ఆధారంగా చేసుకోలేమని స్పష్టం చేసింది. ప్రజాప్రతినిధులపై కేసులుండకూడదనే సదుద్దేశంతో పిల్ వేశామని లాయర్ చెప్పగా..రిజిస్ట్రీ లేవనెత్తిన అభ్యంతరాలకు సమాధానాలివ్వాలని హైకోర్టు ఆదేశించింది.

గంజాయి సరఫరా చేస్తున్న ముఠా అరెస్ట్

- రూ.2కోట్ల 80లక్షల 910కేజీల గంజాయి స్వాధీనం : సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర వివరాలు వెల్లడి



నవతెలంగాణ-మియాపూర్

ఒడిశా నుంచి మహారాష్ట్రకు పెద్ద ఎత్తున గంజాయి తరలిస్తున్న ముఠాను సైబరాబాద్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.2కోట్ల 80లక్షల విలువ చేసే 910కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసుకు సంబంధించిన వివరాలను సైబరాబాద్ కమిషరేట్‌లో సీపీ స్టీఫెన్ రవీందర్ మీడియాకు వెల్లడించారు.

వేరే రాష్ట్రాల నుంచి తెలంగాణ మీదుగా కొద్ది నెలలుగా గంజాయి సరఫరా జరుగుతోంది. ఈ సమాచారం పోలీసులకు అందింది. బాలానగర్, రాజేంద్రనగర్, శంషాబాద్, మాదాపూర్ పోలీసులు పక్కా సమాచారంతో సోదాలు జరిపారు. ఒడిశా నుంచి మహారాష్ట్ర, తెలంగాణ మీదుగా గంజాయి సరవరా చేస్తున్నట్టు గుర్తించారు. ప్రధాన నిందితులైన జీవన్‌సింగ్, అంకిత్‌సింగ్‌ను అరెస్టు చేశారు. వీరి నుంచి 5 మొబైల్స్, డీసీఎం వ్యాన్ స్వాధీనం చేసుకున్నారు. కొంతమంది కూలీలను అడ్డం పెట్టుకొని ఈ వ్యాపారం సాగిస్తున్నారు.

ప్రధానంగా ఒడిశా, మహారాష్ట్రకు చెందిన వ్యక్తులు అమాయక ప్రజలను ఎంచుకొని వారికి డబ్బు ఆశ చూపి ఇలాంటి వ్యాపారాలు చేస్తున్నారు. పోలీసుల దృష్టి మళ్లించేందుకు లారీ కింది భాగాన గంజి పెట్టి పైన తౌడు, బ్యాంగిల్స్ డబ్బాలు పెట్టి తరలిస్తున్నారు. ఈ క్రమంలోనే పోలీసులు గంజాయి ముఠాను అరెస్టు చేసి, గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అలాగే, చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శివాజీ అనే వ్యక్తి గంజాయి అమ్ముతుండగా చందానగర్, మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు పట్టుకున్నారు. నిందితుడు శివాజీని అరెస్టు చేశారు.

ఈ ఏడాది నుంచి 9వ తరగతి వరకు ఇంగ్లీష్

24 లక్షల మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు : విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి

- రావిర్యాల జడ్పీహెచ్ఎస్‌లో బాడిబాట
- విద్యార్థులకు అక్షరాభ్యాసం, పలకల పంపిణీ



నవతెలంగాణ-మహేశ్వరం

ప్రభుత్వ పాఠశాలల్లో గతేడాది 8వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియంలో బోధన సాగిందని, ఈ ఏడాది 9వ తరగతి కూడా ఇంగ్లీష్ మీడియంలో బోధించనున్నట్టు విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందివ్వాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల రాష్ట్రంలోని 24 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. నోట్ పుస్తకాలకు ప్రభుత్వం రూ.60 కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. పాఠశాలల పున్ణప్రారంభం సందర్భంగా మొదటి రోజు హాజరైన విద్యార్థులకు మంత్రి స్వాగతం పలికి అభినందించారు. నూతనంగా పాఠశాలలో చేరిన విద్యార్థులకు పలకలు పంపిణీ చేసి, అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చదువులో వెనుకబడిన విద్యార్థులకు తొలి మెట్టు కార్యక్రమం ద్వారా సులువుగా అర్థం అయ్యేలా బోధిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులు రాకపోవటానికి ఇంగ్లీష్ మీడియం కారణం అవటంతో పోటీ ప్రపంచంలో మన విద్యార్థులు పోటీ పడేలా ఉండాలని గతేడాది నుంచి 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు ఇంగ్లీష్ బోధన ప్రారంభించినట్టు తెలిపారు. ఈ సంవత్సరం 9వ తరగతి వరకు బోధించనున్నట్టు వివరించారు. ఏ ఆటంకం లేకుండా ఈ విద్యా సంవత్సరం కొనసాగాలని మంత్రి ఆకాంక్షించారు.

గతేడాది పాఠ్య పుస్తకాల పంపిణీకి రూ.132 కోట్లు ఖర్చు చేయగా, ఈ విద్యా సంవత్సరానికి రూ.200 కోట్లు వెచ్చించినట్టు తెలిపారు. దాదాపు రూ.150 కోట్లతో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులందరికీ రెండు జతల చొప్పున యూనిఫామ్‌ను ఈ నెల 20న జరిగే విద్యా దినోత్సవం సందర్భంగా అందివ్వనున్నట్టు తెలిపారు. రూ.35 కోట్లతో ఉదయం పూట విద్యార్థులకు రాగి జావా అందిస్తున్నట్టు చెప్పారు. పేరెంట్స్, టీచర్స్ మీటింగ్స్‌కు తల్లిదండ్రులు తప్పక హాజరు కావాలన్నారు. రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు వర్క్ బుక్స్‌ను, ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు నోట్ పుస్తకాలను ఉచితంగా అందజేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారని చెప్పారు. 'మన ఊరు-మనబడి' కార్యక్రమంలో భాగంగా 12 విభాగాల్లో పనులు పూర్తి అయిన 1000 పాఠశాలలను విద్యా దినోత్సవం సందర్భంగా ప్రారంభించనున్నట్టు తెలిపారు. హరితహారంలో భాగంగా పాఠశాలల వద్ద మొక్కలు నాటలన్నారు. గుడి లాగే బడినీ చూడాలన్నారు. స్థానిక సంస్థలు కూడా బాధ్యత తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు తిరగబడతారనే వర్సిటీల నిర్వీర్యం

- పార్టీ అధ్యక్షుడిని మార్చబోం : ఇంద్రసేనారెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ ఉద్యమ సమయంలో రాష్ట్రం కోసం వర్సిటీ కేంద్రాలుగా విద్యార్థులంతా ఏకమై కొట్లాడినట్టే... ఇప్పుడు తన ప్రభుత్వ లోపాలపై ఎక్కడ తిరగబడతారోనన్న భయంతోనే రాష్ట్రంలోని యూనివర్సిటీలను కేసీఆర్ నిర్వీర్యం చేస్తున్నారని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లు ఇంద్రసేనారెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో తమ పార్టీ అధ్యక్షుడి మార్పు ఉండబోదనీ, బండి నేతృత్వంలోనే ఎన్నికలకు వెళ్తామని స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగ భృతి హామీని నెరవేర్చలేదని వివరిస్తూ ఆ పార్టీ మ్యానిఫెస్టోలో పొందుపర్చిన వాగ్దానపు కాపీని తగులబెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కేజీ టూ పీజీ విద్య ఏమైందని ప్రశ్నించారు. యూనివర్సిటీలో 66 శాతం బోధనా సిబ్బంది పోస్టులు ఖాళీలున్నాయని చెప్పారు. ఏం ఘనత సాధించారని దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారని నిలదీశారు. కేంద్రంలోని మోడీ తొమ్మిదేండ్ల పాలనలో ప్రజలకు ఎంతో మేలు చేశామని పలు పథకాల గురించి పేర్కొంటూ వివరించారు. అధికార ప్రతినిధి కిశోర్ మాట్లాడుతూ.. ఐటీ రంగంలో ప్రత్యక్షంగా 9.5 లక్షల ఉద్యోగాలు, పరోక్షంగా 27 లక్షల ఉద్యోగాలు సృష్టించామని కేటీఆర్ చెబుతున్న లెక్కలన్నీ పచ్చి అబద్ధమన్నారు. ఐటీరంగంపై సమాచారం ఇవ్వాలని ఆర్టీఐ ద్వారా అడిగితే లెక్కలు లేవని చెప్పిన సర్కారుకు ఇప్పుడు ఎక్కడ నుంచి వచ్చాయని ప్రశ్నించారు.

ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డికి తప్పిన ప్రమాదం

- బైక్‌ను తప్పించబోయి చెట్టుకు ఢీకొట్టిన కారు



నవతెలంగాణ - శంకరపట్నం

ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డికి తృటిలో ప్రమాదం తప్పింది. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలో ఆయన కారు ప్రమాదానికి గురైంది. సోమవారం హుజురాబాద్‌లో 2కే రన్‌కు హాజరయ్యేందుకు కరీంనగర్ నుంచి బయలుదేరారు. శంకరపట్నం మండలం తాడికల్ గ్రామ సమీపంలో బైకును తప్పించబోయి కారు చెట్టును ఢీకొని పొలాల్లోకి దూసుకెళ్లింది. వెంటనే ఎయిర్ బెలూన్లు ఓపెన్ కావడంతో పెను ప్రమాదం తప్పింది. అనంతరం ఆయన మరో కారులో హుజురాబాద్ వెళ్లి ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేయించుకుని 2కే రన్‌లో పాల్గొన్నారు. బైక్‌పై ఉన్న వ్యక్తికి స్వల్ప గాయాలు కాగా, వెంటనే 108లో ఆస్పత్రికి తరలించారు.

పాఠశాలలు సందర్శించిన కార్పొరేటర్



నవతెలంగాణ -ఎల్‌బీనగర్

వేసవి సెలవుల తరువాత ప్రభుత్వ పాఠశాలలు సోమవారం తెరుచు కొన్నాయి. సోమవారం రాష్ట్రంలో పాఠశాలలు తిరిగి తెరుచుకొన్నాయి. ఈ మేరకు కార్పొరేటర్ శ్రీ వాణి సరూర్ నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల హాజరు పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలోని సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు సీఎం కేసీఆర్, మంత్రి సబితా ఇంద్రా రెడ్డి దష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు.

16న గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన





నవతెలంగాణ -చైతన్యపురి

గిరిజనులకు గిరిజన బంధును అమలుచేస్తున్నట్టు తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో ప్రకటించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 16 న ఉదయం 10 గంటలకు ఎల్‌బీ నగర్ సెంటర్ లోని అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన కార్యక్రమం ఉంటుందనీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామావత్ పాండునాయక్, జిల్లా ఉపాధ్యక్షులు మూడవత్ గోపినాయక్‌లు ప్రకటించారు. గిరిజనులు, గిరిజన విద్యార్థులు అందరు నిరసన కార్యక్రమం లో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆరోగ్య తెలంగాణే సర్కారు లక్ష్యం

- మంత్రి చామకూర మల్లారెడ్డి
- పీర్జాదిగూడలో ఉత్సాహభరితంగా తెలంగాణ రన్
- డ్యాన్స్ అదరగొట్టిన మంత్రి



నవతెలంగాణ-బోడుప్పల్

ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సోమవారం ఉదయం పీర్జాదిగూడలో జరిగిన తెలంగాణ రన్ (2కే రన్) జోరుగా.. హుషారుగా సాగింది. ఏవీ ఇన్ఫోప్రైడ్ గ్రౌండ్‌లో హోరెత్తించే డీజే పాటలకు మంత్రి చామకూర మల్లారెడ్డి, ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, కలెక్టర్ అమోయ్ కుమార్, కమిషనర్ చౌహాన్, మేయర్ జక్క వెంకట్ రెడ్డి తదితరులు జోష్‌గా జుంబా డ్యాన్సులు చేశారు. యువతీ, యువకుల కేరింతలు, చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా ఆద్యంతం వేడుకలా సాగిన ఈ రన్‌లో వేల సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గడిచిన తొమ్మిది సంవత్సరాల్లోనే తెలంగాణ అన్ని రంగాల్లోను దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలన్నదే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. తెలంగాణను ఆరోగ్య తెలంగాణగా మార్చేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ అద్వితీ యమైన కార్యక్రమాలను చేపట్టారన్నారు. అంతకు ముందు ఏవీ ఇన్ఫోగ్రౌండ్‌లో మంత్రి మల్లారెడ్డి, మేయర్ జక్క వెంకట్ రెడ్డి, గ్రీన్ ఇండియా చాలెంజ్ కో ఫౌండర్ రాఘవతో కలిసి గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ మొక్కను నాటారు. అనంతరం ములుగు జిల్లా పరిషత్ చైర్మన్ కుసుమ జగదీశ్ హఠాన్మరణంపై రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ తెలంగాణ రన్‌ను కుసుమ జగదీశ్‌కు అంకితం ఇస్తున్నట్టు ఎంపీ సంతోష్ కుమార్ ప్రకటించారు. ఈ కార్యక్ర



మంలో అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్యా, డీసీపీ జానకీ, ఏసీపీ నరేష్ రెడ్డి, జవహర్ నగర్ మేయర్ కావ్య, బోడుప్పల్ మేయర్ బుచ్చిరెడ్డి, దమ్మాయిగూడ మున్సిపల్ చైర్మెన్ ప్రణీత, పోచారం మున్సిపల్ చైర్మెన్ కొండల్ రెడ్డి, ఘట్‌కేసర్ చైర్ పర్సన్ పావని జంగయ్య యాదవ్, మున్సిపల్ కమిషనర్ వంశీ కష్ణ, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ప్రజా ప్రతినిధులు, మహిళలు, యువతి, యువకులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

దివ్యాంగులతో ఆత్మీయ సమావేశం

ఘట్కేసర్ / పోచారం : దేశంలో ఎక్కడా లేనివిధంగా



రాష్ట్రంలో సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. పోచారం మున్సిపల్ పరిధిలోని అన్నోజి గుడా శివాస్ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా దివ్యాంగులకు అదనంగా రూ. 1000 పెంచినందున దివ్యాంగులతో ఆత్మీయ సమావేశం నిర్వహించి దివాంగులను ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా మంత్రి మల్లారెడ్డి పాల్గొని సీఎం కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించి దివ్యాంగులతో సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ బోయపల్లి కొండల్ రెడ్డి వైస్ చైర్మెన్ రెడ్యా నాయక్, కమిషనర్ సురేష్, కౌన్సిలర్‌లు నర్రి ధనలక్ష్మి, కశయ్య, చింతల రాజశేఖర్, సింగిరెడ్డి సాయిరెడ్డి, ఆకీటి శైలజబల్ రెడ్డి, బైరా హైమాబలయ్య, మెట్టు బల్ రెడ్డి, నాల్లవెల్లి లక్ష్మి శేఖర్ ముదిరాజ్, సుర్వి సుధ లక్ష్మి శ్రీనివాస్, బద్దం మమత జగన్మోహన్ రెడ్డి బీఆర్ఎస్ పోచారం మున్సిపల్ అధ్యక్షులు మందాడి సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆలేటి ఎల్లయ్య
- జీహెచ్ఎంసీ వర్కర్స్‌తో సమావేశం



నవతెలంగాణ-వనస్థలిపురం

జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శ్రీకష్ణ దేవాలయం నగర్ వనస్థలిపురంలో జీహెచ్ఎంసీ వర్కర్స్‌తో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన సీఐటీయూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఆలేటి ఎల్లయ్య మాట్లాడుతూ జీహెచ్ఎంసీ కార్మికులకు కనీస వేతనం రూ. 26,000 ఇవ్వాలని ప్రభుత్వంపైన సీఐటీయూ 4 ఏండ్ల నుంచి పోరాటం చేస్తున్నదన్నారు కానీ ఈ మధ్యకాలంలో మే డే సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల పైన కుల వివక్ష చూపిస్తూ వేయి రూపాయలు పెంచడం ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు యాక్సిడెంట్‌లో చనిపోయిన కార్మికులకు, ప్రమాదాల బారిన పడిన కార్మికులకు ప్రమాద బీమా ఇన్సూరెన్స్ కల్పించాలని, వారికి వైద్య ఖర్చు జీహెచ్ఎంసీ భరించాలని డిమాండ్ చేశారు. ప్రతీ కార్మికునికి రూ. 50 లక్షలు ఇన్సూరెన్స్ చెల్లించాలని, అర్హులైన వారికి డబుల్ బెడ్ రూమ్ లో మంజూరు చేయాలని, రామ్కీ సంస్థతో, ప్రయివేటు ఇంజనీరింగ్ కంపెనీలతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, అందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల కార్మికులు, అన్ని కార్మిక సంఘాలతో కలిసి పోరాటం ఉదతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇక సీఐటీ యూ నుంచి బహిష్కరించిన మదిలేటికి సీఐటీయూకు ఎలాంటి సంబంధం లేదని, కార్మికులందరూ కూడా గమ నించి సీఐటీయూ సభ్యత్వం మద్దిలేటికి ఇవ్వవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అనిత, సునీత, వెంకటమ్మ, లక్ష్మమ్మ భాగ్యమ్మ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

'కామినేని'లో అడ్వాన్స్‌డ్ న్యూరో సెంటర్ ప్రారంభం

- రాష్ట్రంలోనే ప్రథమంగా పూర్తి స్థాయిలో జెనెటిక్స్ ల్యాబ్ అందుబాటులోకి..



నవతెలంగాణ-హాయత్ నగర్

మానవ శరీరంలో మెదడు, వెన్నుపూస, నాడీ వ్యవస్థ అత్యంత ముఖ్యమైనవి. ప్రస్తుత సమాజానికి మెదడు, నరాలు,కండరాలకు సంబంధించిన జబ్బులు ప్రతీ మనిషిని ఏదో ఒక సమయంలో ఇబ్బంది పెడుతున్నాయి. పక్షవాతం, మూర్ఛ వ్యాధి, స్పాండైలోసిస్ సమస్యలు, మెదడులో కణుతులు, యాక్సిడెంట్లు, మెదడు వాపు వ్యాధి, న్యూరోపతి జబ్బులు, మానసిక వ్యాధులు, ప్రస్తుతం బాగా ఎక్కువగా ఉన్నాయి. ఇటువంటి సమస్యలన్నింటికీ ఒకే గొడుగు కింద చికిత్సనందించేందుకు వీలుగా కామినేని హాస్పిటల్‌లో కామినేని అడ్వాన్స్‌డ్ న్యూరో సెంటర్ ను సోమవారం ప్రారం భించారు. ముగ్గురు నిష్ణాతులైన న్యూరాలజిస్టులు, ముగ్గు రు న్యూరో సర్జన్లు, ముగ్గురు సైకియాట్రిస్టులు, ఇద్దరు న్యూరో క్రిటికల్ కేర్ వైద్యులు, న్యూరో రేడియాలజిస్టులు కలిసి ఒక జట్టుగా ఏర్పడి 24/7 న్యూరో సేవలు అందించడం జరుగుతుందని, అత్యాధునిక 3టీ ఎంఆర్ఐ, సీటీ స్కాన్, న్యూరో ల్యాబ్, నావిగేషన్ సిస్టమ్, మైక్రోస్కోప్, స్టీరియోటాక్సీ వంటి సదుపాయా లన్నీ ఈ సెంటర్ నందు అందుబాటులో ఉంటాయి. సాధారణ న్యూరో సమస్యలు మొదలుకొని, అత్యంత తీవ్రమైన న్యూరో సమస్యలు పరిష్కరించడం, క్లిష్టమైన శస్త్ర చికిత్సలు నిర్వహించడం జరుగుతుందని న్యూరో వైద్యులు తెలిపారు. మన రాష్ట్రం లోనే ప్రథమంగా పూర్తి స్థాయిలో జెనెటిక్స్ ల్యాబ్ కూడా అందుబాటులోకి తీసుకు రావడం జరిగిందని, దీని ద్వారా జబ్బులకు జన్యు పరమైన కారణాలను గుర్తించడం (ఎక్జోమ సీక్వెన్సింగ్), జన్యు సంబంధిత జబ్బుల బారిన పడకుండా కౌన్సిలింగ్ నిర్వహించడం, (జెనెటిక్ కౌన్సిలింగ్) రోగి జన్యువులను బట్టి వారికి మందులు రాయడం (ఫార్మకోజె నోమిక్స్) వంటి అత్యాధునిక పద్ధతులు కూడా అందుబా టులోకి తీసుకు రావడం జరిగిందని కామినేని హాస్పిటల్స్ సీనియర్ న్యూరాలజిస్టు, డాక్టర్ నవీన్ కుమార్ చెప్పారు. న్యూరో వైద్యులు జలీల్,రమేష్,భూమిక్ చౌదసమా, కమ లేష్ చౌద,లక్ష్మీ లావణ్య, సారథి గౌడ్, రానే దే సౌజ, గౌతమి నగభైరవ, కిషన్ సింగ్,సింగాల దేవ్షన్, విశ్వేష్, బాలాజీ వరప్రసాద్,రవి చేతన్ శశికాంత్

నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



నవతెలంగాణ-వనస్థలిపురం

బీఆర్ ఎస్ బీ.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి ఆధ్వర్యంలో ఆటో స్టాండ్ వద్ద జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సమక్షంలో బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్‌లోని పలు కాలనీల నుంచి పెద్ద ఎత్తున యువ నాయకులు బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. దాదాపు 200 మంది యువత పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు నచ్చి పలువురు పార్టీలోకి చేరారని తెలిపారు. నేడు యావత్తు దేశం తెలంగాణ వైపు చూస్తున్నదని అన్నారు. సకలజనం మెచ్చిన నేత కేసీఆర్ అని,ఆయన పేరు వింటేనే కాంగ్రెస్,బీజేపీలకు వణుకు పుడుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ముచ్చటగా మూడోసారి విజయం సాధించి కేసీఆర్ చరిత్ర సష్టించడం ఖాయమని దీమా వ్యక్తం చేశారు. ఎల్.బి.నగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం జరిగిందని తెలిపారు. 118 జీ.ఓ.తేవడం ఒక గొప్ప విజయం అని తెలిపారు. చిట్ట చివరి ఇంటివారికి ఇంటి ప్రొసీడింగ్ ఇప్పించే బాధ్యత తనదే అని హామీ ఇచ్చారు. అలాగే నియోజకవర్గ పరిధిలోని ప్రతి డివిజన్ నందు స్విమ్మింగ్ పూల్ నిర్మించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కుంట్లూరు వెంకటేష్ గౌడ్, అనిల్ చౌదరి, ముద్ద కళ్యాణ్, సతీష్ చౌదరి, రమేష్ నాయుడు, సువర్ణ రెడ్డి, నరేందర్, రాజ యాదవ్, మహేష్, శివ శంకర్,కాజా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీవాసులతో సమావేశం

చైతన్యపురి : చైతన్యపురి డివిజన్ పరిధిలోని ప్రభాత్ నగర్ కాలనీ, చుట్టుపక్కల 10 కాలనీవాసులు పడుతున్న ఇబ్బందులపై సోమవారం ఎలిమినేటి మాధవరెడ్డి కమ్యూనిటి హాల్ నందు సమావేశం నిర్వహించారు. ఫ్రూట్ మార్కెట్ గోడను ఆనుకొని ఉదయం పూట పండ్ల వ్యాపారం



చేసేవారు రోడ్డును ఆక్రమించుకొని దారి గుండా కనీసం నడవడానికి కూడా దారి ఇవ్వకుండా ప్రవర్తిస్తు నారని కాలనీ వాసులు ఎమ్మెల్యేకు తెలిపారు. పరిష్కారం చూపాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ట్రాఫిక్ అధికారులతో ఇప్పటికే మాట్లాడామని తెలిపారు. వారు లోపాలకు రాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే పండ్ల వ్యాపాంలకు కూడా తగు న్యాయం చేస్తామన్నారు. రాబోయే రోజుల్లో ఫ్రూట్ మార్కెట్ నందు నిర్మించే హాస్పిటల్ వల్ల ఎవరికి ఇలాంటి ఇబ్బందులు లేకుం డా చూసుకుంటామని తెలిపారు. కాలనీ వాసులు, బీఆర్ఎస్ డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఉప్పల్‌లో 2కే రన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ - ఉప్పల్

రాష్ట్ర అవతరణ దినోత్సవ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సోమవారం ఉదయం ఉప్పల్ రింగ్ రోడ్ నుంచి ఉప్పల్ భగాయత్ వరకు తెలంగాణ రన్ నిర్వహిం చారు. రాచకొండ కమిషనరేట్ పోలీస్ ఉన్నతాధికారులు నిర్వహించిన ఈ రన్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అభివద్ధిలో ముందంజలో ఉందని పేర్కొన్నారు. ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ అరుణకుమారి, ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ గోవింద్ రెడ్డి, కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, నాచారం ఇన్‌స్పెక్టర్, ఉప్పల్ ఎమ్మార్వో గౌతం కుమార్, కార్పొరేటర్లు జెరిపోతుల ప్రభుదాస్, పన్నాల దేవేందర్ రెడ్డి, ఉప్పల్ జీహెచ్ఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేందర్, ఎస్. డబ్ల్యూ. డి .ఈ చందన, ఉప్పల్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రమాదేవి, బీఆర్ఎస్ నాయకులు జనం పల్లి వెంకటేశ్వర్ రెడ్డి, మేకల మధుసూదన్ రెడ్డి, వేముల సంతోష్ రెడ్డి, చింతల నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చైతన్యపురి డివిజన్ అభివృద్ధికి కృషి

- కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్తా



నవతెలంగాణ-చైతన్యపురి

చైతన్యపురి డివిజన్ అభివృద్ధి కి తన వంతు కృషి చేస్తానని కార్పొరేటర్ రంగా నరసింహ గుప్తా అన్నారు. సోమవారం ఆయన డివిజన్ పరిధిలోని మారుతిన గర్, సత్యనారాయణ పురం కాలనీలలో సమస్యల మీద పర్యవేక్షించి అధికారు లను పిలిపించి ఇండ్లకు అడ్డుగా ఉన్న వక్షాలను కట్ చేయించారు. మ్యాన్ హోల్ డ్యామేజ్ అయిన వాటిని కొత్తగా కట్టించాలని, ఎలక్ట్రిక్ పోల్స్ శాంక్షన్ చేయించి కొత్తవి వేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం సమీపిస్తున్నందున ఎలక్ట్రిక్ పోల్స్ సమీపంలో పెరుగుతున్న చెట్లను కట్ చేయించారు. మ్యాన్ హోల్స్ పనులు కూడా త్వరగా పూర్తి చేయాలని అన్నారు.ఈ పర్యవేక్షణలో జిహెచ్ఎంసి అధికారులు సాయికుమార్, శ్రీకాంత్, ఎలక్ట్రికల్ అధికారి జంగయ్య, మారుతి నగర్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కష్ణమూర్తి గౌడ్ ,ప్రభాకర్, నాయకులు శివ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు కుల ధ్రువీకరణ పత్రం వెంటనే ఇవ్వాలి

- డీవైఎఫ్ఐ హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి కృష్ణ నాయక్



నవతెలంగాణ-సంతోష్‌నగర్

పేదలకు కుల ధ్రువీకరణ పత్రం వెంటనే ఇవ్వాలని డివైఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా సౌత్ కార్యదర్శి కృష్ణ నాయక్ డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బండ్లగూడ డిప్యూటీ ఎమ్మార్వోకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బండ్లగూడ మండలం పరిధిలో పేద మధ్యతరగతి ప్రజలు ఎక్కువ శాతం నివసిస్తున్న ప్రాంతం అన్నారు. కావున వారికి స్కూల్, కాలేజీకి సంబంధించి, బీసీ లోన్ సంబంధించిన అవసరాల రిత్యా దరఖాస్తులు చేసుకున్న వారికి ఇబ్బందులు కలగకుండా అర్హులైన వారికి కుల ధ్రువీకరణ ,రెసిడెన్షియల్, ఆదా యం ప్రత్రాలు వెంటనే ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీవైఎఫ్ఐ నాయకులు ఎస్ కుమార్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన కార్పొరేటర్



నవతెలంగాణ-సంతోష్‌నగర్

సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఐ.ఎస్ సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్ రెడ్డి అన్నారు. బృందావన్ కాలనీలో సీసీ రోడ్డు పనులను ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని రోడ్లు, డ్రయినేజీ, మంచినీరు, తదితర మౌలిక సదుపాయాలను మెరుగు పరిచేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటూ వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటు న్నామని వెల్లడించారు. సీసీ రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. స్థానిక సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షులు జంగం మధుకర్ రెడ్డి, కాలనీవాసులు జంగారెడ్డి, నరసింహారెడ్డి, రఘునాథ్, వెంకట్ రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ రన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



నవతెలంగాణ -ఎల్‌బీనగర్

రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సోమవారం గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని పీ అండ్ టీ కాలనీ నందు పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ రన్‌లో ముఖ్య అతిథిగా ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. ముందుగా బెలూన్లు ఎగురవేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ స్ఫూర్తిని ప్రతిబింబించేలా తెలంగాణ రన్‌ను నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు .పీ అండ్ టీ కాలనీ చౌరస్తా నుంచి సరూర్ నగర్ స్టేడియం వరకు తెలంగాణ రన్ కొనసాగిందన్నారు. ఈ రన్‌లో ఎమ్మెల్సీ బొగ్గరపు దయనంద్ గుప్త, ఎల్.బి.నగర్ ఏ.సీ.పి.శ్రీధర్ రెడ్డి, సరూర్ నగర్ ఇన్‌స్పెక్టర్ జానకి రెడ్డి, ఎల్.బి.నగర్ ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి, డిప్యూటీ కమిషనర్లు కష్ణయ్య, మారుతీ దివాకర్, గడ్డిఅన్నారం మాజీ కార్పొరేటర్లు భవాని ప్రవీణ్ కుమార్, రమేష్ ముదిరాజ్, కుంట్లూరు వెంకటేష్ గౌడ్,బేర బాలకిషన్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు శ్రీశైలం యాదవ్, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ఫైనల్ మ్యాచ్‌ను ప్రారంభించిన ఉప్పల శ్రీనివాస్ గుప్త



నవతెలంగాణ- నాగోల్

హైదరాబాద్ లోని రాజేంద్ర నగర్, శివరాం పల్లి విజయ ఆనంద్ క్రికెట్ గ్రౌండ్ లో సోమవారం మైటీ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్స్ క్రికెట్ లీగ్ సీజన్-10 ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ పూర్వ చైర్మెన్, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్య క్షుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా మెడి సిటీ హాస్పిటల్ డాక్టర్స్ టీమ్, ఐరా డయాగ్నో స్టిక్ డాక్టర్స్ టీమ్ లకు మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్ కు టాస్ వేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మైటీ స్పోర్ట్ ఫౌండర్ అండ్ డైరెక్టర్ నంద పాండే , నిఖిల్ సంపత్, డాక్టర్స్ క్రికెట్ లీగ్ మ్యాచ్ టీమ్ సభ్యులు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీ సమస్యల పరిష్కారానికి కృషి

- కార్పొరేటర్ బండారు శ్రీవాణి



నవతెలంగాణ-ఉప్పల్

రామంతపూర్ డివిజన్‌లోని డ్రయినేజీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ బండారు శ్రీవాణి అన్నారు. సోమవారం డివిజన్‌లోని ఎండోమెంట్ కాలనీ రోడ్ నెంబర్ 4 లో డ్రయినేజీ సమస్య తలెత్తడంతో స్థానికుల ఫిర్యాదుతో కార్పొరేటర్ జలమండలి అధికారి మేనేజర్ పల్లె రవీందర్‌తో కలిసి ఎండోమెంట్ కాలనీలో పర్యటించారు. సమస్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెంటనే సమస్యను పరిష్కరించారు.

బడి బస్సులపై ఆర్టీఏ కొరడా..!

- రంగారెడ్డిలో తొలిరోజే 10 బస్సులు సీజ్
- హైదరాబాద్‌లో ఒక్క బస్సు సీజ్
- గ్రేటర్‌లోని మూడు జిల్లాలో ప్రత్యేక డ్రైవ్



స్కూలు బస్సును తనిఖీ చేస్తున్న అధికారులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులపై రవాణాశాఖ అధికారులు కొరడా ఝులిపించారు. గ్రేటర్‌లోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో 11 బస్సులపై కేసులు నమోదు చేశారు. సోమవారం నుంచి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమవడంతో వందలాది బస్సులు విద్యార్థులతో రోడ్డెక్కాయి. స్కూల్ ప్రారంభానికి ముందే బడి బస్సుల ఫిట్‌నెస్ చెక్ చేయించుకోవాలని రవాణాశాఖ ఉన్నతాధికారులు హెచ్చరించినా పట్టించుకోకపోవడంతో గ్రేటర్‌లోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు చెందిన ఆర్టీఏ అధికారులు విస్తృతంగా తనఖీలు చేపట్టారు.

గ్రేటర్ పరిధిలో మొత్తం 12వేలకుపైగా స్కూల్ బస్సులు ఉండగా.. వీటిలో 30శాతంపైగా బస్సులకు ఇంకా ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తికాలేదు. ఈ నేపథ్యంలో ఫిట్‌నెస్ పరీక్షలకు దూరంగా ఉన్న బస్సులపై రవాణాశాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టిసారించారు. ఈ క్రమం లోనే సోమవారం నుంచే ప్రత్యేక డ్రైవ్‌కు శ్రీకారం చుట్టా రు. హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ (జేటీసీ) జె.పాండురంగ నాయక్ ఆధ్వర్యంలో 5 ప్రత్యేక



బృందాలుగా ఏర్పడి నగరంలోని ప్రధాన కూడళ్లతో పాటు ముఖ్యమైన ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి.. ఫిట్‌నెస్ లేకుండా తిరుగుతున్న స్కూల్ బస్సును సీజ్ చేశారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా స్కూళ్ల బస్సులను తిప్పొద్దని విద్యాసంస్థల యాజమానులకు జేటీసీ సూచించారు. రంగారెడ్డి ఉపరవాణా కమిషనర్(డీటీసీ) ప్రవీణ్ రావు ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి రాజేంద్రనగర్, హయత్‌నగర్, తక్కుగూడ, నర్సింగ్ తదితర ప్రాంతాల్లో డ్రైవ్ చేపట్టారు. ఇందులో భాగంగా పలు స్కూల్ బస్సులను చెక్ చేయగా..10 బస్సులు నిబంధనలు విరుద్ధంగా తిరుగుతున్నట్టు గుర్తించి కేసులు నమోదు చేసి సీజ్ చేశారు. ఫిట్‌నెస్, లైసెన్స్ కాలపరిమితి, ఇతర ధ్రువపత్రాలు సరిగ్గాలేని బస్సులను సీజ్ చేసినట్టు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు, రక్షణ దృష్ట్యా నిబంధనలు పాటించాలని ఇప్పటికే సూచించామన్నారు. ఇలాంటి బస్సులు రోడ్లపై రాకుంటే పిల్లలు సురక్షితంగా ఉంటారని చెప్పారు. ఇక మేడ్చల్ జిల్లాలో రవాణాధికారి కిషన్ నాయక్ ఆధ్వర్యంలో బడి బస్సులపై విస్తృత తనిఖీలు నిర్వహించారు. జిల్లాలో తొలిరోజు తక్కువ సంఖ్యలో బస్సులు రోడ్డెక్కాయి. స్కూల్ బస్సులపై డ్రైవ్ కొనసాగుతుందని ఆయన తెలిపారు. నిబంధనలు విరుద్ధంగా నడిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వివరించారు.

దివ్యాంగుల పెన్షన్ పెంపు నిర్ణయం శుభపరిణామం : ఆందోజ్ సత్యం

నవతెలంగాణ -హస్తినాపురం

దివ్యాంగులకు పెన్షన్ రూ.1000 పెంచుతూ సీఎం కేసీఆర్ ప్రకటించిన నేపథ్యంలో హస్తినాపురం డివిజన్ సంతోషి మాత కాలనీలో గల దివ్యాం గుల



హాస్టల్లో ముఖ్యమంత్రి చిత్రపటానికి పూలమాల వేసి పాలాభిషేకం చేశారు. దివ్యాంగుల పట్ల ప్రభుత్వం ప్రదర్శిస్తున్న తీరు హర్షణీయమని బి.అర్.ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఆందోజ్ సత్యం చారి అన్నారు. ఎలాంటి వివక్ష లేకుండా అందరి సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తున్నదని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం లో.కుల వత్తుల వారికి పెద్ద పీట వేస్తూ వారిని ఆర్థికంగా బలపరచడానికి బి.అర్.ఎస్ ప్రభుత్వం ఉంటుందన్నారు. బీఆర్ఎస్ స్థానిక నాయకులు,ఆర్.పద్మ శ్రీనివాస్ నాయక్, నారగొని శ్రీనివాస్ యాదవ్, లెంకల శ్రీకాంత్ రెడ్డి, విజయ్ కుమార్, శ్రీరాములు గౌడ్, నాగిరెడ్డి,బిక్షపతి చారి, వికలాంగులు భాస్కర్,శివ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో షీ టీంలు దేశానికే ఆదర్శం

- మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- బడంగ్‌పేట్‌లో 5కే రన్ ఫర్ తెలంగాణకు విశేష స్పందన



నవతెలంగాణ-బడంగ్‌పేట్

దశాబ్ది ఉత్సవాలలో భాగంగా రాచకొండ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ 5 కే రన్‌కు విశేష స్పందన లభించింది. కదం తొక్కి కదలిన యువతను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అభినందించారు. సోమవారం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని క్రీడా మైదానం నుంచి రాచకొండ పోలీస్ కమిషనరెట్ సహకారంతో మీర్‌పేట్ పోలీస్ వారి ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణ 5కె రన్‌ను మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు త్రివర్ణ రంగుల బెలూన్‌లను గాలిలో వదిలి,రన్ లో పాల్గొంటున్న వారిని అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ పోలీస్ దేశంలోనే నంబర్ వన్ అన్నారు. రాష్ట్రంలో పోలీసులకు ముఖ్యమంత్రి కేసీఆర్ నూతన వాహనాలు, సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు .షీ టీంలు దేశానికి ఆదర్శం అయ్యాయన్నారు. సామాజిక కార్యక్రమాలకు యువత ముందుకు రావాలని మంత్రి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎల్బీ నగర్ డీసీపీ సాయిశ్రీ, కందుకూరు అర్.డి.ఓ.సూరాజ్ కుమార్, ఏసీపీ పురుషోత్తమ్ రెడ్డి, బీఆర్ఎస్ బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి, మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దీప్ లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి ,పలు డివిజన్ల కార్పొరేటర్లు, పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్‌లో 2 కే రన్



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆదేశానుసారం సోమవారం అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2కే రన్ అట్టహాసంగా ప్రారంభమైంది. మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ముఖ్య అతిథిగా హజరై జెండా ఊపి ఈ 2కే రన్‌ను ప్రారంభించి మాట్లాడారు. బంగారు తెలంగాణ ఏర్పాటుకు పోలీసు శాఖ వారి మద్దతు కావాలని కోరారు. ఈ2కే రన్ ఈ సేవా మెయిన్ రోడ్డు వద్ద ప్రారంభమై, మంగాపురం కాలనీ ఫుట్ బాల్ గ్రౌండ్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో అల్వాల్ సీఐ గంగాధర్, ట్రాఫిక్ సీఐ రాజు, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాజు, ఎస్సైలు భాస్కర్, పరుశురామ్, పోలీసు సిబ్బంది, స్పోర్ట్స్ మెన్స్, యువకులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు

బుద్ధనగర్‌లో శేషుకుమారి పర్యటన



నవతెలంగాణ-బేగంపేట్

అమీర్‌పేట్ డివిజన్లోని బుద్ధనగర్‌లో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి డివిజన్ అధ్యక్షులు ఎం.హనుమంతరావు ఆధ్వర్యంలో బస్తీలో పర్యటించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంతర్గత రోడ్లు మౌలిక సదుపాయాలు ఇబ్బందులను సంబంధిత అధికారులకు, మంత్రి తలసాని శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లి ఎంపిక చేసిన బీసీ వర్గాల్లోని కొన్ని కులాలకు సంబంధించి కుల వృత్తులు, చేతివృత్తి దారుల పనిముట్ల కోసం ప్రభుత్వం అందించే రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బస్తీ అధ్యక్షులు గొలుసుల సత్యనారాయణ, పార్టీ సీనియర్ నాయకులు దాడి ప్రవీణ్ రెడ్డి, కూతురు నరసింహ, హరి, బాసాలక్ష్మి, రాజు ముదిరాజ్, రామానంద్, లతా ముదిరాజ్, బస్తీ అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

బుక్స్, యూనిఫామ్స్ దందా అరికట్టాలి

- హైదరాబాద్ డీఈవోకు ఎస్ఎఫ్ఐ వినతి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రయివేట్, కార్పొరేట్ స్కూల్లో బుక్స్, యూనిఫామ్స్ దందాను అరికట్టాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. సోమవారం హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కె.అశోక్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు లెనిన్ గువేరా, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీమాన్, స్టాలిన్, శివ తదితరులు హైదరాబాద్ జిల్లా డీఈవో ఆర్.రోహిణిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యాసంవత్సరం మొదలైన తరుణంలో ప్రయివేట్, కార్పొరేట్ స్కూళ్లలోనే బుక్స్, యూనిఫామ్స్, టై, బెల్టు, సాక్సుల పేరుతో ఎల్‌కేజీకి రూ.6వేలు, పదో తరగతికి రూ.10వేల వరకు వసూలు చేస్తున్నారనీ, ప్రతి ఏటా బుక్స్ యూనిఫామ్స్ పేరుతో ఆయా స్కూళ్ల యాజమాన్యాలు తల్లిదండ్రుల నుంచి రూ.వందల కోట్లు దోచుకుంటున్నారని తెలిపారు. స్కూళ్లలో బుక్స్, యూనిఫామ్స్ అమ్ముతున్నారని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే అలాంటి అధికారులపై చర్యలు తీసుకోవాలనీ, లేదంటే ఆయా స్కూల్స్‌తో పాటు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

పాఠశాల గేటుకు తాళం.. రోడ్డుపైనే ఉపాధ్యాయులు..



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని తాడ్‌బండ్ ప్రభుత్వ పాఠశాలకు కంటోన్మెంట్ బోర్డు అధికారులు తాళం వేశారు. పాఠశాల పునర్ ప్రారంభం కావడంతో సోమవారం ఉపాధ్యాయులు పాఠశాలకు వచ్చి గేటుకు తాళం వేసి ఉండటం చూసి అవాక్కయ్యారు. తాడ్‌బండ్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు కంటోన్మెంట్ అధికారులు తాళం వేసినట్టు ఉపాధ్యాయులు తెలిపారు. తాము పాఠశాలలోకి వెళ్దామంటే గేటుకు తాళం ఉందని ఉపాధ్యాయులు హరినాథ్ తెలిపారు. పాఠశాల స్థలం తమ అధీనంలో ఉందనీ, లోపలికి వెళ్లవద్దని బోర్డు అధికారులు చెప్పినట్టు ఉపాధ్యాయులు వెల్లడించారు. విద్యాశాఖ, కంటోన్మెంట్ అధికారులు, ఉపాధ్యాయయులు డిప్యూటీ ఐఓఎస్ విజయ్ కుమార్‌కు సమాచారం ఇచ్చారు. తమకు ముందస్తు సమాచారం లేదనీ, అనుమతి లేకుండా పాఠశాలకు కంటోన్మెంట్ అధికారులు తాళం వేశారని చెప్పుకొచ్చారు. తదనంతరం విజయ్ కుమార్ విద్యా ఉన్నతాధికారులకు, స్థానిక బోయిన్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా పాఠశాల ప్రధాన రోడ్డుపై ఉండటం వల్ల తరచూ విద్యార్థులు రోడ్డు దాటుతూ దుర్మరణం చెందుతున్నారనీ, అక్కడినుండి పాఠశాలను తరలించాలని గత విద్యా సంవత్సరంలోనే సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోలేదనిబోర్డు అధికారులు కొందరు చెప్పారని తెలిపారు. ఆ పాఠశాలలో పదుల సంఖ్యలో విద్యార్థులు ఉన్నారనీ, వారిని ఇతర పాఠశాలలకు బదిలీ చేయించాలని కూడా గత విద్యా సంవత్సరంలో చెప్పామని తెలిపారు. ఆ ప్రాంతంలో రోడ్డు విస్తరణ కార్యక్రమం కూడా చేపట్టాలన్న ప్రణాళిక ఉందని దీంతో రక్షణశాఖ సంబంధించిన ఆ బంగ్లాలో పాఠశాల నిర్వహణ అనుమతిని రక్షణశాఖ అధికారులు నిరాకరించినట్టు సమాచారం. కాగా ఉత్త రోజుల్లోనే పాఠశాలకు వచ్చే విద్యార్థుల సంఖ్య పరిధిలోనే ఉండటం అంతేకాకుండా మొదటి రోజు కావడంతో ఒక్క విద్యార్థి కూడా రాకపోవడం విశేషం.



నెరవేరనున్న ముస్లింల 50 ఏండ్ల కల

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-బేగంపేట్

బేగంపేట్ ముస్లింల 50 ఏండ్ల కల నెరవేరబోతుందని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చెప్పారు. సోమవారం బేగంపేటలోని ఓల్డ్ కస్టమ్ ప్రాంతంలో, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కు సమీపంలో ముస్లిం గ్రేవ్ యార్డు కోసం రెండెకరాల స్థలం కేటాయించగా మంత్రి జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్‌తో కలిసి సందర్శించారు. ఈ ప్రాంతంలో ఎవరైనా మరణిస్తే అంత్యక్రియలు నిర్వహించేందుకు సరైన స్థలం లేక మృతదేహాలతో రోడ్లపై ఆందోళనలు చేసిన సందర్భాలు అనేకం ఉన్నాయని గుర్తు చేశారు. అనేక ఇబ్బందులు పడుతూ వస్తున్నారని తెలిపారు. గతంలో ఈ ప్రాంతం నుంచి ప్రాతినిధ్యం వహించిన ఎమ్మెల్యేలు, ముఖ్యమంత్రిగా, మంత్రులుగా వ్యవహరించినప్పటికీ సమస్యను పరిష్కరించలేకపోయారని తెలిపారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ అభివృద్ధి పనులకు అవసరమైన అన్ని రకాల ప్రభుత్వ అనుమతుల మంజూరు ప్రక్రియ పది రోజుల్లో పూర్తవుతుందని ఈ సందర్భంగా తనను కలిసిన హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ యాజమాన్యానికి వివరించారు. మంత్రి వెంట కార్పొరేటర్ మహేశ్వరి, సిటీ ప్లానింగ్ ఆఫీసర్ దేవేందర్ రెడ్డి, వసంత, సుదర్శన్, పబ్లిక్ స్కూల్ బోర్డ్ వైస్ చైర్మన్ రఘురాం రెడ్డి, సభ్యులు ఫయాజ్ ఖాన్, వినోద్, స్థానిక ముస్లిం నాయకులు సలీం, ఆరీఫ్, వహీద్, అబ్బాస్, అఖిల్, నాయకులు శ్రీనివాస్ గౌడ్, శ్రీహరి, నరేందర్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శంకుస్థాపన

నవతెలంగాణ-బేగంపేట్



బేగంపేట డివిజన్‌లోని శ్యాంలాల్ బిల్డింగ్ ప్రధాన రోడ్డు పునరుద్ధరణ పనులకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరావు కృష్ణారావు శంకుస్థాపన చేశారు. సోమవారం ఉదయం పలు బస్తీల్లో ప్రకటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూకట్‌పల్లి నియోజకవర్గంలోని అన్ని డివిజన్లను ఆదర్శంగా తీర్చిదిద్ది నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధికి ఎక్కడా డోకా లేకుండా నిధులు కేటాయిస్తూ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఎంతో సహకరిస్తున్నారని తెలిపారు. బేగంపేట వాసుల దశాబ్దాల కల స్మశాన వాటిక ఇటీవలే ప్రారంభించుకున్నామనీ, అక్కడక్కడ పెండింగ్‌లో ఉన్న పనులను అతి త్వరలోనే పూర్తి చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరి, శ్రీహరి, డివిజన్ అధ్యక్షులు సురేష్ యాదవ్, రాజయ్య, జనరల్ సెక్రెటరీ నరేష్, పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

- ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి



నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కాప్రా సర్కిల్ పరిధిలోని పెద్ద చర్లపల్లి పుకట్ నగర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లలో పదో తరగతిలో మెరుగైన ఫలితాలతో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాలతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థు లు షమీంకు రూ.5వేలు, సుమయకు రూ.3వేలు, నవ్యకు రూ.2వేల నగదుతోపాటు పాఠ్య నోటు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించే విద్యార్థులు అ త్యుత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చే యాలన్నారు. ఉపాధ్యాయులు చేస్తున్న కృషికి విద్యార్థుల తల్లిదండ్రులు సంపూర్ణ సహకారాలు అందించి సాగుతు న్న విద్య మహా యజ్ఞంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు విద్యాబుద్ధులతో పాటు వారి వారి అభిరుచులకు అనుగుణంగా ప్రాథమిక స్థాయి నుంచి క్రీడల్లో రాణించేలా తర్ఫీదును ఇవ్వాల్సిన అవస రం ఉందన్నారు. విద్యార్థులు ఆటలాడుకోవడానికి సరైన గ్రౌండ్ వసతి లేదని ఉపాధ్యాయ బృందం ప్రధానోపాధ్యా యురాలు శోభ, వనం విజయ్ కుమార్ చేసిన విజ్ఞాపనకు స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వ ఉన్నత పాఠశాల పక్కనే ఉన్న స్థలాన్ని చదును చేసి అందుబాటులోకి తీసుకురావాలని నాయకులకు సూచించారు. అనంతరం స్కూలు పిల్లలతో కలిసి భోజనం రుచి చూశారు. పెద్ద చర్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సేవా కార్యక్రమాలు చేపడు తున్న స్కూల్ ఫౌండర్ బొడిగ రాజు గౌడ్‌ను ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే శాలువాలతో అభినందించారు. ఈ కార్య క్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సామ్యూల్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జనంపల్లి వెంకటేశ్వర రెడ్డి, చర్లపల్లి డివిజన్ అధ్యక్షులు డప్పుగిరి బాబు, నాయ కులు గరిక సుధాకర్, కడియాల బాబు, గంప కృష్ణ, కడియాల రమేష్ బాబు, రెడ్డి నాయక్, శంకర్, తాళ్ల వెంకటేష్ గౌడ్, శ్యామ్, బుడంపల్లి వెంకటేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కమలానగర్‌లో సి.నారాయణరెడ్డి ఏడో వర్ధంతి



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి ఆధ్వర్యంలో ప్రముఖ కవి పండితుడు జ్ఞానపీఠ అవార్డు గ్రహీత సి.నారాయణ రెడ్డి ఏడో వర్ధంతి సందర్భంగా కమలానగర్ ఆఫీసులో నివాళి కార్యక్రమం నిర్వహించా రు. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరి రావు అధ్యక్ష వహించారు. ప్రారంభ సూచికగా బంగారు నర్సింగ్ రావు నారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాల వేశారు. శోభ నారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సామాజిక ఉద్యమ నాయకులు కోమటి రవి మాట్లాడు తూ నారాయణ రెడ్డి తెలంగాణలో తెలుగు భాష పట్ల ఎనలేని మక్కువ కలిగి దానిలో ఎన్నో ప్రయోగాలు చేసి తెలుగు వారందరి చేత శభాష్ అనిపించుకున్న గొప్ప కవి పండితులు అన్నారు. వారు అనేక గొప్ప గొప్ప రచనలు చేశారు అని తెలిపారు. ఆయన రచనలకు జ్ఞానపీఠ అవార్డు కూడా రావటం విశేషం అన్నారు. అభ్యుదయ భావాలు గల అనేక మందిని ఉత్తేజితులు ఊగించిన అనేక పాటలను రచించారన్నారు. ఆయన చేసిన సేవలు ఎంతో పేరు ప్రతిష్ఠలు తెచ్చాయని చెప్పారు. తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌గా చేశారన్నారు. స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు శ్రీమన్నారాయణ మాట్లాడుతూ సి.నారాయణరెడ్డి రాజ్యసభ సభ్యుడుగా ఉండి కరీంనగర్‌లోని వేమన పరిశోధనాలయానికి గ్రాంట్లు ఇచ్చారనీ, అనేక సాహిత్య ప్రక్రియలకు దోహదపడ్డారని చెప్పారు. అనం తరం సభ్యులందరూ సి.నారాయణ రెడ్డి చిత్రపటానికి పూలను అర్పించి నివాళిగా వందనం చేశారు. ఈ కార్యక్రమంలో గౌసియా, శ్రీనివాసరావు, జి.శివరామకృష్ణ, కృష్ణ, సాంబశివ రావు, తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక రహిత సమాజం నిర్మిద్దాం

నవతెలంగాణ-జవహర్‌నగర్



బాల కార్మిక రహిత సమాజాన్ని నిర్మిద్దామనీ, బాలలు పనిలో కాదు, బడిలో ఉండాలని క్రై స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి హిమబిందు అన్నారు. జవహర్ నగర్ కార్పొరేషన్ గబ్బిలాల్‌పేటలో ప్రపంచ బాల కార్మిక వ్యతిరేఖ దినోత్సవాన్ని పురస్కరించుకుని క్రై సంస్థ ఆధ్వ ర్యంలో సోమవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హిమ బిందు మాట్లాడుతూ దేశంలో బాల కార్మికులు ప్రమాదకరమైన కర్మాగారాల్లో పని చేస్తున్నా రనీ, వారికి రక్షణ కల్పించి చదువును అందిస్తే సమాజ నిర్దేశకులు అవుతారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన విద్యను అందిస్తుందనీ, ప్రభుత్వ బడిలో చదివిన విద్యార్థులు దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు. క్రై సంస్థ బాల కార్మికులు లేని సమాజానికి కృషి చేస్తుందనీ, గబ్బిలాల్‌పేటలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేయడంలో ప్రత్యేక చొరవ తీసుకుందని తెలిపారు. అనంతరం కాలనీల్లో ర్యాలీలు, కళా జాత నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్ర మంలో మంజుల, సునీల్, కళాకారులు వెంకటాచారి, ఆంజనే యులు, మల్లేష్, శ్రీశైలం, రాజుగౌడ్, బస్తీవాసులు పాల్గొన్నారు.

యూనివర్సల్ మల్టీ స్పెషాల్టీ డెంటల్ హాస్పిటల్ ప్రారంభం



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

నేరేడ్‌మెట్ పరిధిలో యూనివర్సల్ మల్టీ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్‌ను సోమవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు, మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, కార్పొరేటర్ మీనా ఉపేందర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ వంశీ, తదితరులు పాల్గొన్నారు.

పనులు ప్రారంభం



నవతెలంగాణ-కాప్రా

కాప్రా డివిజన్‌లోని వంపు గూడ కాలనీలో రూ.19 లక్షలతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రయినేజీ పనులకు స్థానిక కార్పొరేటర్ స్వర్ణ రాజుతో ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జలమండలి డివిజనల్ మేనేజర్ సతీష్ కుమార్, జలమండలి మేనేజర్ రోహిత్, కుషాయిగూడ సీఐ ప్రవీణ్ కుమార్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సుడుగు మహేందర్ రెడ్డి, గిల్బర్ట్, కాసం మహిపాల్ రెడ్డి, పవన్, మల్లారెడ్డి, చందు సాయిరాం, సరోజ, స్థానిక కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

పార్కుల సుందరీకరణకు కృషి : ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



నవతెలంగాణ-అంబర్‌పేట

పార్కుల్లో సుందరీకరణ దిశగా నిరంతర కృషి చేస్తున్నానని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. సోమవారం గోల్నాక డివిజన పరిధిలోని కృష్ణా నగర్‌లో పార్కు సుందరీకరణ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే తోపాటు గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కుల్లో ప్రజలకు మంచి ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా వివిధ రకాల మొక్కలు నాటడం, వాకింగ్ ట్రాక్, నీటి సౌకర్యం, కొత్త బెంచీలు, పెయింటింగ్, టైల్స్ వేయడం, పిల్లలకు క్రీడా సాధనాలు వంటి వాటితో పాటు విద్యుత్ దీపాలు, పటిష్టమైన ఆర్చ్, గేటు, పార్కు చుట్టూ ప్రహరీ గోడ నిర్మించనున్నామన్నారు. స్థానిక యువత కోసం ఇక్కడ ఓపెన్ జిమ్ కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్.కే.బాబు పల్లవి, ఉమాదేవి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్ ఆస్పత్రి ఆవరణలో ఘనంగా దశాబ్ది ఉత్సవాలు



నవతెలంగాణ-బంజారాహిల్స్

సోమవారం నిమ్స్ ఆస్పత్రి ఆవరణలో దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బోనాలు, డప్పు మేళాలతో ఊరేగింపుతో ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి సీఎం ఫ్లెక్సీకి పాలాభిషేకం నిర్వహించారు. నిమ్స్ మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లా యీస్ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా డా.మార్త రమేష్, నిమ్స్ ప్రభుత్వ అనుసంధాన కర్త, పారా మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షురాలు శాంత కుమారి, ప్రధాన కార్యదర్శి శిరందాస్ శ్రీనివాసులు, కాంట్రాక్టు ఎంప్లాయీస్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్ గౌడ్, గోవర్ధన్ ఎస్.ఎస్ నర్సింగ్, తెలంగాణ మహిళా ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు కనకతార పాల్గొన్నారు. పది మంది కార్మికులను సన్మానం చేసి నగదు అవార్డ్స్ రమేష్ చేతుల మీదుగా అందజేశారు.

ఉత్సాహంగా తెలంగాణ రన్







నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర అవతరణ దినోత్సవం దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా హైదరాబాద్ పోలీస్, అధ్వర్యంలో 'తెలంగాణ రన్' విజయవంతంగా కొనసాగింది. సోమవారం నెక్లెస్ రోడ్డులో 2కే,5కే రన్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హెూం శాఖమంత్రి మహమ్మద్, క్రీడల మంత్రి శ్రీనివాస్‌గౌడ్, సీఎస్ శాంతికుమారి, డీజీపీ అంజనీకుమార్, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్, సినీనటి శ్రీలీలలు పాల్గొన్నారు. వీరితో పాటు జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్‌కుమార్, సింగర్ మంగ్లితోపాటు అదనపు సీపీ ఏఆర్ శ్రీనివాస్, సత్యనారాయణతోపాటు పలువురు ఈ రన్‌లో ఉత్సాహంగా పాల్గొ న్నారు. పెద్దఎత్తున యువతీ యువకులు హాజరయ్యారు. ప్రసాద్ ఐమాక్స్ వద్ద ఏర్పాటైన సమావేశంలో నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి మాట్లాడుతూ ఆరోగ్యకర రాష్ట్రంలో రన్నింగ్, యోగా, వ్యాయామం జీవితంలో ఒక భాగం చేసుకోవాలన్నారు. అంబేద్కర్ విగ్రహం నుండి రోటరీ, లేక్ పీఎస్, పీపుల్ ప్లాజా ఐమాక్స్ వరకు 2కే రన్, కొత్త సచివాలయం వరకు 5కేరన్ ఉద్యోగులు యువత, పోలీస్, జీహెచ్ఎంసీ భాగస్వాములు అయ్యారన్నారు.

దండుకోవడానికే 'ధరణి'



నవతెలంగాణ-బంజారాహిల్స్

అకాల వర్షం, వడగండ్ల వానతో తీవ్రంగా నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.40 వేల నష్టపరిహారం ఇస్తుం దని, ప్రభుత్వం ప్రకటించిన రూ.10 వేల నష్టపరిహారం నేటికీ రైతులకు అందలేదని టీపీసీసీ ఎస్సీ విభాగం కన్వీనర్, రైతు నాయకులు తోట లక్ష్మీకాంతరావు తెలిపారు. రైతు నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బులను వెం టనే రైతుల ఖాతాల్లో జమచేయాలని, బస్తాకు సుమారు 6 కిలోలు కోత విధించడం గర్హనీయమన్నారు. ధరణితో 40 రకాల సమ స్యలు రైతులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. అదే విధంగా ఇప్పటివరకు రైతు నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బులను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని ఆయన కోరారు. ధరణి పోర్టల్ అస్తవ్యస్తంగా మారిన భూముల సమస్యలను పరిష్కరించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అ కాల వర్షాలతో నష్టపోయిన రైతుల సమస్యలపై సోమ వారం, సోమాజిగూడ,ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అకాల వర్షం, వడగం డ్ల వానతో తీవ్రంగా నష్టపోయిన రైతుల పట్ల ప్రభుత్వం పట్టింపులేనితనంతో వ్యవహరిస్తున్నదని, ఉదాసీన వైఖరిని అవలంభిస్తున్నదని, రైతులు ఎకరాకు సుమారు రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకు పెట్టుబడి పెట్టి పండించిన పంటలలో దాదాపు 95 శాతం పంట లు నష్టపోయారని, మిగిలిన 5 నుంచి 10 శాతం రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో కాంటా వేసినా నేటికీ డబ్బులు అందలేదన్నారు. ఫలితంగా వానాకాలం తొలకరి జల్లులు ప్రారం భమైనప్పటికీ తిరిగి వ్యవసాయం చేసేందుకు వారి వద్ద డ బ్బులు లేవని, దీంతో రైతులు తమ జీవనోపాధిని కోల్పో యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా ధరణి పోర్టల్‌లతో రైతులు సమస్యలను ఎదుర్కొంటు న్నా రని, రెవెన్యూ రికార్డులలో ఉన్న కాస్తు రైతు లకు యాజా మాన్యపు హక్కు కల్పించే 16వ కాలాన్ని ధరణిలో తొలగిం చారని, దీంతో వందల ఏళ్ల నుంచి రైతులు కాస్తు చేసుకుం టున్న భూములు, వారసత్వపు భూములు ధరణిలో వారి పేర్లమీద లేకుండా పోయాయని, ఇతర మధ్యవర్తులు రైతు లపై దాడులు చేస్తూ వారి భూములలోకి రానివ్వకుండా వేధింపులకు గురిచేస్తున్నారని వివరిం చారు. ధరణి వల్ల ఏర్పడుతున్న సమస్యలపై రైతులకు అవగాహన కల్పిస్తు న్నామని, వాటికి దీర్ఘకాలిక పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తున్నదని ఆయన చెప్పారు.

రక్తదానంతో ప్రాణాన్ని కాపాడొచ్చు

- పురుషులతో సమానంగా స్త్రీలు రక్తదానం..
- మాదాపూర్ డీసీపీ కె.శిల్పవల్లి



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

రక్తదానంతో ఒక ప్రాణాన్ని కాపాడవచ్చని మాదాపూర్ డీసీపీ కె.శిల్పవల్లి అన్నారు. కోఠి ఉస్మానియా మెడికల్ కళాశాలలో వరల్డ్ డోనర్స్ డే, తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ఓఎంసీ కేర్స్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి ఆమె ముఖ్య అతి థిగా పాల్గొని ప్రారంభించారు. ఆమె రక్తదానం చేశారు. అనంతరం మాట్లాడుతూ మహిళలు కూడా పురుషులతో సమానంగా రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. ఉస్మానియా మెడి కల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శశికళ రెడ్డి మాట్లాడుతూ రక్తదానం ప్రతి ఒక్కరు చేయాలని సూచించారు. ప్రతి రెండు సెకన్లలో భారతదేశంలో ఒకరికి రక్తం అవసరమ వుతుందని, జీవిత కాలంలో ప్రతి ముగ్గురిలో ఒకరికి రక్తం అవసరమవుతుందన్నారు. యూనిట్ రక్తం ముగ్గురి ప్రా ణాలు కాపాడుతుంది అని తెలిపారు. ఓఎంసీ కేర్స్ ఉపాధ్య క్షురాలు సత్యక్షి మాట్లాడుతూ ప్రజలు,యువత రక్తదానంపై ఉన్న అపోహలు విడనాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియామెడికల్ కళాశాల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శశికళ రెడ్డి, డాక్టర్ అనిత బల్ల, డాక్టర్ ఎన్ జయ, ఓఎంసీ కేర్స్ చైర్‌పర్సన్స్ ఫైజాన్ ఉల్‌హుస్సేన్ మహమ్మద్ అబ్దుల్ ఆఫీస్ మమ్మద్, ఉపాధ్యక్షురాలు సత్యక్షి, ప్రతినిధులు సంజనరెడ్డి, ప్రతినిధులు, విద్యార్థులు, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి

కార్పొరేటర్ విజయ్‌కుమార్ గౌడ్



నవతెలంగాణ-అంబర్‌పేట

స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని అంబర్‌పేట కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ అన్నారు. సోమవారం అంబర్‌పేట డివిజన్ పరిధిలోని ప్రేమ్ నగర్‌లో స్థానిక అధికారులతో కలిసి ఆయన పర్యటించారు.ఈ సందర్భంగా స్థానిక బస్తీ ప్రజలు మాట్లాడుతూ నాలాలో మట్టిని తొలగించాలని కార్పొరేటర్ దృష్టికి తీసుకురావడం తో వెంటనే స్పందించిన కార్పొరేటర్ సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే నాలాలో పూడిక తీత పనులు వేగవంతంగా చేయాలని, రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మహేష్ ముదిరాజ్,గోల్డ్ శ్రీను,సద్దాం,సంతోష్ చారి తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీ సమస్యల పరిష్కారాన్ని కృషి

-కార్పొరేటర్ పద్మ వెంకట్ రెడ్డి



నవతెలంగాణ-అంబర్‌పేట

డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నానని బాగ్అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మ వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం బాగ్ అంబర్‌పేట డివిజన్ పరిధిలోని పోచమ్మ బస్తి బతుకమ్మ కుంట ప్రాంతంలో డ్రైనేజీ పొంగి ప్రవహిస్తున్న సమస్య తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ వెంటనే వాటర్ వర్క్స్ డీజీఎం విష్ణువర్ధన్ రావు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించి మూసుకుపోయిన డ్రైనేజీ మాన్యువల్స్ సంగతి తెలుసుకొని వాటిని డ్రైనేజీ సూపర్వై జర్ లక్ష్మణ్‌తో కలిసి తీయించారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు వెంకట్ రెడ్డి ,నాయ కులు మిరియాల శ్రీనివాస్,డివిజన్ ప్రధాన కార్యదర్శి రమేష్ ముదిరాజ్ ,వెంకటేష్ ముదిరాజ్ , బాలకృష్ణ గౌడ్ , సందీప్, తదితరులు పాల్గొన్నారు.

జేసీఐ అక్రిడిటేషన్ పొందిన రెయిన్‌బో చిల్డ్రన్స్ ఆస్పత్రి



నవతెలంగాణ-బంజారాహిల్స్

బర్త్‌రైట్ బై రెయిన్‌బో భారతదేశంలోని ప్రముఖ పీడి యాట్రిక్ ఉమెన్ హెల్త్‌కేర్ ప్రొవైడర్ అయిన రెయిన్‌బో చిల్డ్ర న్స్ ఆస్పత్రి జాయింట్ కమిషన్ ఇంటర్నేషనల నుండి అత్యంత ప్రతిష్టాత్మకమైన'గోల్డ్‌సీల్‌ఆఫ్ క్వాలిటీ అప్రూ వల్'ని పొందినట్టు రెయిన్‌బో చిల్డ్రన్స్ ఆస్పత్రి బర్త్‌రైట్ రెయిన్‌బో చైర్మెన్ ఎం.డి.డాక్టర్ రమేష్ కంచర్ల వెల్లడిం చింది. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో ఉన్న రెయిన్‌బో చిల్డ్రన్స్ మెడికేర్ లిమిటెడ్ ఫెసిలిటీ యొక్క నాణ్యతను ఈ అక్రిడిటేషన్ గుర్తించింది. ప్రపంచ స్థాయిలో అసాధారణ మైన ఆరోగ్య సంరక్షణ సేవలను అందించడంలో ఆస్పత్రి అంకితభావం ఈ గుర్తింపు ద్వారా మరోసారి నిరూ పితమయ్యిందన్నారు. రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ బర్త్‌రై ట్ బై రెయిన్‌బో హాస్పిటల్స్, మేనేజ్‌మెంట్, సెంటర్‌లో ఏర్పాటు చేసిన చికిత్స ప్రోటోకాల్ యొక్క ఖచ్చితమైన ప్రమా ణాలతో మెరుగైన అధునాతన రోగుల సంరక్షణను అందిస్తోందని ఈ అక్రిడెటిటేషన్ నిదర్శనంగా నిలుస్తు ందన్నారు. వైద్యులు,నర్సులు,ఇతర సిబ్బంది అందించిన ప్రేమతో కూడిన సంరక్షణ,ఉమ్మడి లక్ష్యం కోసం కలిసి పని చేయడంలో మా సమిష్టి కృషికి నిబద్ధతకు ఈ విజయం నిదర్శనమని ఆయన తెలిపారు. డాక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ "బర్త్‌రైట్‌లో", మా వద్దకి వచ్చే దంపతులకి, మేము ఎల్ల ప్పుడూ గర్భిణీ మహిళలకు ప్రత్యేకమైన, సురక్షితమైన సంతోషకరమైన అనుభూతిగా మార్చడానికి ప్రయత్నిస్తుం టామనీ తెలిపారు.జాయింట్ కమీషన్ ఇంటర్నేషనల్ తర ఫున అమెరికా నుండి ఇద్దరు, తైవాన్ నుండి ఒకరు ఈ పరిశీలన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సిఓఓసంజీవ్ సు కుమారన్ గ్రూప్ మెడికల్ డైరెక్టర్ డా.ప్రశాంత్ పాల్గొన్నారు.

చిక్కడపల్లిలో వార్డ్ ఆఫీసు ఏర్పాటు చేయండి



కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్

నవతెలంగాణ-అడిక్‌మెట్

చిక్కడపల్లిలోని కృష్ణపత్రిక స్థలంలో వార్డ్ ఆఫీసును ఏర్పా టు చేయండి అని గాంధీ నగర్ డివిజన్ కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ అధికారులకు సూచించారు. ముషీరాబాద్ నియోజకవర్గం గాంధీనగర్ డివిజన్‌లో కొన్ని రోజులుగా జరుగుతున్న వార్డ్ ఆఫీసు ఏర్పాటు నిర్ణయంపై అధికా రులు ఎదుర్కుంటున్న ప్రజా వ్యతిరేక అభిప్రాయాలను దృ ష్టిలో పెట్టుకొని, చిక్కడపల్లి, బాపునగర్‌లోని మున్సిపల్ మార్కెట్ పక్కన చాలా ఏండ్లుగా నిరుపయోగంగా ఉన్న కృష్ణపత్రిక స్థలాన్ని వార్డ్ ఆఫీసుకు కేటాయించాలని నాయ కులు వినయ్ కుమార్, డిప్యూటీ ఇంజనీర్ గీతా, అసిస్టెంట్ ఇంజి నీర్ అబ్దుల్ సలామ్,వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌లతో కలిసి కృష్ణ పత్రిక భవనాన్ని పరిశీలించారు. కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ మాట్లాడుతూ కొద్ది పాటి రిపేర్‌లతో భవనం మంచి ఉపయోగకరం ఉంటుం దని, పార్కింగ్‌కు కూడా స్థలం వెసులుబాటు వుంటుందని, జీహెచ్ఎంసి కమిషనర్, జోనల్ కమిషనర్‌లకు వివరిం చారు. బీజేపీ నాయకులు దామోదర్, రాజేం దర్,బాలు,ఎస్ఎఫ్ఎ గోపాలకృష్ణ స్థానికులు, పాల్గొన్నారు.

ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆశిష్ కుమార్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఆయనతో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆయన వెంట ఉన్నారు.

నవతెలంగాణ -సుల్తాన్‌బజార్



దేశాన్ని భారత రాజ్యాంగ సంస్కృతిగా తీర్చిదిద్దాలి

ప్రొఫెసర్ నాగేశ్వర్ రావు, ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, డాక్టర్ విశారదన్ మహరాజ్



నవతెలంగాణ-అడిక్‌మెట్

భారత రాజ్యాంగాన్ని ప్రతి పౌరుడికి బోధించి భారతదేశాన్ని భారత రాజ్యాంగ సంస్కృతిగా తీర్చిదిద్దాలని ప్రొఫెసర్ నాగేశ్వర్‌రావు, ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, డాక్టర్ విశారదన్ మహరాజ్ అన్నారు. సోమవారం ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద భారత రాజ్యాంగం ప్రతి ఒక్కరికి బోధించాలి అనే నినాదంతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ పీఠిక ను చదివి ప్రగతిశీల ప్రజాస్వామ్య వాదులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ ధర్నాలో ప్రొఫెసర్ నాగేశ్వరరావు, ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు విశారదన్ మహరాజ్, హైకోర్టు న్యాయవాది శ్రీనివాస్ యాదవ్, సమాంతర ఎడిటర్ వరుణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ధర్మసమాజ్ పార్టీ తీసుకున్న భారత రాజ్యాంగాన్ని బోధించాలి అనే అంశం అభినందించాలని, ఇది ఒక పార్టీ నినాదం కాకుండా భారత దేశ నినాదాం కావాలని పేర్కొన్నారు. భారతదేశంలో సుప్రీం ఏ ప్రజాప్రతినిధి, ఏ ప్రభుత్వం కాదు, కేవలం భారత రాజ్యాంగమే సుప్రీమ్ అని తెలియజేశారు. ఈ సమాజంలో ఉన్న అనేక అసమా నతల, రుగ్మతల నుండి విముక్తి చెందాలంటే ప్రజలందరికీ భారత రాజ్యాంగంపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ నినాదం విస్తృతమైన రాజకీయ నినాదం కావాలని ఆకాంక్షించారు. ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షు లు విశారదన్ మహారాజ్ మాట్లాడుతూ భారతదేశం నడుస్తుంది భారత రాజ్యాంగం ద్వారా తప్ప ఏ మత గ్రంథం ద్వారా కాదని తెలిపారు. హైకోర్టు అడ్వకేట్ శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి పౌరుడికి భారత రాజ్యాంగం బోధించాలి అనే అంశంపై పోరాటం చేయడం భారతదేశంలోనే ప్రథమం అని కొనియాడారు. వరుణ్ కుమార్ మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని మార్చాలని గత ప్రభుత్వాలు చేసిన ఆలోచనను తిప్పికొట్టిన కాన్సీరామ్ మార్గంలోనే నేడు విశారదన్ మహరాజు, భారత రాజ్యాంగాన్ని బోధించాలి..పంపిణీ చేయాలని డిమాండ్‌తో విశారదన్ మహరాజ్ పోరాటం చేస్తున్నారని తెలియజేశారు. డీఎస్పీ రాష్ట్ర నాయకులు రాఘవేంద్ర ముదిరాజ్,హరీష్ గౌడ్, అబ్దుల్ రెహమాన్, లక్ష్మణ్, కృష్ణ నాయక్, గణేష్,సాయిబాబా, రమేష్,రాజు పూలమాల,దుర్గాప్రసాద్, సంధ్యారాణిలు పాల్గొన్నారు.


పౌష్టికాహారంపై అవగాహన సదస్సు



నవతెలంగాణ - బంజారాహిల్స్

పౌష్టిక,పోషక ఆహారాలపై ఆర్గానిక్, ప్రకృతి సిద్ధమైన వంటకాల మీద ప్రత్యేక అవగాహన ప్రదర్శన (ఎగ్జిబిషన్) కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా యువజన అధికారి కుమారి కుష్బు గుప్తా, జాతీయ యువజన అవార్డు గ్రహీత సంఘ సేవకులు కే.భగవాన్ దాస్, ప్రేమనగర్ బస్తి చైర్మన్ ఎం మహేష్ కుమార్‌లు ప్రారంభించారు. యువజన క్రీడల మంత్రిత్వ శాఖలోని నెహ్రూ యువ కేంద్ర, జైజవాన్ జైకిసాన్ యువజన సంక్షేమ సంఘం, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సేవా సంఘం, హైదరాబాద్ జిల్లా వారు ప్రేమ్‌నగర్ మహిళా మండలి సంయుక్తంగా అంబేద్కర్ భవన్‌లో సోమవారం అందరితో ప్రకృతి సిద్ధమైన పదార్థాలను వాడుతాం -ఆరోగ్యాలను కాపాడుకుంటాం అనే దానిపై ప్రతిజ్ఞ చేస్తూ కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్ర మంలో బస్తీ కమిటీ కోశాధికారి జి. సుధీర్ కుమార్,గౌరవ సలహాదా రులు టి వెంకటేశం అంబేద్కర్ సేవా సంఘం అధ్యక్షుడు మున్నా భాయ్, నెహ్రూ యువ కేంద్ర ప్రభుత్వం అధికారి వి చంద్రశేఖర్, కేఆర్ నరసింహారావు, నరసింహ, మహిళా మండలి నాయకులు మధురవేణి సునీత పద్మ అర్చన, రుక్మిణి, భారతి, విజేత తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ ఈ నెల 14న ఎర్రమంజిల్లో జరగబోయే నిమ్స్ ఆస్పత్రి 2 వేల పడకల ఆస్పత్రి ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న సంద ర్భంగా సోమవారం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు అధికారులతో కలిసి సమీక్షించారు. ఈ కార్యక్రమంలో వైద్యశాఖ అధికారులతో పాటు వెస్ట్ జోన్ డిసిపి జోయల్ డేవిస్ పంజాగుట్ట ఇనెస్పెక్టర్ ఏసీపీలో పాల్గొన్నారు.



నవతెలంగాణ -బంజారాహిల్స్

పిల్లలను విద్యకు దూరం చేస్తే శిక్ష తప్పదు



నవతెలంగాణ-బంజారాహిల్స్

పిల్లలను విద్యకు దూరం చేస్తే శిక్ష తప్పదని స్థానిక కార్పొరేటర్ వెంకటేష్ అన్నారు. సోమవారం ప్రపంచ బాల కార్మికుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా జూబ్లీహిల్స్ డివిజన్ ఫిల్మ్‌నగర్ బీజేర్ నగర్‌లో ఉన్న ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆ ర్యాలీలో ఆయన పాల్గొని ప్రసంగించారు. నేటి పిల్లలే రేపటి పౌరులని, బాల కార్మికులు నిర్మూలనే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తున్నారన్నారు. విద్యార్థులు బాగా చదివి దేశ అభివృద్ధి కోసం పాటు పడాలని తెలిపారు. ఫిల్మ్ నగర్ ఎఎల్ఓ కమలాకర్, జన్ సాహస్ స్టేట్ ఇన్‌ఛార్జీ స్టీఫెన్ డానియల్, రంగారెడ్డి జిల్లా కార్య దర్శి బ్రహ్మ, ఫీల్డ్ ఆఫీసర్ సందీప్, మండల కార్య దర్శులు మాధవి జయలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్



నవతెలంగాణ-అంబర్‌పేట

అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్ అధికారులకు సూచించారు. సోమవారం గోల్నాక డివిజన్ పరిధిలోని సోమవారం డివిజన్‌లోని న్యూ అంబేద్కర్ నగర్, దుర్గానగర్, అన్నపూర్ణ నగర్‌లలో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు.ఆమె మాట్లాడుతూ బస్తీలలో ప్రతిసారి వర్షాకాలం వరద నీరు ఇండ్లను ముంచేత్తుతుందని తెలిపారు. వరద ముంపు నుంచి బస్తీలను రక్షించుకునే దిశగా రూ.14లక్షలతో కొత్తగా పైప్‌లైన్ పనులను చేపట్టి నట్లు తెలిపారు. పనులు పూర్తయితాయని వెల్లడించారు. జీహెచ్ఎంసీ డీఈ ప్రవీణ్ కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మనోహర్ తదితర నాయకులు పాల్గొన్నారు.



సోమవారం ఖైరతాబాద్ నియో జకవర్గంలోని శ్రీనివాస్ నగర్ కమ్యూ నిటీ హాల్ జీహెచ్ ఎంసీ వార్డు కార్యాల యానికి ఇవ్వవద్దని స్థానిక బస్తీ వాసులు స్థానిక కార్పొరేటర్ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి విజయరెడ్డి వినతి పత్రం అందజేశారు.

నవతెలంగాణ-బంజారాహిల్స్

పాతబస్తీ బోనాల ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేస్తాం



నవతెలంగాణ-ధూల్‌పేట్

పాతబస్తీ శ్రీమహంకాళి జాతర బోనాల ఉత్సవాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేస్తామని జీఎచ్ ఎంసీ చార్మినార్ జోన్‌జోనల్ కమిషనర్ స్రామాట్ అశోక్ తెలిపారు. రానున్న బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని చాంద్రాయణ గుట్ట నర్కిపూల్‌బాగ్‌లోని జోనల్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం ఆయన భాగ్యనగర్ శ్రీమహంకాళి జాతర ఉమ్మడి దేవాలయాల ఊరే గింపు కమిటీ అధ్యక్షులు అలే భాస్కర్‌రాజ్‌తో పాటు, పలు ఆలయాల కమి టీల ప్రతినిధులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పలు ఆల యాల వద్ద నెల కొన్న సమస్యలను, చెప్పట్టాల్సిన అభి వృద్ధి పనులపై ఆలయ కమి టీ నిర్వాహకులు సమావేశంలో జోనల్ కమిషనర్‌కు వివరించారు. ఆయన మా ట్లాడుతూ అన్ని ఆలయాల వద్ద అభివృద్ధి పనులు చేప ట్టేందుకు చర్యలు తీసుకుంటా మన్నారు.జులై 16న బోనాల పండగ రోజు బోనాలు సమర్పించే ఆలయాల వద్ద రోడ్లకు మరమ్మతులు చేయించి, బలి గంప నిర్వహించే ప్రాంతాల్లో తాత్కాలిక వీధి దీపాలు ఏర్పాటు చేస్తామన్నారు.ఈ సమావేశంలో మలక్‌పేట్, సంతోష్‌నగర్, చాంద్రాయణగుట్ట, చార్మినార్, ఫలక్‌నుమా ,రాజేంద్ర నగర్ సర్కిల్ డీసీలు ఈఈలు, డీఈలు, ఏఈ లు, ఎలక్ట్రికల్ విభాగం డీఈలు, ఉమ్మడి దేవాలయాల ఊరేగిం పుకమిటీ సభ్యులు, దేవాల యాల క మిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

విశారదన్ మహారాజ్‌కు మద్దతు

- ప్రజాఏక్త పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

ఇందిరా పార్క్ వద్ద ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ చేపట్టిన రాజ్యాంగాన్ని బోధించండి అంటూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్ పాల్గొని మద్దతు తెలిపారు. లింగస్వామి మహరాజ్ హర్షవర్ధన్ మహారాజ్ ముఖేష్ మేరు మణికంఠ శర్మ, మురంశెట్టి శ్రవణ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

పార్టీ టికెట్ స్థానికులకే ఇవ్వాలి

- అంజన్ కుమార్ యాదవ్‌ను కలిసిన గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ టికెట్టు స్థాని కులకు ఇవ్వాలని టిపిసిసి మాజీ కార్యదర్శి లు సంజయ్ కుమార్ యాదవ్. శ్రీధర్ గౌడ్. నిర్మల్ కుమార్. శ్యాంసింగ్. యోగేష్‌లు అన్నారు. సోమవారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర పీసీసీ వర్కిం గ్ ప్రెసిడెంట్ అంజన్ కుమార్ యాదవ్‌ను కలిసి విన తిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. రానున్న సార్వ త్రిక ఎన్నికల్లో స్థానికు లకే కాంగ్రెస్ పార్టీ టికెట్ కేటాయించాలని అంజన్ కుమార్ యాదవ్‌ను కోరారు. పార్టీ కోసం పనిచేస్తున్న స్థానిక కాం గ్రెస్ నాయ కులకే పార్టీ టికెట్ కేటాయిస్తే, పార్టీ నాయకులు, కార్య కర్తలంతా సమనవయంతో కలిసి పని చేసి, గోషామహల్ నియో జకవర్గం లో కాంగ్రెస్ పార్టీగెలుస్తుందన్నారు.దీంతో అంజన్ కుమార్ యాదవ్ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారని చెప్పారు.

వడ్డెరలను గుర్తించి..వారి సమస్యలను పరిష్కరించాలి

- శివరాత్రి అయిలమల్లు



నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 40 లక్షలకు పైచిలుక ఉన్న జనాభా కలిగిన వడ్డెర సామాజిక వర్గాన్ని గుర్తించి వారి సమస్యలను పరిష్కరించా లని తెలంగాణ వడ్డెర సంఘం చారిటబుల్ ట్రస్ట్ రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి అయిలమల్లు అన్నారు. తెలంగాణ వడ్డెర సంఘం ఆధ్వర్యంలో వడ్డెర సమగ్ర సర్వే నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. వడ్డెరలను బీసీ సామాజిక వర్గం నుంచి తొలగించి ఎస్టీలలో చేర్చాలని డిమాండ్ చేశారు. రాబోయే ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల్లో వడ్డెరలు అసెంబ్లీ స్థానాలకు పోటీ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వేముల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వరికుప్పల వెంకటేష్, వైస్ చైర్మన్ గండికోట కుమార్ ,ఉపాధ్యక్షులు వరుకుప్పల శ్రీశైలం, శివరాత్రి వెంకటేష్, కోశాధికారి దండగల తిరుపతి, ప్రచార కార్యదర్శి డి వెంకట్ రమణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణ టెండర్‌కు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-శామీర్‌పేట



మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల (జగద్గిరిగుట్ట) శామీర్ పేటలో పారిశుధ్య నిర్వహణ టెండర్ పై దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇషత్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పారిశుధ్య నిర్వాహణ టెండర్ కొరకై దరఖాస్తులు చేసుకోవడానికి ఈనెల 20 చివరి తేదీ అని ఆసక్తిగల పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థినులు వారి తల్లిదండ్రులు దరఖాస్తుకు 500 రూపాయలు డిడి రూపంలో శామీర్ పేట కళాశాలలో సమర్పించాలని కోరారు. దరఖాస్తు ఫారం స్వీకరణ సమయం ఉదయం 10:00-04:00 గం॥ వరకు ఉంటుందని ఈనెల 20 వరకు టెండర్ ప్రకటించుకోవలన్నారు. మరిన్ని వివరాలకు చరవాణి 9121004530 నంబర్‌కు సంప్రదించాలని ఆమె పేర్కొన్నారు.

సీసీ రోడ్లకు చైర్ పర్సన్ శంభీపూర్ క్రిష్ణ శంకుస్థాపన

నవతెలంగాణ-దుండిగల్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ డి.పోచంపల్లి 10వ వార్డు 7వ వార్డులో సోమవారం రూ.23లక్షల వ్యయంతో సీసీరోడ్డు పనులను దుండిగల్ పురపాలక చైర్ పర్సన్ శంభీపూర్ కృష్ణవేణి క్రిష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానన్నారు. మంజూరైన అభివృధి పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకువస్తానని, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ పద్మారావు, కమిషనర్ సత్యనారాయణ, జెడ్పీ మాజీ వైస్ చైర్మెన్ ప్రభాకర్ రెడ్డి, కౌన్సిలర్లు నవిత శ్రీనివాస్ రెడ్డి, శంభీపూర్ క్రిష్ణ, మహేందర్ యాదవ్, రాము గౌడ్, సాయి యాదవ్, భారత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు..

బడిబాట పట్టిన విద్యార్థులు

- విద్యార్థులకు స్వాగతం పలికిన ఉపాధ్యాయులు
- తొలిరోజు 62.85శాతం హాజరు నమోదు
- విద్యార్థులతో కళకళలాడిన పాఠశాల
- ప్రభుత్వ స్కూళ్లలో పుస్తకాల పంపిణీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

బడి గంట మోగింది. రెండు నెలల వేసవి సెలవుల అనంతరం సోమవారం పాఠశాలల పున:ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 2,806 ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేట్ పాఠశాలలు తిరిగి తెరుచుకున్నాయి. దీంతో విద్యార్థులు మళ్లీ పుస్తకాలు బ్యాగులు భుజన వేసుకొని హుషారుగా స్కూళ్లకు వెళ్లారు. తమ పిల్లలను తల్లిదండ్రులు సైతం సంతోషంగా పాఠశాలలకు పంపించారు. మొదటి రోజు కావడంతో చాలా మంది పేరెంట్స్ తమ పిల్లలను స్కూళ్లకు పంపించలేదు. దీంతో మొదటిరోజు ప్రభుత్వ స్కూళ్లలో 1.14లక్షల మంది విద్యార్థులకు గాను 72వేల మంది రాగా.. 62.85 శాతం హాజరు నమోదైనట్టు విద్యాశాఖ అధికారులు చెప్పారు. అయితే మొదటి రోజు వెళ్లిన విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలు వివిధ రకాల సమస్యలతో స్వాగతం పలికాయి. హైదరాబాద్ జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 1,64,607 మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే విద్యాసంవత్సరం ప్రారంభం రోజే విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందించాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ.. జిల్లాలో ఇది ఎక్కడ అమలు కాలేదు. కేవలం కొన్ని పాఠశాలల్లో మాత్రమే విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు అందజేశారు. అదికూడా పూర్తిస్థాయిలో అందించలేదు. చాలావరకు పాఠ్య పుస్తకాలు పాఠశాలలకు చేరలేదని సమాచారం. జిల్లాలోని ఏ ఒక్క స్కూల్లో కూడా నోట్ బుక్స్, ఏకరూప దుస్తులు అందించినట్టు కనిపించలేదు. 1,870 ప్రయివేట్ పాఠశాలల్లో 7,24,776 మంది విద్యార్థులు చదువుతుండగా.. ఆయా ప్రయివేట్ స్కూళ్లు అప్పుడే తమ దందాకు తెరలేపాయి. భారీగా ఫీజు వసూళ్లకుతోడు.. యూనిఫామ్స్, బుక్స్, టై, బెల్ట్, సాక్సుల పేరుతో ఒక్కో విద్యార్థి నుంచి ఒకటో తరగతి నుంచి టెన్త్ వరకు రూ.6వేల నుంచి పదివేలకుపైనే దండుకున్నాయి. ఇక ఎండల తీవ్రత నేపథ్యంలో నగరంలో కొన్ని ప్రీ ప్రైమరీ పాఠశాలల యాజమాన్యాలు సెలవులు ప్రకటించాయి. ఇదిలావుంటే రెండు నెలల తర్వాత స్కూళ్లకు వచ్చిన విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వారికి పువ్వులు, పెన్నులు, పెన్సిళ్లు అందించి స్వాగతం పలికారు. విద్యార్థుల రాకతో సందడి వాతావరణం నెలకొంది. ప్రభుత్వ పాఠశాలలను తోరణాలు, రంగు కాగితాలతో అలకరించారు. విద్యార్థులు తమ పాత స్నేహితులతో కబుర్లలో మునిగిపోయారు. వేసవి సెలవుల విశేషాలు పంచుకున్నారు. నగరంలో తిరిగి పాఠశాలలు తెరుచుకోవడంతో ఉదయం, సాయంత్రం వేళలో ప్రధాన రహదారులు రద్దీగా కనిపించాయి.

ప్రయివేట్ విద్యార్థికి అడ్మిషన్ ఫామ్ అందజేసిన డీఈవో

విద్యాసంవత్సరం ప్రారంభ మొదటి రోజు సికింద్రాబాద్‌లోని అడ్డగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలను హైదరాబాద్ విద్యాశాఖాధికారిణి ఆర్.రోహిణి పరిశీలించారు. అక్కడి విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ప్రయివేట్ స్కూల్ నుంచి వచ్చిన విద్యార్థికి ఎన్‌రోల్‌మెంట్ ఫామ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థలను తలదన్నేలా రాష్ట్ర ప్రభుత్వం సర్కారు బడుల్లో విద్యా ప్రమాణాలను నెలకొల్పుతుందని, ప్రయివేట్ స్కూళ్ల నుంచి ప్రభుత్వ బడులకు వలసలు పెరుగుతున్నాయని తెలిపారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో 4వేలకుపైగా విద్యార్థులు ప్రవేశాలు పొందారని వివరించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నామని, మౌలిక సదుపాయాలు, ఇంగ్లీష్ మీడియంను అందుబాటులోకి తీసుకువచ్చామని డీఈవో గుర్తుచేశారు.



కుత్బుల్లాపూర్‌లో అట్టహాసంగా 'తెలంగాణ రన్'



- ప్రారంభించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, సీపీ స్టీఫెన్ రవీంద్ర
- హుషారెత్తించిన సినీ నటులు విశ్వక్ సేన్, అశ్విన్ , నటి నందిత శ్వేత

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో "తెలంగాణ రన్"అట్టహాసంగా జరిగింది. ఈ రన్ కి ముఖ్య అతిథులుగా హాజరైన కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర , అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్య , జోనల్ కమిషనర్ మమత, నిజాంపేట్ మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ప్రముఖ సినీ నటులు విశ్వక్ సేన్ , అశ్విన్, నటి నందిత శ్వేత తెలంగాణ రన్ లో పాల్గొని హుషారెత్తించారు. కుత్బులపూర్ మున్సిపల్ గ్రౌండ్ నుండి చింతల్ బస్ స్టాప్ మీదుగా ఐడీపీఎల్ నుండి తిరిగి మునిసిపల్ గ్రౌండ్ వరకు సాగింది. ఈ రున్ లో యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు చంద్రశేఖర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, గంగారాం, రామలింగరాజు , డీసీలు మంగతాయారు, ప్రజా ప్రతినిధులు, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు, డివిజన్ల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, యువత పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.

గుర్తింపు లేని సదాశివ ఇంటర్నేషనల్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాథోడ్ సంతోష్

నవతెలంగాణ-మేడ్చల్



మేడ్చల్ పట్టణంలోని కేఎల్ఆర్ వెంచర్‌లో గుర్తింపు లేకుండా నడుపుతున్న సదాశివ ఇంటర్నేషనల్ స్కూల్ పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాథోడ్ సంతోష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుండి ఎలాంటి గుర్తింపు లేకుండా విద్య సంవత్సరం ప్రారంభించాలనుకుంటున్న స్కూల్‌కు సంబంధించిన బ్యానర్స్ తీసివేసి,స్కూల్లో అమ్ముతున్న బుక్స్, యూనిఫామ్స్, తరగతిగది, స్కూల్‌ను, మండల విద్యాధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తింపు లేని పాఠశాలలు మండల విద్యాధికారుల కనుసందనంలో నడుస్తున్న పట్టించుకోకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. విచ్చలవిడిగా ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు, బుక్స్, యూనిఫామ్స్, అమ్ముతున్నా విద్యాధికారులు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు, అనుమతి పొందిన తరగతులు కన్నా ఎక్కువ తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేసి అడ్మిషన్ తీసుకొని దందాలు నడిపిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నత అధికారులు ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలను సందర్శించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి కిరణ్, శివ, మనోహర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

- అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబీహా గౌసోద్దిన్



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

సీఎం కేసీఆర్ అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబీహా గౌసోద్దిన్ అన్నారు. డివిజన్ పరిధిలోని శ్రీ వివేకానంద నగర్ కమిటీ హాల్‌లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు సోమవారం కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్ ఆధ్వర్యంలో అల్లాపూర్ డివిజన్ దివ్యాంగుల అధ్యక్షులు అమీర్ , సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర రావు చిత్రపటానికి దివ్యాంగులతో పాటు కార్పొరేటర్ పాల్గొని పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేనటువంటి విధంగా దివ్యాంగులకు రూ. 4116 లు పెన్షన్ సీఎం కేసీఆర్ ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం 3000 పింఛన్ అందిస్తున్న ఘనత కూడా బీఆర్ఎస్ ప్రభుత్వానికి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు లింగాల అయిలయ్య, కో ఆర్డినేటర్ వీరారెడ్డి, కూకట్ పల్లి బీసీ సెల్ అధ్యక్షులు నాగుల సత్యం, ఎస్సీ సెల్ అధ్యక్షులు జ్ఞానేశ్వర్, మైనార్టీ సెల్ అధ్యక్షులు నూర్ ఖాన్, మహిళా అధ్యక్షురాలు పార్వతమ్మ, చాంద్ సాబ్, కరీమ్ ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

బోనాల పండుగకు నిధులు మంజూరు

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



తెలంగాణలో రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా బోనాల పండుగ ఉత్సవాలను జరుపుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గుడికి నిధులు మంజూరు చేస్తుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. దీనికోసం అర్హులైన అమ్మవారి ఆలయ కమిటీలు తమ కమిటీ లెటర్ ప్యాడ్, బ్యాంక్ అకౌంట్ కాపీ కమిటీ సభ్యుల ఆధార్ కార్డు కాపీలతో తన కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

ఆర్యవైశ్యులకు అన్ని విధాల అండగా ఉంటాం

- మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



రాష్ట్రంలోని ఆర్యవైశ్యులందరూ రాజకీయంగా, ఆర్థికంగా ఎదుగుదల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందని మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి అన్నారు. సుభాష్ నగర్ 130 డివిజన్ పరిధిలో గల వెంకటాద్రి నగర్‌లో శ్రీ శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో కమిటీ సభ్యులు సోమవారం నిర్వహించిన హోమ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడుతూ మొట్టమొదటిసారిగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఆర్యవైశ్యులను గుర్తించి రాజకీయ పదవులను ఇచ్చి గౌరవాన్ని కల్పించారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆర్యవైశ్యులకు అన్ని విధాలా అభివృద్ధి చెందుతున్నారన్నారు. ఆర్యవైశ్యులకు అన్ని విధాల అండగా ఉంటామన్నారు.

తెలంగాణ పదేండ్ల కాలంలో వందేండ్ల అభివృద్ధి సాధించింది

- కార్పొరేటర్ మందాడి శ్రీనివాసరావు

నవతెలంగాణ- కేపీహెచ్‌బీ



ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం పదేండ్ల కాలంలో వందేండ్ల అభివృద్ధి సాధించిందని కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందాడి శ్రీనివాసరావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ముఖ్యమంత్రి కేసీఆర్ దివ్యాంగులకు మరో వెయ్యి రూపాయలు అదనంగా పింఛను పెంచిన నేపథ్యంలో సోమవారం కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ క్యాంప్ కార్యాలయంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి కార్పొరేట్‌తోపాటు దివ్యాంగులు పాలాభిషేకం చేశారు. అనంతరం దివ్యాంగులను సన్మానించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోని మిగతా రాష్ట్రాలు అన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళుతున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆంను తిరిగి నాయకుడిగా ప్రజలు మళ్లీ ఎన్నుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో కూకట్‌పల్లి నియోజకవర్గం ఆదర్శవంతంగా మారిందన్నారు. నేడు అన్ని మౌలిక సదుపాయాలతో ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి ,జనరల్ సెక్రటరీ రాజేష్, హనుమంతరావు ,రాంబాబు నాయుడు, పాతూరి గోపి, భవాని, భారతి ,రమాదేవి, లతా ,పద్మా రెడ్డి, వెంకట్ రెడ్డి హేమ తదితరులు పాల్గొన్నారు.

హైదర్ నగర్ డివిజన్‌లో మౌలిక వసతులకు పెద్ద పీట

- కార్పొరేటర్ నార్నే శ్రీనివాస్ రావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ



హైదర్ నగర్ డివిజన్‌లో మౌలిక వసతులకు పెద్ద పీట వేస్తామని హైదర్నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాస్ రావు అన్నారు. డివిజన్ పరిధిలోని హెచ్ఎంటీ శాతవాహన నగర్‌లో కాలనీ వాసులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా రూ.33 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగ నార్నె శ్రీనివాస్ రావు మాట్లా డుతూ సీసీ రోడ్ల పనుల అభివృద్ధి నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలన్నారు. ప్రజలకు ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన, మెరుగైన రవాణా సౌకర్యం కొరకు సాయ శక్తుల కృషి చేస్తానన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన, చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామన్నారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరితగగ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కాలనీలలో, బస్తీలలో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకవస్తే పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షుడు పోతుల రాజేందర్, అందే నర్సింహ, రామ, కోటేశ్వర్ రావు, హనుమంత్ రాజు, రామనాథం, రామ సుబ్బా రెడ్డి, వెంకట్ రామి రెడ్డి, వీరేశం, బాబు రావు, ప్రకాష్, పాల్గొన్నారు.

దూలపల్లి కల్వర్టు, రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు పరిశీలించిన ఎమ్మెల్యేలు

నవతెలంగాణ-దుండిగల్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని దూలపల్లి మెయిన్ రోడ్డులో ఎస్.ఎన్.డి.పి ఆధ్వర్యంలో రూ.8.45 కోట్లతో చేపడుతున్న కల్వర్టు , రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను సోమవారం ఎమ్మెల్యేలు కేపి వివేకానంద్ , మైనంపల్లి హనుమంత రావు స్థానిక చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్ , అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ మేరకు హెచ్ఎండిఏ చేపడుతున్న రోడ్డు వెడల్పు పనులకు అనుగుణంగా కల్వర్టు నిర్మాణ పనులను పెంచాలని, అందుకు అవసరమైన నిధులు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. 40% పనులు పూర్తి కావడంతో మిగిలి ఉన్న పనులు సకాలంలో పూర్తి చేయాలని అధికారులను వారు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఈ నారాయణ, డిఈ నరేందర్, ఏఈ లక్ష్మీ నారాయణ, స్థానిక వైస్ చైర్మన్ గంగయ్య నాయక్, పాక్స్ చైర్మన్ నరేందర్ రాజు , స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి



- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

పేద ప్రజల నివాసిత ప్రాంతాల్లో ప్రయివేటు ఆస్పత్రులు ముందుకు వచ్చి నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. సోమవారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి మైసమ్మ నగర్ - బి బ్లాక్ సంక్షేమ సంఘం ,పారమిత ఉమెన్ అండ్ కిడ్స్ కేర్ హాస్పిటల్, చింతల్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మైసమ్మ నగర్ బి - బ్లాక్ అధ్యక్షులు పిల్లి ఆంజనేయులు, బీజేపీ నాయకులు అరుణ్ కుమార్, జనరల్ సెక్రెటరీ రవీందర్ రెడ్డి, అరుణ్ కుమార్, కురుమారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గోపాల్, రాములు, సురేష్ రెడ్డి,, పాపిరెడ్డి, వైద్యులు, తదితరులు పాల్గొన్నారు

సీనియర్ నాయకులు మన్నె రాజుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గంకు చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మన్నె రాజు సోమవారం తన పుట్టినరోజు సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మన్నె రాజుని ఎమ్మెల్యే శాలువాతో ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'రావుస్ ఇన్నోవియస్ ఇంటర్నేషనల్ స్కూల్' ను ప్రారంభించిన ఎమ్మెల్యేలు

నవతెలంగాణ-దుండిగల్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని దూలపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన రావుస్ ఇన్నోవియస్ ఇంటర్నేషనల్ స్కూల్ ను సోమవారం ఎమ్మెల్యే కేపి వివేకానంద్, మల్కాజ్ గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక చైర్మెన్ సన్న శ్రీశైలం యాదవ్, వైస్ చైర్మన్ గంగయ్య నాయక్, పాక్స్ చైర్మన్ నరేందర్ రాజు మరియు స్థానిక నాయకులు, స్కూల్ యాజమాన్యం పాల్గొన్నారు.

స్వామి సారంగ్ గ్లోబల్ పీస్ ఫౌండేషన్ డైరెక్టర్ కనేక్ మోహిలే పర్యాటకరంగం, సంస్కృతిలో, విభిన్న వర్గాలకు మెరుగైన సేవలంది స్తున్నారు. ఈ సంద ర్భంగా ఆమెకు రాష్ట్ర తెలంగాణ మాజీ రాష్ట్ర అధి కార ప్రతినిధి మీర్ ఫిరసత్ అలీ బాక్రితో కలిసి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిలు జాన్సాండెన్ను అందించి సన్మానించారు.

నవతెలంగాణ-ధూల్‌పేట్



తెలుగు విశ్వవిద్యాలయం నూతన భవన పూజా కార్యక్రమం

నవతెలంగాణ-దుండిగల్

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నూతన భవనం వాస్తు పూజా కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి, కమీషనర్ రామకృష్ణ రావు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కిషన్ రావు ,రిజిస్ట్రార్ బట్టు రమేష్ ,కార్పొరేటర్ సురేష్ రెడ్డి సీనియర్ నాయకులు కోలన్ గోపాల్ రెడ్డి, వెంగయ్య చౌదరీ, ప్రొఫెసర్లు, సిబ్బంది, అధికారులు, ఇతర ముఖ్యులు తదితరులు పాల్గొన్నారు.



బాలలు ఉండాల్సింది బడిలో : సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా

నవతెలంగాణ-హయత్‌నగర్



బడి ఈడూ పిల్లల్ని బడిలో పెట్టాలని,పనిలో పెట్టుకుంటే జైల్ కు వెళ్లాల్సి వస్తుందని రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాది కార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా సూచించారు. బాల కార్మికులకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం హయత్ నగర్ లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో అనేక సంవత్సరాలుగా బాల కార్మికులు నేరం ఆచరిస్తున్నారన్నారు. ఇది దేశ తీవ్ర మైన సామాజిక సమస్యలలో ఒకటన్నారు. పిల్లలు దేశానికి భవిష్యత్ నాయకులు అవుతారన్నారు. పిల్లల పట్ల వారి తల్లిదండ్రులే శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రామ్ మోహన్,శ్రీనివాస్ రెడ్డి, నర్సింహ, ఉపాధ్యాయులు ఇందిరా తదితరులు పాల్గొన్నారు.



పాక్ మ్యాచులు హైదరాబాద్‌లో!

- అక్టోబర్ 15న భారత్, పాక్ పోరు అహ్మదాబాద్‌లో?
- అక్టోబర్ 5న తొలి మ్యాచ్, నవంబర్ 19న ఫైనల్
- ఐసీసీ 2023 వన్డే వరల్డ్‌కప్ ముసాయిదా షెడ్యూల్

ఐసీసీ మెగా ఈవెంట్లకు సుమారుగా ఏడాదికి ముందే షెడ్యూల్ ప్రకటిస్తారు. అంతర్జాతీయ అభిమానులు ప్రయాణ ఏర్పాట్లు, ఇతరాత్ర లాజిస్టికల్ వెసులుబాటు ఉండేలా చూస్తారు. టికెట్లు సైతం కనీసం ఆరు నెలల ముందే అభిమానులకు అందుబాటులోకి తీసుకొస్తారు. 2023 వన్డే వరల్డ్‌కప్‌కు మరో నాలుగు నెలల సమయమే ఉంది. అయినా, ఇప్పటివరకు షెడ్యూల్ విడుదల కాలేదు. టికెట్లు ఆన్‌లైన్‌లో ఉంచలేదు. ఓ ఐసీసీ ఈవెంట్‌కు ఇంతటి ఆలస్యం ఇదే తొలిసారి!.

న్యూఢిల్లీ : ప్రపంచ క్రికెట్ అభిమానులు, పొరుగు దేశాల క్రికెట్ ప్రియులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఐసీసీ 2023 వన్డే వరల్డ్‌కప్ షెడ్యూల్ అధికారికంగా విడుదల కాకపోయినా.. అభిమానులకు కిక్కిచ్చే వార్త మాత్రం ఐసీసీ వర్గాలు అందించాయి. వన్డే వరల్డ్‌కప్ నిర్వహణ కోసం బీసీసీఐ రూపొందించిన ముసాయిదా షెడ్యూల్ ఇప్పుడు ఐసీసీ వద్దకు చేరింది. ముసాయిదా షెడ్యూల్‌ను పరిశీలించనున్న ఐసీసీ.. సభ్య దేశాలతో పంచుకోనుంది. క్రికెట్ బోర్డుల అభ్యంతరాలు ఏమైనా ఉంటే వాటికి సైతం పరిగణనలోకి తీసుకుని తుది షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం కనిపిస్తోంది. ఇక ముసాయిదా షెడ్యూల్ ప్రకారం ప్రపంచ క్రికెట్ దాయాదులు భారత్, పాకిస్థాన్ అక్టోబర్ 15న అహ్మదాబాద్‌లోని బాహుబలి స్టేడియంలో తలపడనున్నాయి. అక్టోబర్ 5న డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లాండ్, రన్నరప్ న్యూజిలాండ్‌తో వన్డే వరల్డ్‌కప్ వేటకు తెరలేవనుండగా.. నవంబర్ 19న అహ్మదాబాద్‌లో ఫైనల్‌తో ముగియనుంది.



భారత్ తొమ్మిది వేదికల్లో.. :

ప్రపంచకప్ గ్రూప్ దశలో భారత జట్టు ఐదు వేదికల్లో ఆడనుంది. చెన్నై, ఢిల్లీ, అహ్మదాబాద్, పుణె, ధర్మశాల, లక్నో, ముంబయి, కోల్‌కత, బెంగళూర్ భారత మ్యాచులకు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. అక్టోబర్ 8న ఆస్ట్రేలియాతో (చెన్నై) తలపడనున్న టీమ్ ఇండియా.. అక్టోబర్ 11 అఫ్ఘనిస్థాన్ (ఢిల్లీ), అక్టోబర్ 15 పాకిస్థాన్ (అహ్మదాబాద్), అక్టోబర్ 19 బంగ్లాదేశ్ (పుణె), అక్టోబర్ 22 న్యూజిలాండ్ (ధర్మశాల), అక్టోబర్ 29 ఇంగ్లాండ్ (లక్నో), నవంబర్ 2 క్వాలిఫయర్ (ముంబయి), నవంబర్ 5 దక్షిణాఫ్రికా (కోల్‌కత), నవంబర్ 11 క్వాలిఫయర్ (బెంగళూర్)తో ఆడనుంది.



హైదరాబాద్‌లో పాక్ మ్యాచులు :

పాకిస్థాన్ క్రికెట్ జట్టు హైదరాబాద్ నుంచి వరల్డ్‌కప్ వేట షురూ చేయనుంది. గ్రూప్ దశలో తొలి రెండు మ్యాచులు ఆ జట్టు ఇక్కడే ఆడనుంది. అక్టోబర్ 6న, అక్టోబర్ 12న పాకిస్థాన్ రెండు మ్యాచుల్లోనూ క్వాలిఫయర్‌తో ఆడనుంది. భారత్‌తో మెగా పోరును అహ్మదాబాద్‌లో ఆడనుండగా.. బెంగళూర్, చెన్నై, కోల్‌కతలోనూ రెండేసి మ్యాచులు ఆడనుంది.

ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్స్ సందర్భంగా వన్డే వరల్డ్‌కప్ షెడ్యూల్ విడుదల చేస్తామని బీసీసీఐ కార్యదర్శి జై షా ప్రకటించినా.. అది సాధ్యపడలేదు. ఐసీసీ సీఈవో సైతం షెడ్యూల్ ఏ క్షణంలోనైనా విడుదల కావచ్చని వ్యాఖ్యానించాడు. కానీ ఇప్పటివరకు అధికారికంగా షెడ్యూల్ బయటకు రాలేదు. భారత్, పాకిస్థాన్ మ్యాచ్ అహ్మదాబాద్‌లో నిర్వహించటంపై పీసీబీ అభ్యంతరాలు ఏమైనా వ్యక్తం చేసిందా? ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? తెలియాల్సి ఉంది.

జులై 4న రెజ్లింగ్ సమాఖ్య ఎన్నికలు!

- రిటర్నింగ్ అధికారిగా జస్టిస్ మహేశ్ మిట్టల్



నవతెలంగాణ-న్యూఢిల్లీ

భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ)లో ఓ వైపు మహిళా అథ్లెట్లపై లైంగిక వేధింపుల కేసులో పురోగతి సాధించకుండానే.. జాతీయ మల్లయుద్ధ సంఘానికి ఎన్నికలు నిర్వహించేందుకు రంగం సిద్ధమవుతోంది. భారత రెజ్లింగ్ సమాఖ్యలో ఎన్నికల నిర్వహణ, ఆ క్రీడా సంఘం రోజు వారీ వ్యవహారాల పర్యవేక్షణ బాధ్యతలను భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ)కు అప్పగిస్తూ కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. రెజ్లింగ్ ఫెడరేషన్ పర్యవేక్షణకు ఇప్పటికే అడ్‌హాక్ కమిటీని నియమించిన ఐఓఏ.. తాజాగా ఎన్నికల రిటర్నింగ్ అధికారిని సైతం నియమించింది. జమ్ము కాశ్మీర్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మహేశ్ మిట్టల్ కుమార్‌ను రిటర్నింగ్ ఆఫీసర్‌ను నియమిస్తూ సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. భారత ఒలింపిక్ సంఘం టైమ్‌లైన్ ప్రకారం జులై 4న భారత రెజ్లింగ్ సమాఖ్య ఎన్నికలు జరుగనున్నాయి.

'భారత రెజ్లింగ్ సమాఖ్య ఎగ్జిక్యూటివ్ కమిటీకి ఎన్నికలు నిర్వహించేందుకు భారత ఒలింపిక్ సంఘం చర్యలు తీసుకుంటుంది. రెజ్లింగ్ ఫెడరేషన్ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా మిమ్మల్ని (జస్టిస్ మహేశ్ మిట్టల్) నియమిస్తున్నాం. ఎన్నికల నిర్వహణలో మీకు సహాయం అందించేందుకు అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ సహా ఇతర సిబ్బందిని మీరు నియమించుకోవచ్చు. ప్రత్యేక సర్వ సభ్య సమావేశం ఏర్పాటు చేసి జులై 4న ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. ఈ మేరకు షెడ్యూల్ రూపొందించాం. భారత రెజ్లింగ్ సమాఖ్య ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్‌గా మీ నియామకాన్ని ఆమోదిస్తారని, ఎన్నికలను సజావుగా నిర్వహిస్తారని ఆశిస్తున్నామని' ఐఓఏ సీఈవో కళ్యాణ్ చౌబె జస్టిస్ మహేశ్ మిట్టల్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. భారత ఒలింపిక్ సంఘం ఎన్నికల నిర్వహణకు జులై 4ను ఎంచుకున్నప్పటికీ.. జస్టిస్ మహేశ్ మిట్టల్ కుమార్ ఆ తేదిని మార్చేందుకు అధికారం కలిగి ఉంటారు. జులై 4 లేదా ఆ తర్వాత ఎన్నికలు నిర్వహించేది రిటర్నింగ్ అధికారి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం ప్రత్యేక సర్వ సభ్య సమావేశం (ఎస్‌జీఎం) ఏర్పాటు చేసేందుకు కనీసం 21 రోజుల ముందుగా నోటీసు జారీ చేయాల్సి ఉంటుంది.

బ్రిజ్‌భూషణ్ సన్నిహితులకు నో !

భారతీయ జనతా పార్టీ (బీజెపి) లోక్‌సభ సభ్యుడు, రెజ్లింగ్ సమాఖ్య మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ మహిళా రెజ్లర్లను లైంగిక వేధింపులకు గురి చేసిన కేసులో విచారణ ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. మైనర్ సహా ఏడుగురు మహిళా రెజ్లర్ల వాంగ్మూలం, సాక్షుల వాంగ్మూలం, క్షేత్రస్థాయిలో విచారణ పూర్తి చేసిన ఢిల్లీ పోలీసులు జూన్ 15న బ్రిజ్‌భూషణ్ కేసులో ఛార్జ్‌షీట్ దాఖలు చేయనున్నారు. ఇటీవల కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్‌తో సమావేశమైన రెజ్లింగ్ క్రీడాకారులకు జూన్ 30 వరకు రెజ్లింగ్ సమాఖ్య ఎన్నికలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఇదే సమయంలో ఈ ఎన్నికల్లో బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ కుటుంబ సభ్యులు, అనుచరులు పోటీ చేయరని రెజ్లర్లకు మంత్రి అనురాగ్ ఠాకూర్ హామీ ఇచ్చారు. బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ కుమారుడు కరణ్ సింగ్ గత రెజ్లింగ్ సమాఖ్య ఉపాధ్యక్షుడు, ఉత్తరప్రదేశ్ రెజ్లింగ్ సంఘంలో ఆఫీస్ బేరర్. బ్రిజ్‌భూషణ్ అల్లుడు విశాల్ సింగ్ బీహార్ రెజ్లింగ్ సంఘం అధ్యక్షుడు. నిబంధనల ప్రకారం కరణ్ సింగ్, విశాల్ సింగ్‌లు రానున్న ఎన్నికల్లో పోటీ చేసేందుకు అర్హులు.

భారత రెజ్లింగ్ సమాఖ్యకు 25 అనుబంధ రాష్ట్ర సంఘాలు ఉన్నాయి. ప్రతి సంఘం ఇద్దరు ప్రతినిధులను ఎన్నికల ప్రక్రియలో పాల్గొనేందుకు పంపవచ్చు. రెజ్లింగ్ సమాఖ్య ఎన్నికల్లో ఓవరాల్‌గా 50 మంది ఓటర్లు ఉంటారు. క్రీడాశాఖ మంత్రి హామీ ఇచ్చినా.. బ్రిజ్‌భూషణ్ కుటుంబ సభ్యులు రెజ్లింగ్ సమాఖ్య ఎన్నికల్లో పోటీచేసేందుకు నామినేషన్ దాఖలు చేస్తే పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది.

భారత్‌కు భారీ జరిమానా

- వంద శాతం మ్యాచ్ ఫీజు కోత
- గిల్‌కు అదనంగా 15 శాతం కోత
- డబ్ల్యూటీసీ ఫైనల్లో స్లో ఓవర్‌రేట్‌పై ఐసీసీ కొరడా



లండన్ : వరుసగా రెండోసారి ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో గదకు దూరమైన టీమ్ ఇండియా.. తాజా టైటిల్ పోరులో మ్యాచ్ ఫీజును సైతం పోగొట్టుకుంది. భారత్, ఆస్ట్రేలియా డబ్ల్యూటీసీ ఫైనల్లో నాలుగు రోజుల ఆట అదనంగా అర గంట పాటు సాగింది. ఏ ఒక్క రోజు 90 ఓవర్ల కోటా పూర్తి కాలేదు. దీంతో అంతర్జాతీయ క్రికెట్ కమిటీ (ఐసీసీ) క్రమశిక్షణ నియామవళి కొరడా ఝులిపించింది. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న అనంతరం భారత్ ఐదు ఓవర్ల ఆలస్యంగా ఉండగా.. ఆస్ట్రేలియా నాలుగు ఓవర్లు ఆలస్యం చేసింది. నిబంధనల ప్రకారం ఓవర్‌కు 20 శాతం మ్యాచ్ ఫీజులో జరిమానా విధిస్తారు. ఈ లెక్కన భారత క్రికెటర్లు వంద శాతం మ్యాచ్ ఫీజును జరిమానా రూపంలో కోల్పోగా.. ఆస్ట్రేలియా క్రికెటర్లు 80 శాతం మ్యాచ్ ఫీజును జరిమానాగా చెల్లించనున్నారు. డబ్ల్యూటీసీ ఫైనల్లో భారత్‌పై ఆసీస్ 209 పరుగుల తేడాతో గెలుపొందిన సంగతి తెలిసిందే.

గిల్‌కు డబుల్ స్ట్రోక్ : భారత యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్‌కు ఐసీసీ డబుల్ స్ట్రోక్ ఇచ్చింది. స్లో ఓవర్ రేటు కారణంగా సహచర ఆటగాళ్లతో పాటు వంద శాతం మ్యాచ్ ఫీజు జరిమానాగా కోల్పోయిన గిల్.. మ్యాచ్ అధికారుల నిర్ణయంపై బాహాటంగా విమర్శలు చేసినందుకు అదనంగా మరో 15 శాతం మ్యాచ్ ఫీజును జరిమానాగా చెల్లించాల్సి వచ్చింది. రెండో ఇన్నింగ్స్‌లో శుభ్‌మన్ గిల్ క్యాచ్‌ను స్లిప్స్‌లో కామెరూన్ గ్రీన్ అందుకున్నాడు. సాఫ్ట్ సిగ్నల్ ఇవ్వకుండా ఫీల్డ్ అంపైర్లు నేరుగా టీవీ అంపైర్‌ను సంప్రదించారు. గిల్‌ను క్యాచౌట్‌గా టీవీ అంపైర్ ప్రకటించాడు. అవుట్ ఇచ్చినా క్రీజు వదిలేందుకు ఇష్టపడిన గిల్.. ఆ తర్వాత సోషల్ మీడియా వేదికగా ఆ క్యాచ్ ఫోటోలను జత చేస్తూ ఎమోజీలు పోస్ట్ చేశాడు. ఆర్టికల్ 2.7 ప్రకారం మ్యాచ్ అధికారుల నిర్ణయం పట్ల బహిరంగ విమర్శలు చేసినందుకు గిల్‌పై ఐసీసీ మ్యాచ్ ఫీజులో మరో 15 శాతం జరిమానా విధించింది. శుభ్‌మన్ గిల్ పొరపాటును అంగీకరించటంతో ఈ అంశంలో తదుపరి విచారణ ఉండదని ఐసీసీ వెల్లడించింది.

టాలన్స్‌పై పాంజర్స్ పైచేయి

ప్రీమియర్ హ్యాండ్‌బాల్ లీగ్




జైపూర్ : వరుస విజయాలతో ఊపుమీదున్న తెలుగు టాలన్స్.. వరుస పరాజయాలు మూటగట్టుకుంది. సోమవారం జరిగిన ప్రీమియర్ హ్యాండ్‌బాల్ లీగ్ (పీహెచ్‌ఎల్) గ్రూప్ దశ మ్యాచ్‌లో ఢిల్లీ పాంజర్స్ చేతిలో రెండు గోల్స్ తేడాతో ఓటమి చెందింది. ప్రథమార్థంలో 13-12తో ముందంజలో నిలిచిన తెలుగు టాలన్స్.. విరామం అనంతరం సైతం దూకుడుగా ఆడింది. ఢిల్లీ పాంజర్స్‌పై మ్యాచ్‌పై 90 శాతం ఆధిపత్యం చెలాయించింది. కానీ చివరి ఐదు నిమిషాల్లో ఆధిక్యంలోకి దూసుకొచ్చిన పాంజర్స్ 25-25తో స్కోరు సమం చేయటంతో పాటు 28-25తో ముందంజ వేసింది. టాలన్స్ గట్టిగా పోరాడినా.. పరాజయం తప్పలేదు. టాలన్స్ గోల్‌కీపర్ రాహుల్ 20 గోల్ ప్రయత్నాలను అడ్డుకుని ఔరా అనిపించాడు. పాంజర్స్ ఆటగాడు దీపక్ 11 గోల్స్‌తో ఆ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. తెలుగు టాలన్స్ తన తర్వాతి మ్యాచ్‌లో రాజస్థాన్ ప్యాట్రియాట్స్‌తో తలపడనుంది.

ప్రొ బాస్కెట్‌బాల్ లీగ్‌కు 14 మంది!

ట్రయల్స్‌లో ఎంపిక



హైదరాబాద్ : ఎలైట్ ఉమెన్ ప్రొ బాస్కెట్‌బాల్ లీగ్‌కు 14 మంది క్రీడాకారిణిలు ఎంపికయ్యారు. మూడు రోజుల పాటు హైదరాబాద్‌లోని డ్రీమ్ బాస్కెట్‌బాల్ అకాడమీలో జరిగిన పోటీల్లో 250 మంది క్రీడాకారిణులు పోటీపడ్డారు. హైదరాబాద్ వేదికగా నిర్వహించిన టాలెంట్ హంట్‌కు విశేష స్పందన లభించిందని నిర్వాహకులు సన్నీ భండార్కర్ తెలిపారు. త్వరలో నిర్వహించే ఎలైట్ ఉమెన్ ప్రొ బాస్కెట్‌బాల్ లీగ్ ప్లేయర్స్ వేలం జాబితాలో ఈ 14 మంది ప్లేయర్లు చోటు దక్కించుకున్నారు. వేలంలోనూ మెరిస్తే.. ఫ్రాంచైజీల తరఫున లీగ్‌లో బరిలోకి దిగే అవకాశం లభించనుంది.



ఈగల్‌గా రవితేజ..

రవితేజ, సినిమాటోగ్రాఫర్ నుంచి దర్శకుడిగా మారిన కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో చేయబోతున్న మాసీవ్ ప్రాజెక్ట్‌ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ప్రొడక్షన్ హౌస్‌లో చేస్తున్న విషయం విదితమే. మేకర్స్ సోమవారం ఈ సినిమా టైటిల్‌ను ఒక గ్లింప్స్ ద్వారా విడుదల చేశారు.

రవితేజ మోస్ట్ వాంటెడ్ పెయింటర్. అతన్ని పట్టుకోవడానికి 'రా' ఏజెన్సీ వెదుకుతుంటుంది. ఇంతలో ఓ వ్యక్తి.. అతను పత్తి పండించే రైతు అని చెబుతాడు. తనకి ఇంకొన్ని అవతారాలు కూడా ఉన్నాయి అంటూ రవితేజ ఫేస్‌ని రివీల్ చేస్తూ 'ఈగల్' అనే టైటిల్ రావడం స్ట్రైకింగ్‌గా ఉంది. గ్లింప్స్ హీరో ప్రపంచాన్ని ఎస్టాబ్లిష్ చేసింది. ఇందులో అనుపమ పరమేశ్వరన్, నవదీప్, మధుబాల వంటి ప్రముఖ తారాగణం కూడా కనిపించారు. కావ్యా థాపర్ మరో కథానాయిక. విజువల్స్ అత్యద్భుతంగా ఉన్నాయి. నేపథ్య సంగీతం కూడా ఎక్స్‌ట్రార్డినరిగా ఉంది. కార్తీక్ ఘట్టమనేని రచన, దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి మణిబాబు కరణంతో పాటు దర్శకుడు స్వయంగా స్క్రీన్ ప్లే రాశారు. టీజీ విశ్వ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, వివేక్ కూచిభొట్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. గ్లింప్స్ ద్వారా ఈచిత్రాన్ని 2024 సంక్రాంతికి విడుదల చేయనున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు.




విజయేంద్రప్రసాద్, మురళీమోహన్, కోదండరామిరెడ్డి

ఘనంగా విక్టరీ మధుసూదనరావు శత జయంతి వేడుకలు

తెలుగు సినిమా స్వర్ణ యుగానికి మెరుగులు దిద్దిన మహోన్నతమైన దర్శకుల్లో వీరమాచినేని మధుసూదనరావు అలియాస్ విక్టరీ మధుసూదనరావు ఒకరు. ఆయన శత జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు

ఈ సందర్భంగా మధుసూదన రావు కుమార్తె వాణి మాట్లాడుతూ,'నాన్న సినిమానే శ్వాసించారు.. సినిమానే జీవితంగా భావించి పయనించారు' అని తెలిపారు. 'మధుసూదనరావు దర్శకత్వంలో నేను నటించడం నిజంగా నా అదృష్టం. ఇక్కడ లోకల్ టాలెంట్‌ను ప్రోత్సహించటానికి 'మధు ఫిల్మ్ ఇనిస్టిట్యూట్'ను స్థాపించి ఎందరో కళాకారులను పరిశ్రమకు అందించారు' అని మురళీమోహన్ అన్నారు. దర్శకులు ఎ.కోదండరామిరెడ్డి మాట్లాడుతూ,'నేను ఈరోజు మూడు పూటలా అన్నం తింటున్నాను అంటే అది మధుసూదనరావు దయే. నా చేతి రాత చూసి, నా తలరాత మార్చేశారు' అని చెప్పారు. 'తెలుగు సినిమా ఉన్నంతకాలం గుర్తుంచుకోదగ్గ పేర్లలో మధుసూదనరావు పేరు కూడా ఉంటుంది' అని దర్శకుడు బి.గోపాల్ అన్నారు. దర్శకుడు ఎస్.వి. కృష్ణారెడ్డి మాట్లాడుతూ, 'మధుసూదనరావు సినిమాల్లో సెంటిమెంట్, మానవతా విలువలు, సమాజం పట్ల బాధ్యత కనిపిస్తాయి' అని తెలిపారు. 'మధుసూదన రావు కమ్యూనిస్ట్ భావజాలం ఉన్న వ్యక్తి. అలాంటి వ్యక్తి ఇన్ని కుటుంబ కథా చిత్రాలకు దర్శకత్వం వహించి సూపర్ హిట్‌లు ఇచ్చారంటే చాలా గర్వపడాల్సిన విషయం' అని వి. విజయేంద్ర ప్రసాద్ చెప్పారు. తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ, 'ఓ వైపు కుటుంబ కథా చిత్రాలను తీస్తూనే.. మరోవైపు సమాజాన్ని మేల్కొలిపే అభ్యుదయ చిత్రాలను కూడా తీసి విజయం సాధించారు. తన సినిమాల ద్వారా ప్రజలను చైతన్య వంతులను చేసి, భవిష్యత్ తరాలకూ ఆదర్శంగా నిలిచి, విక్టరీని ఇంటిపేరుగా పొందగలిగారు' అని అన్నారు.



మనోజ్ బాజ్‌పాయి

ఊహించని విజయమిది

మనోజ్ బాజ్‌పాయి ప్రధాన పాత్రలో నటించిన వెబ్ ఒరిజినల్ మూవీ 'సిర్ఫ్ ఏక్ బందా కాఫీ హై'. జీ స్టూడియోస్‌తో పాటు భన్సాలి స్టూడియోస్ బ్యానర్స్‌పై వినోద్ భన్సాలి, కమలేష్ భన్సాలి, విశాల్ గుర్నాని, ఆసిఫ్ షేక్ ఈ చిత్రాన్ని నిర్మించారు.

అపూర్వ సింగ్ కర్కి దర్శకత్వం వహించారు. హిందీలో బ్లాక్ బస్టర్ విజయాన్ని సాధించిన ఈ చిత్రం యూనిక్ కాన్సెప్ట్‌తో రూపొందటంతో దీన్ని ఈనెల 7న తెలుగు, తమిళంలోనూ రిలీజ్ చేయగా, అమేజింగ్ రెస్పాన్స్ లభించింది. ఈ సందర్భంగా సోమవారం మీడియాతో మనోజ్ బాజ్‌పాయి మాట్లాడుతూ, 'ఈ చిత్రం ఇంత పెద్ద సక్సెస్ అవుతుందని మేం ముందుగా ఊహించలేదు. ఆడియెన్స్ నుంచి అద్భుతమైన స్పందన వస్తుంది. కొందరైతే రెండు, మూడు సార్లు చూస్తున్నారు. ముఖ్యంగా క్లైమాక్స్‌నయితే రిపీట్‌గా చూస్తున్నారు. ఈ చిత్రంలో నేను చేసిన సోలం అనే లాయర్ పాత్ర కామన్ మ్యాన్‌కు దగ్గరగా ఉంటుంది. అందుకనే ఆ పాత్ర అందరికీ బాగా కనెక్ట్ అయ్యింది. ఎన్నో కష్టనష్టాలున్నప్పటికీ దాన్ని చిరునవ్వుతో ఎదుర్కొనే సాధారణ మధ్యతరగతి ప్రజలందరికీ ఈ పాత్ర ఓ ఉదాహరణ. ఈ సినిమాలోని కాన్సెప్ట్‌ను మన చుట్టూ జరుగుతున్న పలు నిజ ఘటనలు ఆధారంగా తయారు చేశాం. అయితే ప్రధానంగా ఈ సినిమా అంతా 16 ఏళ్ల అమ్మాయి చుట్టూనే తిరుగుతుంది. ఆమె తన జీవితంలో ఎదుర్కొన్న ఇబ్బందికరమైన పరిస్థితులను చూపించాం. అలాగే ఆమెకు, సోలంకితో ఉన్న ఓ మంచి అనుబంధాన్ని చూపించే ప్రయత్నం చేశాం. ఏ ప్రజాస్వామ్య వ్యవస్థకైనా న్యాయ వ్యవస్థే మూలస్తంభంలాంటిది. అందుకనే ఈ చిత్రాన్ని లాయర్స్‌కి, న్యాయ వ్యవస్థకి అందించిన నివాళిగా భావిస్తున్నాం. ఈ చిత్రంలో నేను కాకుండా మరో తెలుగు నటుడు ఎవరైతే బావుంటుందని ఆలోచిస్తే.. ఇప్పటికే పవన్ కళ్యాణ్ లాయర్‌గా చేసి మెప్పించారు. మహేష్‌బాబు అయితే ఈ పాత్రకు సూట్ అవుతారనిపిస్తోంది' అని తెలిపారు.

నవచిత్రం


పవర్‌ఫుల్ పోలీస్ కథ



హీరో గోపీచంద్ తన 31వ సినిమాని కన్నడ దర్శకుడు ఎ.హర్షతో చేయబోతున్నారు. యూనిక్ యాక్షన్‌ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రాన్ని శ్రీ సత్యసాయి ఆర్ట్స్ ప్రొడక్షన్ నెం 14గా నిర్మాత కెకె రాధామోహన్ నిర్మిస్తున్నారు. గోపీచంద్ పుట్టినరోజు సందర్భంగా చిత్ర నిర్మాతలు ఈ చిత్రానికి 'భీమా' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ని లాక్ చేశారు. ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో గోపీచంద్ ఫెరోషియస్ పోలీసు అధికారిగా కనిపించారు. ఫస్ట్‌లుక్ పోస్టర్ సినిమాలో గోపీచంద్ వైల్డ్ క్యారెక్టర్‌ని సూచిస్తుంది.ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని అల్యూమినియం ఫ్యాక్టరీలో జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో హై-ఆక్టేన్ యాక్షన్ సీక్వెన్స్‌ను మేకర్స్ చిత్రీకరిస్తున్నారు.

ఆద్యంతం వినోద భరితం

హీరో శ్రీవిష్ణు 'సామజవరగమన'తో హిలేరియస్ ఎంటర్‌టైన్మెంట్ అందించడానికి సిద్ధంగా ఉన్నారు. 'వివాహ భోజనంబు' ఫేమ్ రామ్ అబ్బరాజు దర్శకత్వంలో హాస్య మూవీస్ బ్యానర్‌పై ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి రాజేష్ దండా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అనిల్ సుంకర సమర్పిస్తున్న ఈ చిత్రంలో శ్రీవిష్ణు సరసన రెబా మోనికా జాన్ కథానాయికగా నటిస్తోంది. సోమవారం మేకర్స్ ఆకట్టుకునే పోస్టర్‌తో సినిమా విడుదల తేదీని ప్రకటించారు. ఈనెల 29 నుంచి ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సామజవరగమన నవ్వులు పూయించనుంది. శ్రీవిష్ణు, రెబా మోనికా జాన్, నరేష్, వెన్నెల కిషోర్, నెల్లూరు సుదర్శన్ కనిపించిన రిలీజ్ డేట్ పోస్టర్ అందర్నీ అలరించింది.



శ్రీవిష్ణు

గోపీ సుందర్ సంగీతం అందించిన ఫస్ట్ సింగిల్ మ్యూజిక్ లవర్స్‌ని ఆకట్టుకుంది. ఈ చిత్రానికి భాను బోగవరపు కథను అందించగా, నందు సవిరిగాన సంభాషణలు రాశారు. దర్శకుడు రామ్ అబ్బరాజు స్వయంగా ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లే రాశారు. రామ్‌రెడ్డి సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ఛోటా కె ప్రసాద్ ఎడిటర్, బ్రహ్మ కడలి ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు.



జెన్నీఫర్ ఇమ్మాన్యుయేల్, సూర్య శ్రీనివాస్

భిన్న కాన్సెప్ట్‌తో ఎవోల్

సూర్య శ్రీనివాస్, శివ బొద్దురాజు, జెన్నీఫర్ ఇమ్మాన్యుయేల్ ముఖ్య పాత్రధారులుగా నటిస్తున్న చిత్రం 'ఎవోల్'. (ఏ లవ్‌స్టోరీ ఇన్ రివర్స్). రామ్‌యోగి వెలగపూడి దర్శక, నిర్మాతగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. తేడా బ్యాచ్ సినిమా సమర్పణలో నక్షత్ర ఫిల్మ్ ల్యాబ్స్ పతాకంపై తెరకెక్కుతున్న ఈ చిత్రం సెన్సార్‌కి వెళ్ళనుంది. ఈ సందర్భంగా దర్శక, నిర్మాత రామ్‌యోగి మాట్లాడుతూ, 'ఇద్దరు స్నేహితుల మధ్య అండర్‌స్టాండింగ్ నేపథ్యంలో సాగే కథ ఇది. డిఫరెంట్ జోనర్ అంశాలు, వాణిజ్య విలువలతో క్రైమ్ థ్రిల్లర్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతుంది. హైదరాబాద్, వైజాగ్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరిపాం. ఆర్టిస్టులందరూ చక్కగా సహకరించారు. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేసుకుని సెన్సార్‌కు వెళ్లనుంది. త్వరలో ఫస్ట్ లుక్, టీజర్‌ను విడుదల చేస్తాం. దర్శక,నిర్మాతగా చేస్తున్న నా తొలి ప్రయత్నమిది. అందరి ఆదరణ కావాలని కోరుతున్నా. ఈసినిమా కచ్చితంగా అందర్నీ మెప్పిస్తుంది' అని అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సునీల్ కశ్యప్, ఎడిటర్: విజయ్, ఆర్ట్: యోగి వెలగపూడి, కొరియోగ్రాఫర్: జిన్నా, కథ-స్క్రీన్‌ప్లే-మాటలు-నిర్మాత-దర్శకత్వం: రామ్ యోగి వెలగపూడి.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

నాయక్ కాదు ఖల్‌నాయక్



ఆడింది ఆట...పాడింది పాట

- అన్నీ తానే...అంతా తానే
- రెజ్లింగ్ ఫెడరేషన్‌లో బ్రిజ్ ఆధిపత్య పోకడలు
- మాటలు ఘనం... చేతలు శూన్యం

న్యూఢిల్లీ : బ్రిజ్ తనను తాను ఓ 'బాహుబలి'గా భావిస్తారు. తనపై మహిళా మల్లయోధులు లైంగిక ఆరోపణలు చేసినప్పటికీ, గత కొంతకాలంగా తనను అరెస్ట్ చేయాలని వారు డిమాండ్ చేస్తున్నప్పటికీ ఆయన తొణకడం లేదు...బెదరడం లేదు. లైంగిక ఆరోపణల కేసులో బ్రిజ్‌పై ఈ నెల 15 నాటికి ఛార్జిషీటు దాఖలు అవుతుందని క్రీడల మంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు. ఫెడరేషన్‌ను బ్రిజ్ ఓ క్రూరుడిలా నడుపుతున్నారంటూ రెజ్లర్లు సాక్షి మాలిక్, వినేశ్ ఫోగట్, బజరంగ్ పునియా విమర్శలు కురిపిస్తున్నారు. అయినా ఆయన వీటిని లెక్కచేయడం లేదు. వాస్తవానికి డబ్ల్యూఎఫ్ఐ ఇప్పుడు వన్‌మాన్ ఫెడరేషన్‌గా మారిపోయింది. ఆయనే దానికి అధ్యక్షుడు, సెలక్షన్ కమిటీ ఛైర్మన్. అథ్లెట్ల ఫిర్యాదులు పరిష్కరించే కమిటీకి కూడా ఆయనే నేతృత్వం వహిస్తారు. జడ్జి, జ్యూరీ, నిర్ణయాన్ని అమలు చేసేదీ...అన్నీ ఆయనే. భారతీయ రెజ్లింగ్‌ను తాను ఉన్నత శిఖరాలకు చేర్చానని గొప్పలు చెప్పుకుంటారు. అయితే ఫెడరేషన్ కృషి కారణంగానే రెజ్లర్లు పతకాలు సాధిస్తున్నారన్న వాదనను సీనియర్ కోచ్ కులదీప్ షెరావత్ తోసిపుచ్చారు. మల్లయోధులు సాధిస్తున్న విజయాలలో ఫెడరేషన్ పాత్ర పరిమితమేనని అర్జున అవార్డు గ్రహీత కాకా పవార్ చెప్పారు.



వివిధ స్థాయిలలో పతకాలు సాధించిన రెజ్లర్ల విజయ యాత్రను పరిశీలిస్తే అందులో ఫెడరేషన్ పాత్ర పెద్దగా లేదన్న విషయం అర్థమవుతుంది. సాక్షి మాలిక్, సుశీల్ కుమార్, యోగేశ్వర్ దత్, రవి దహియా, బజరంగ్ పునియా...వీరందరూ వేర్వేరు ప్రదేశాలలో రెజ్లింగ్ నేర్చుకున్నారు. వీరికి ఫెడరేషన్ చేసిందేమీ లేదు. ఒలింపియన్లే కాదు...జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచిన లింగప్ప జెనన్నవార్, రాహుల్ అవేర్ వంటి మల్లయోధులు కూడా స్వయంకృషితో పైకి వచ్చిన వారే. అయితే ఈ వాస్తవాలను బ్రిజ్ భూషణ్ సుతరామూ అంగీకరించరు. ఫెడరేషన్‌లో లిఖితపూర్వక మార్గదర్శకాలు ఉన్నప్పటికీ ఆయన చెప్పిందే వేదం. ఉదాహరణకు జాతీయ శిబిరంలో ప్రవేశానికి కొన్ని అర్హతలను నిర్దేశించారు. అయితే ఫెడరేషన్ అధ్యక్షుడు తనకు సంక్రమించిన అధికారాలతో 'మంచి రికార్డు' ఉన్న ఒక రెజ్లర్‌ను శిబిరంలో చేర్చవచ్చు. 'మంచి రికార్డు' అనే పదానికి నిర్వచనం మాత్రం బ్రిజ్ ఇస్తారు. ఫెడరేషన్ ఛైర్మన్‌గా బ్రిజ్ సెలక్షన్ కమిటీకి నేతృత్వం వహిస్తారు. రాబోయే మూడు నాలుగు నెలల పాటు దేశానికి ప్రాతినిధ్యం వహించే మల్లయోధులను ఆయనే ఎంపిక చేస్తారు. సెలక్షన్ కమిటీ నిర్ణయంపై అభ్యంతరం ఉంటే రెజ్లర్లు ఫిర్యాదుల విభాగాన్ని ఆశ్రయించవచ్చు. కానీ దానికి కూడా బ్రిజ్ భూషణే నేతృత్వం వహిస్తున్నారు.

గత సంవత్సరం కామన్వెల్త్ క్రీడల నుండి స్వర్ణ పతకాలతో రెజ్లర్లు స్వదేశానికి వస్తే ప్రపంచ ఛాంపియన్‌షిప్ సెలక్షన్ ట్రయల్స్ నుండి పురుష మల్లయోధులను మినహాయించిన బ్రిజ్ భూషణ్, మహిళా రెజ్లర్ల విషయంలో మాత్రం వివక్ష ప్రదర్శించారు. సెలక్షన్ ట్రయల్స్ కూడా అన్నీ ఆయన ఇష్టప్రకారమే జరుగుతాయి. రిఫరీ ఏం చేయాలో కూడా ఆయనే నిర్దేశిస్తారు. క్రీడాకారుల తరఫున వీసా దరఖాస్తులు పంపడంలో కూడా బ్రిజ్ అలసత్వం వహిస్తారు. దీంతో చాలా మందికి సకాలంలో వీసాలు రాక పోటీలకు దూరమయ్యారు. బ్రిజ్ ఎంత నిర్దయుడంటే విమానాశ్రయ టెర్మినల్‌లో కూడా మహిళా రెజ్లర్ల చేత వర్కవుట్లు చేయించారు. జాతీయ, అంతర్జాతీయ టోర్నమెంట్ల కోసం శిబిరాలు నిర్వహించే సమయంలో బ్రిజ్ వేరే విషయాలపై దృష్టి సారించే వారు. ప్రణాళికలు రచించడం, సమీక్షలు జరపడంలో ఆయన పాత్ర చాలా స్వల్పం. ఒక్క మాటలో చెప్పాలంటే అధ్యక్షుడికి ఇష్టం లేని మాటలు ఫెడరేషన్‌లో ఎవరూ చెప్పరు. కొంతమంది రెజ్లర్లను ఎంపిక చేసుకొని వారినే పదేపదే టోర్నమెంట్లకు పంపడంతో వారిపై ఒత్తిడి పెరిగి రిక్తహస్తాలతో తిరిగి వస్తున్నారు.

కొన్ని సంవత్సరాల క్రితం ఓ సాయంకాలం. క్రీడా శాఖ మాజీ కార్యదర్శి శాస్త్రి భవన్‌లోని తన కార్యాలయంలో కూర్చొని ఉండగా ఓ ఫోన్ వచ్చింది. ఆ కాల్‌ను ఆయన తన జీవితంలో ఎన్నటికీ మరవలేరు. ఎందుకంటే ఫోన్ చేసింది అప్పటి రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్. ఫెడరేషన్ చేసిన కొన్ని సిఫార్సులను ఆ కార్యదర్శి పక్కన పెట్టారు. విదేశీ పర్యటనకు అనుమతి నిరాకరించారు. జట్టు ఎంపిక ప్రక్రియపై స్పష్టత ఇవ్వాలని కోరారు. అంతే...బ్రిజ్ భూషణ్‌లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఎందుకంటే అప్పటివరకూ ఫెడరేషన్‌లో ఆయన ఆడింది ఆట...పాడింది పాట. ఆయన మాటకు ఎదురు చెప్పే సాహసం ఎవరూ చేయలేదు. అందుకే కార్యదర్శికి ఫోన్ చేసి తాను ప్రజలు ఎన్నుకున్న ఎంపీని అంటూ గుర్తు చేశారు. పరుష పదజాలాన్ని ఉపయోగించారు. అయినా కార్యదర్శి లొంగలేదు. బ్రిజ్ బెదిరింపులకు పాల్పడే వ్యక్తి అంటూ ఘాటుగానే స్పందించారు.





ఫైల్

హర్యానాలో అన్నదాతల ఆందోళన..

- కురుక్షేత్ర-ఢిల్లీ జాతీయ రహదారి దిగ్బంధం



అమృత్‌సర్: హర్యానాలో రైతులు ఆందోళన తీవ్రరూపం దాల్చింది. ఈ క్రమంలో జాతీయ రహదారి-44 ను రైతులు దిగ్బంధించారు. పొద్దు తిరుగుడు పంటకు మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నిరసనకు దిగారు. ఈ నేపథ్యంలో ఆందోళన చేస్తున్న రైతులకు యూపీ, పంజాబ్ రైతులు మద్దతు తెలిపారు. అదేవిధంగా రైతులకు రెజ్లర్లు సైతం మద్దతు తెలిపారు. రైతులు మంగళవారం హర్యానాలోని కురుక్షేత వద్ద ఢిల్లీ-అమత్‌సర్ జాతీయ రహదారిని(ఎన్‌హెచ్ 44) దిగ్బంధం చేశారు. పొద్దు తిరుగుడు పువ్వు గింజలకు కనీస మద్దతు ధర ఇవ్వకూడదని హర్యానా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ రైతులు ఆందోళన చేపట్టారు. రైతులు జాతీయ రహదారిని దిగ్బంధం చేయడంతో ఢిల్లీ-అమత్‌సర్ జాతీయ రహదారి మీద ట్రాఫిక్ స్తంభించిపోయింది. పొద్దుతిరుగుడు విత్తనాలకు మద్దతు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రైతులు జాతీయ రహదారిపైకి చేరుకున్నారు. కురుక్షేత్ర జిల్లాలోని పిప్లి సమీపంలోని ఫ్లై ఓవర్‌పై వారు గుమిగూడారు. మహాపంచాయత్‌లో భారతీయ కిసాన్ యూనియన్ నాయకుడు రాకేష్ టికాయత్‌తో సహా కీలక రైతు నాయకులతో పాటు, రెజ్లర్ బజరంగ్ పునియా కూడా ఉన్నారు. రెజ్లర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఎఫ్ఐ) చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తున్న అగ్రశ్రేణి గ్రాప్లర్‌లలో అతను ఒకడు. రాష్ట్ర ప్రభుత్వం పొద్దుతిరుగుడు విత్తనాలను మద్దతు ధరకు కొనుగోలు చేయడం లేదని, తమ ఉత్పత్తులను క్వింటాల్‌కు రూ. 6,400 ఎంఎస్‌పీకి రూ. 4,000 చొప్పున ప్రయివేట్ కొనుగోలుదారులకు విక్రయించాల్సి వచ్చిందని నిరసన వ్యక్తం చేసిన రైతులు పేర్కొన్నారు. పొద్దుతిరుగుడు విత్తనాలను క్వింటాల్‌కు రూ.6,400 ఎంఎస్‌పీతో ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

స్ట్రింగర్లకు తొలగింపులు కాదు..

- వేతనాలు కావాలి : డీయూజే
- స్మృతి ఇరానీ, దైనిక్ భాస్కర్ తీరుపై విమర్శలు

న్యూఢిల్లీ : స్ట్రింగర్లకు తొలగింపులు కాదు.. వేతనాలు కావాలని ఢిల్లీ జర్నలిస్టుల యూనియన్ (డీయూజే) పేర్కొంది. న్యూస్ బైట్ కోసం ఒక జర్నలిస్టు చేసిన అభ్యర్థనపై కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ, దైనిక్ భాస్కర్ యాజమాన్యం చేసిన ఓవర్‌యాక్షన్‌పై డీయూజే దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. అయితే ఆశ్చర్యం కలిగించలేదని తెలిపింది. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. అమేథిలోని కృష్ణనగర్ చౌరహాలో పర్యటనకు వచ్చి తిరిగి వెళుతున్న కేంద్ర మంత్రి స్మృతి ఇరానీని ఇతర స్థానిక మీడియా ప్రతినిధులతో కలిసి కెమెరాపర్సన్ విపిన్ యాదవ్ ఒక వ్యాఖ్య అడిగాడు. దీనికి కేంద్ర మంత్రి అహంకారంగా, చిరాకుగా సమాధానంపై ఇచ్చారు. పైగా దైనిక్ భాస్కర్ యాజమాన్యానికి ఫిర్యాదు చేస్తానని బెదిరించారు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మీడియాలో వైరల్‌గా మారింది. ఈ నేపథ్యంలో యాదవ్‌ను, స్ట్రింగర్ రషీద్ హుస్సైన్‌ను తక్షణమే, నిర్మొహమాటంగా దైనిక్ భాస్కర్ యాజమాన్యం తొలగించింది. ఆ ప్రాంతంలో తమకు జర్నలిస్టు లేరని కూడా దైనిక్ భాస్కర్ ట్వీట్ చేసింది. అయితే ఇలా జర్నలిస్టును బహిరంగంగా అవమానించిన యాజమాన్యం మైక్ ఐడీని తిరిగి ఇవ్వమని ప్రయివేట్‌గా డిమాండ్ చేసింది. అధికారిక ఒప్పందం లేనప్పుడు ఇలాంటి మైక్ ఐడిలే ఉపాధికి ప్రధాన రుజువు. స్ట్రింగర్లకు తక్కువ వేతనం ఉంటుంది. ఇలాంటి ఉద్యోగులను అధికారబద్ధం చేయాలని, తగిన వేతనాలు ఇవ్వాలని డీయూజే డిమాండ్ చేసింది. జర్నలిస్టులను అవమానించే బదులు వారికి తగిన గౌరవం ఇవ్వాలని డీయూజే సూచించింది.

వాట్సాప్ డీపీగా ఔరంగజేబు ఫొటో

- అలా పెట్టుకున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన పోలీసులు

ముంబయి: మొబైల్ సర్వీస్ ప్రొవైడర్ అవుట్‌లెట్‌లో పనిచేస్తున్న ఓ యువకుడు తన వాట్సాప్ డీపీగా ఔరంగజేబు ఫొటోను పెట్టుకున్నాడు. ఇందుకు సంబంధించిన స్క్రీన్ షాట్ ను హిందూ సంస్థ పోలీసులకు సమర్పించింది. దీంతో సదరు వ్యక్తిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సెక్షన్ 298, 153 కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు విచారణ చేపట్టినట్లు చెప్పారు.

పేద దేశాల అభివృద్ధిని దెబ్బతీసేవి ఇవే

కోవిడ్, భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు

- అభివృద్ధి క్రమంలో ఎవరూ వెనుకబడకుండా చూడాలి : వారణాసిలో జి 20 సమావేశాన్ని ప్రారంభించిన ప్రధాని



న్యూఢిల్లీ : భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు, కోవిడ్ మహమ్మారి ఈ రెండు ప్రపంచంలోని పేద దేశాల్లోని అభివృద్ధిని ప్రభావితం చేశాయని ప్రధాని నరేంద్ర మోడీ పేర్కొన్నారు. వారణాసిలో జి 20 దేశాల అభివృద్ధి మంత్రుల సమావేశాన్ని సోమవారం ప్రధాని ప్రారంభించారు. అంతర్జాతీయ అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు అందరినీ కలుపుకుని పోయే, న్యాయమైన ప్రయత్నాలను చేయాలని మోడీ పిలుపిచ్చారు. "మహిళల నేతృత్వంలో" అభివృద్ధి నమూనాను భారత్ అనుసరిస్తోందని అన్నారు. ఈ సందర్భంగా విదేశాంగ మంత్రి జై శంకర్ మాట్లాడుతూ, సరఫరా చైన్ల అంతరాయాలను ఎదుర్కొనాల్సిన అవసరం వుందని అన్నారు. ఉమ్మడి సవాళ్ళను ఎదుర్కొనడానికి అభివృద్ధి చెందిన దేశాలు అనుసరించే 'లాభదాయకమైన వాటినే ఎంచుకోవడమనే' పద్ధతి సమర్ధవంతమైన మార్గం కాదని గుర్తు చేశారు. "అభివృద్ధి అనేది ప్రపంచ పేద దేశాలకు కీలకమైన అంశం. ప్రపంచవ్యాప్తంగా కోవిడ్ మహమ్మారి కలిగించిన అంతరాయాలు, ఆటంకాలకు పేదదేశాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ఆహార, ఇంధన, ఎరువుల సంక్షోభాలు తలెత్తడం మరో పెద్ద ఎదురు దెబ్బ. ఈ పరిస్థితుల్లో ఏ ఒక్కరూ కూడా వెనుకబడి పోకుండా చూడాల్సి వుంది." అని ప్రధాని మోడీ వీడియో సందేశంలో పేర్కొన్నారు. సమావేశంలో ఈ వీడియోను ప్రదర్శించారు. ప్రస్తుతం జి 20కి అధ్యక్ష బాధ్యతలు వహిస్తున్న భారత్ వారణాసిలో జరిగే జి 20దేశాల మంత్రుల సమావేశానికి ఆతిధ్యం ఇస్తోంది. సరఫరా చైన్లలో అంతరాయాలపై దృష్టి, ఆహార, ఇంధన భద్రతా సవాళ్ళు, వాతావరణ మార్పులు, కోవిడ్ నుండి కోలుకోవడం వంటి అంశాలపై ఈ సమావేశంలో ప్రధానంగా దృష్టి కేంద్రీకరించారు. ప్రధాని మోడీ సోమవారం నాటి తన ప్రసంగంలో ఉక్రెయిన్ సంక్షోభం గురించి స్పష్టంగా ప్రస్తావించలేదు. కానీ ఇప్పటివరకు భారత్ ఆతిథ్యమిచ్చిన జి-20 సంబంధిత కార్యక్రమాలన్నింటిలోనూ ఈ అంశం ప్రధానంగా ప్రస్ఫుటమవుతోంది.

డేటా డ్రైవ్ వల్ల ఎదురయ్యే సవాళ్ళను అధిగమించాల్సిందిగా జి 20దేశాలను మోడీ కోరారు. అభివృద్ధి లక్ష్యాల సాధనలో అత్యంత నాణ్యత కలిగిన డేటా చాలా కీలకమని వ్యాఖ్యానించారు. ప్రజలకు శక్తి సామర్థ్యాలను కలిగించడానికి, డేటా అందరికీ అందుబాటులోకి రావడానికి, సర్వతోముఖాభివృద్ధి సాధించడానికి సాంకేతికత అనేది ఒక సాధనంగా ఉపయోగపడుతుందని అన్నారు. భాగస్వామ్య దేశాలతో తన అనుభవాలు పంచుకోవడానికి భారత్ సుముఖంగా వుందన్నారు. మహిళలు అభివృద్ధి లక్ష్యాలను నిర్దేశిస్తున్నారని అన్నారు. మహిళల నేతృత్వంలో అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికను జి 20 చేపట్టాలన కోరారు. "భారతదేశంలో మహిళా సాధికారతకు మేం పరిమితం కాము, మాది మహిళల నేతృత్వంలో సాగే అభివృద్ధి క్రమం, అభివృద్ధికి మహిళలు ఎజెండాను రూపొందిస్తున్నారు. పైగా అభివృద్ధికి, మార్పుకు ఏజెంట్లుగా కూడా వారు వున్నారు." అని మోడీ పేర్కొన్నారు. అనంతరం జై శంకర్ ప్రసంగించారు. ప్రపంచ దేశాల్లో అస్సలు అభివృద్ధి చెందని ప్రాంతాలకు అనుకూలంగా మాట్లాడారు. అత్యవసరంలో వున్న అటువంటి వారి గురించి అంతర్జాతీయ సమాజం ముక్త కంఠంతో మాట్లాడాలన్నారు. కోవిడ్‌కు ముందుగానే సుస్థిర అభివృద్ధి లక్ష్యాల దిశగా పురోగతి మందగించిందని అన్నారు. తదనంతర కాలంలో తలెత్తిన కోవిడ్ మహమ్మారి ఈ పరిస్థితులను మరింత దుర్భరంగా తయారుచేసిందన్నారు. 2030నాటికల్లా సామాజిక రుగ్మతలను నిర్మూలించేందుకు గానూ 2016 జనవరి 1వ తేదిన 17 బృహత్తర సామాజిక, ఆర్థిక లక్ష్యాలను ఆమోదించారు. వాటినే ఎస్‌డిజి (సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు)గా పేర్కొంటారు.

18న ముస్లిం మహాపంచాయత్

హిందూ మతోన్మాదుల హెచ్చరికలు బేఖాతరు

డెహ్రాడూన్ : హిందూ మతోన్మాదుల హెచ్చరికలు బేఖాతరు చేస్తూ ఈ నెల 18న ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో మహాపంచాయత్ పేరిట సదస్సు నిర్వహించాలని ముస్లిం నేతలు నిర్ణయించారు. ముస్లిం వ్యాపారులు వెంటనే నగరం విడిచి వెళ్లాలంటూ హిందూత్వ గ్రూపులు బెదిరింపులకు దిగాయి. పురోలాలో ఇద్దరు వ్యక్తులు 14 సంవత్సరాల హిందూ బాలికను కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించిన నేపథ్యంలో ఉత్తరకాశీ నుండి వెళ్లిపోవాలని ఈ నెల ఐదున ముస్లిం వ్యాపారుల్ని హెచ్చరించారు. కిడ్నాప్‌కు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో ఒక ముస్లిం, ఒక హిందువు ఉన్నారు. ఇది లవ్ జిహాద్ ఉదంతమేనని హిందూత్వ వాదులు వాదిస్తున్నారు. హెచ్చరికలతో కూడిన పోస్టర్లను పురోలా ప్రధాన మార్కెట్ ప్రాంతంలో అతికించారు. దీంతో చాలా మంది ముస్లింలు భయంతో పట్టణాన్ని విడిచిపెట్టి వెళ్లిపోయారు. ముస్లింల దుకాణాలను గుర్తించేందుకు వీలుగా వాటి వెలుపల ఇంగ్లీషు 'ఎక్స్' అక్షరాన్ని రాశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి ముస్లింలు పెద్ద సంఖ్యలో సదస్సుకు హాజరవుతారని ముస్లిం సేవా సంఘటన్ మీడియా విభాగం ఇన్‌ఛార్జ్ వసీమ్ అహ్మద్ చెప్పారు. నిందితులను శిక్షించవలసిందేనని, అయితే ముస్లిం సమాజాన్ని అంతటినీ లక్ష్యంగా చేసుకోవడం సరికాదని డెహ్రాడూన్‌కు చెందిన మత గురువు మహమ్మద్ అహ్మద్ ఖాసిం అభిప్రాయపడ్డారు. ఇదిలావుండగా ఉత్తరకాశీలోని ముస్లింలను లక్ష్యంగా చేసుకొని సామాజిక మాధ్యమాలలో విద్వేషపూరిత వ్యాఖ్యలు వెలువడుతున్నాయి. ఉత్తరాఖండ్ నుండి జిహాదీలను తరిమేయాలని హిందూత్వవాది ప్రబోధానంద గిరి డిమాండ్ చేశారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినందుకు ఆయనపై గతంలోనే కేసు నమోదైంది. ముస్లింలు నగరాన్ని వదిలి వెళ్లకపోతే ఈ నెల 20న ప్రదర్శన నిర్వహిస్తామంటూ జిల్లా మెజిస్ట్రేట్‌కు బజరంగ్‌దళ్ లేఖ రాసింది.

రాహుల్‌గాంధీకి ఊరట



ముంబయి: పరువునష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఊరట లభించింది. కోర్టు హాజరు నుంచి మినహాయింపునిస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ముంబయి హైకోర్టు పొడిగించింది. ఆగస్టు 2 వరకు ప్రత్యక్ష హాజరు నుంచి మినహాయింపునిచ్చింది. 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో మోదీ ఇంటిపేరుపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలకుగానూ భాజపాకి చెందిన మహేశ్ శ్రీశ్రీమల్ 2021లో పరువునష్టం పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణకు రాహుల్ గాంధీ ప్రత్యక్షంగా హాజరు కావాలంటూ గతంలో స్థానిక కోర్టు సమన్లు జారీ చేసింది. దీనిని సవాల్ చేస్తూ రాహుల్ గాంధీ ముంబయి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై ఇటీవల విచారణ చేపట్టిన జస్టిస్ ఎస్వీ కొత్వాల్ నేతత్వంలోని సింగిల్ బెంచ్ ధర్మాసనం తీర్పును వాయిదా వేసింది. తాజాగా రాహుల్ గాంధీ హాజరు మినహాయింపును ఆగస్టు 2 వరకు పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు ఇదే అంశంలో గుజరాత్ భాజపా ఎమ్మెల్యే పూర్ణేశ్ మోదీ పరువునష్టం దావా వేయడంతో.. సూరత్ కోర్టు రాహుల్‌గాంధీని దోషిగా తేల్చిన సంగతి తెలిసిందే. ఆయనకు రెండేళ్ల జైలు శిక్ష విధించిన న్యాయస్థానం.. వెంటనే బెయిల్ కూడా మంజూరు చేసింది. ఈ తీర్పును పై కోర్టులో అప్పీలు చేసుకునేందుకు అవకాశం ఇచ్చింది. రెండేళ్ల జైలు శిక్ష విధించిన నేపథ్యంలో రాహుల్ గాంధీ ఎంపీ సభ్యత్వాన్ని లోక్‌సభ సెక్రెటేరియేట్ రద్దు చేసింది. దీనిని సవాల్ చేస్తూ రాహుల్‌గాంధీ గుజరాత్ హైకోర్టును ఆశ్రయించారు. తనకు విధించిన శిక్షను నిలిపేయాలంటూ వేసిన స్టే పిటిషన్‌ను సూరత్ సెషన్స్ కోర్టు తిరస్కరించిన నేపథ్యంలో.. న్యాయస్థానం తీర్పును సవాల్ చేస్తూ ఆయన తాజాగా గుజరాత్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఉన్నత న్యాయస్థానం విచారణ చేపట్టాల్సి ఉంది.

ఆర్టీసీలో జేఏసీ ఏర్పాటుకు ప్రయత్నాలు

- భేటీ అయిన ఆరు సంఘాలు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

టీఎస్ఆర్టీసీలో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సంయుక్త కార్యాచరణ కమిటీ (జేఏసీ) ఏర్పాటు చేయాలని ఆరు సంఘాలు అభిప్రాయపడ్డాయి. సోమవారం రాత్రి నాడిక్కడి బీఎమ్ఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఈ అశ్వత్థామరెడ్డి (టీఎమ్‌యూ), కే హన్మంతు ముదిరాజ్ (టీజేఎమ్‌యూ), ఎర్ర స్వామి కుమార్ (కార్మికసంఘ్), జీ అబ్రహం (ఐఎన్‌టీయూసీ), సుద్దాల సురేష్ (బీడబ్ల్యూయూ), డీ సాయిలు (ఎస్‌డబ్ల్యూయూ)తో పాటు ఎస్ఎమ్‌యూ నేతలు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. కార్మిక పరిషత్, ఎస్‌టీఎమ్‌యూ కూడా జేఏసీ ఏర్పాటుకు అంగీకారం తెలిపాయని నాయకులు చెప్పారు. ఎంప్లాయీస్ యూనియన్, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, బీకేయూ సంఘాలు సమావేశానికి హాజరు కాలేదనీ, ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్టీసీని కాపాడుకోవలసిన అవసరం ఉన్నందున వారు కూడా సహదయంతో విశాల దక్పథంతో కలిసిరావాలని నాయకులు కోరారు. ఐక్యంగా ఉద్యమించి ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించుకుందామని చెప్పారు. జేఏసీగా ఏర్పడాలని ఈ సమావేశంలో తీర్మానం చేసినట్టు తెలిపారు. ఈనెల 19న మరోసారి అన్ని సంఘాలతో భేటీ కావాలని నిర్ణయించామన్నారు.

సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ ఫలితాలు విడుదల

న్యూఢిల్లీ : పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్‌సీ) నిర్వహించిన సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పరీక్ష ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. సివిల్స్ ఫలితాలతోపాటు ఇండియన్ ఫారెస్ సర్వీసెస్ (ఐఎఫ్ఎస్) ఫలితాలను కూడా విడుదల చేశారు. 2023 సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలో 14,624 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. మెయిన్స్ పరీక్షను సెప్టెంబర్ 15న నిర్వహించనున్నట్లు తెలిపింది. సీరియల్ నంబర్లు, రోల్ నంబర్లు, ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల పేర్లతో కూడిన జాబితా యుపిఎస్‌సి వెబ్‌సైట్‌లో ఉంచింది. ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు మెయిన్స్ పరీక్ష కోసం డీటెయిల్డ్ అప్లికేషన్ ఫారం-1 (డిఎఎఫ్-1)లో మరోసారి దరఖాస్తు చేసుకోవాలని యూపీఎస్‌సి తెలిపింది. దీనికి సంబంధించిన గడువు తేదీని త్వరలోనే ప్రకటించనున్నారు. ప్రిలిమ్స్ అభ్యర్థులు తమ ఫలితాలను upsc.gov.in వెబ్ సైట్లో చూసుకోవచ్చు. 'మార్క్స్, కటాఫ్ మార్కులు, ప్రిలిమ్స్ 2023 ఆన్సర్ కీ వంటి వాటిని పరీక్షల ప్రక్రియ పూర్తిగా ముగిసిన తరువాత వెల్లడిస్తామని తెలిపింది.

వర్షాకాలం జాగ్రత్తలు తీసుకోండి

- ద.మ.రైల్వే జీఎమ్ అరుణ్‌కుమార్ జైన్ ఆదేశాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సురక్షిత పని పరిస్థితులు, రైలు కార్యకలాపాల రిజిస్టర్ల సరైన నిర్వహణతోపాటు వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని కచ్చితంగా పాటించాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ అధికారుల్ని ఆదేశించారు. సోమవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో జోన్ పరిధిలోని విజయవాడ, గుంతకల్, గుంటూరు, సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్లు, ఇతర ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్క్‌సైట్‌లో భద్రతా అవసరాలను తప్పకుండా పాటించాలని చెప్పారు. ఎలక్ట్రికల్, మెకానికల్, సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్స్, ఆపరేటింగ్, ఇంజినీరింగ్ వంటి అన్ని విభాగాలతో కలిసి నెల రోజులపాటు చేపట్టిన సేఫ్టీ డ్రైవ్‌ను కూడా ఆయన సమీక్షించారు. రైలు కార్యకలాపాలకు సంబంధించిన రిజిష్టర్లను సక్రమంగా నిర్వహించాలన్నారు. రుతుపవన జాగ్రత్త చర్యలను చేపట్టాలని చెప్పారు. పర్యవేక్షకులు క్షేత్రస్థాయి కార్యచరణను నిరంతరం సమీక్షిస్తూ ఏ సమస్య వచ్చినా తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. లోకో పైలట్‌లు, రన్నింగ్ సిబ్బంది పని వేళలను పరిశీలించారు. 'ఒక స్టేషన్ ఒక ప్రొడక్ట్' స్టాల్స్ నిర్వహణను అడిగి తెలుసుకున్నారు.